www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

16

ప్రకాశం

గురువారం 31 ఆగస్టు, 2017

ట్రావెల్స్ బస్సు దగ్ధం



కాలిపోతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

3 లో

డ్రైవర్ సమయ స్ఫూర్తి


ప్రాణాలతో బయటపడిన 44 మంది ప్రయాణికులు

కడప నుంచి మంగళవారం రాత్రి 9.30 గంటలకు 44 మంది ప్రయాణికులతో విజయవాడ బయలుదేరిన మేఘనా ట్రావెల్స్ బస్సు హనుమంతునిపాడు మండలం మహమ్మదాపురం ఘాట్‌రోడ్డులో దగ్ధమైంది. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వేములపాడు - మహమ్మదాపురం ఘాట్ రోడ్డుకు బస్సుచేరుకుంది. ఆ సమయంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ కేశవ లోపలి నుంచి కాలిపోతున్న వాసన రావటాన్ని గమనించి కిందకి దిగి పరిశీలించారు. ఇంజన్‌లో నుంచి పొగలు చిన్నగా మంటలు రావటం చూసి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ఐదు నిమిషాల్లోపే ప్రయాణికులందరినీ కిందికి దించి వేశాడు. ఆ తర్వాత కొద్ది నిమిషాల్లోనే డీజిల్ ట్యాంకుకు మంటలు అంటుకొని ఒక్కసారిగా పేలిపోయి బస్సు పూర్తిగా కాలిపోయింది.

కదలని రైతు రథం



మంత్రికి వివరాలు తెలుపుతున్న జేడీఏ మురళీకృష్ణ



- ఖరీఫ్ ముగుస్తున్నా కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక
- నేటికీ అందని జాబితాలు
- కొన్ని చోట్ల పోటాపోటీగా నేతల సిఫార్సులు
- మావే ఆమోదించి ఇన్‌చార్జి మంత్రికి పంపాలని ఒత్తిళ్లు
- తల పట్టుకుంటున్న అధికారులు

జిల్లాలో రైతు రథం (సబ్సిడీ ట్రాక్టర్లు) ముందుకు కదలడం లేదు. ఖరీఫ్ సీజన్ మరో నెలలో ముగుస్తున్నా ఇంత వరకు లబ్ధిదారుల ఎంపిక ఓ కొలిక్కి రాలేదు. పరిమిత సంఖ్యలో కేటాయింపుల వల్ల లబ్ధిదారుల ఎంపిక అధికార పార్టీ నేతలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో అధికారులకు జాబితాలు ఇవ్వడంలో నేతల్లో జాప్యం నెలకొంది. ఇప్పటి వరకు సగం నియోజకవర్గాల నుంచి జాబితాలు అందలేదు. కొన్ని నియోజకవర్గాల నుంచి రెండు, మూడు జాబితాలు ఇస్తుండటంతో ఏం చేయాలన్నది అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

ఈ వ్యవసాయ సీజన్ (ఖరీఫ్) ప్రారంభంలో సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్లు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రైతు రథం పేరుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ట్రాక్టర్లను ఇవ్వాలని తలంచింది. ఒక్కొక్క నియోజకవర్గానికి 33 లేదా 34 శాతం సబ్సిడీ పై జిల్లాకు 400 ట్రాక్టర్లు మంజూరు చేసింది. ఒక్కో ట్రాక్టర్‌కు లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల వరకు సబ్సిడీ ఉండటంతో వీటికి గ్రామీణ ప్రాంతాల రైతుల నుంచి భారీ డిమాండ్ వస్తున్నది. రెండు నుంచి ఐదు ఎకరాల లోపు ఉండే సన్న చిన్న కారు రైతులు దీనికి అర్హులు. కాగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు నెంబరుతో మిగతా 15వ పేజీలో...



ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే రైతు రథం

దొరికాడు మృగాడు

- చిన్నారిపై అత్యాచారం, హత్య
- 40 రోజుల క్రితం పెదఇర్లపాడులో ఘటన
- అప్పటి నుంచి పరారీలో నిందితుడు పెద పేరయ్య
- గుంటూరు జిల్లా పొన్నూరులో అరెస్టు

3 లో



నిందితుడు పేరయ్య

జెన్‌కో భూములకు విముక్తి

- భూసేకరణ ఉపసంహరణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మూడు గ్రామాల్లోని 4 వేల ఎకరాలకు విముక్తి
- 20 గ్రామాల ప్రజలకు ఊరట
- నాటి ఉద్యమాలకు నేడు ఫలితం

15 లో



కనపర్తి ప్రాంతంలో నాటి ప్రభుత్వం సేకరించిన భూములు (ఫైల్)

పౌర సమాజం ఏర్పాటులో భాగస్వామ్యం



సెంటర్ ప్రెస్‌తో

- సమాచార చట్టాన్ని ఆయుధంగా చేసుకోవాలి
- శిక్షణ తరగతుల్లో కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్

ఇంటర్వ్యూ



ఏరువాక శాస్త్రవేత్త రమేష్

చిరు ధాన్యాల సాగు ఎంతో ప్రయోజనకరం

చిరుధాన్యాల సాగు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి ?

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు. వాణిజ్య పంటల మోజులో అధిక పెట్టుబడులు పెట్టి కొంతమంది నష్టపోతున్నారు. ఆహార పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర తదితర పంటల సాగుకు ప్రస్తుత వాతావరణం ఎంతో అనుకూలం. వ్యవసాయశాఖ నవధాన్యాల పేరుతో సబ్సిడీపై విత్తన సంచులను సరఫరా చేస్తుంది.

జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో కందిసాగు అవుతుంది. ఎప్పటి వరకు సాగు చేయవచ్చు ?

ఆగస్టు నెలాఖరు వరకు సాగు చేసుకోవచ్చు. ప్రస్తుత వర్షాలకు సెప్టెంబరు నెలలోనూ సాగు చేయవచ్చు. విత్తన మోతాదును రెండు కిలోల నుంచి ఐదారు కిలోల వరకు వాడాలి. ఆలస్యంగా సాగు చేసేటప్పుడు సాలుకు, సాలుకు మధ్య దూరం పెంచుకోవాలి. తద్వారా దిగుబడి బాగా వచ్చే అవకాశాలు ఉంటాయి.

ఏ రకం విత్తనాలను విత్తుకోవచ్చు? అంతర్‌పంటగా మినుము సాగు చేయవచ్చా ?

ఎల్‌ఆర్‌జీ - 41, ఎల్‌ఆర్‌జీ - 52 విత్తనాలను విత్తుకోవడం ద్వారా దిగుబడులను బాగా సాధించవచ్చు. అంతర్‌పంట మినుము సాగు చేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఒక పంట దెబ్బతిన్నా మరో పంట వల్ల రైతులు నష్టపోరు.

మినుములో ఏ రకాలు విత్తుకోవాలి ?

మినుము సాగుకు సెప్టెంబరు చివరి వారం ఎంతో అనుకూలం. ముందుగా విత్తుకుంటే తెగుళ్లు ఎక్కువగా వ్యాపించే ప్రమాదం ఉంది. తద్వారా దిగుబడులు తగ్గుతాయి. సెప్టెంబరు ఆఖరివారంలోనే సాగు చేసుకోవాలి. పల్లాకు తట్టుకునే రకాలైన పియు.31, 7బిజి 104, జిబిజి -1 వెరైటీలను సాగు చేసుకోవాలి.


పత్తిలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి ?

ప్రస్తుత వర్షాలు పత్తికి ఎంతో మేలు చేస్తాయి. ఎకరాకు 25కిలోల యూరియా, 15 కిలోలు పొటాష్‌ను కలిపి మొక్క మొదట్లో వేయడం వల్ల దిగుబడులు బాగా పెరుగుతాయి.

-ఒంగోలు వ్యవసాయం

పైరుకు తెగులు సోకింది. పురుగుమందుల షాపు వ్యాపారి చెప్పిందే రైతుకు వేదం. అదే మందు కొంటాడు. పైరుపై పిచికారీ చేస్తాడు. వేలకు వేలు ఖర్చవుతాయి. ఉపయోగం ఉండదు. పురుగు ఇంకా ఉధృతమవుతుంది. అప్పోసప్పో చేసి మళ్లీ మరో మందువాడతాడు. ఈ క్రమంలో రైతు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి తనంతటతానుగా అప్పుల ఊబిలో కూరుకుపోతాడు.

అదే సమస్య... శాస్త్రీయతకు సాంకేతికత జోడిస్తే తక్కువ ఖర్చులో మంచి ఫలితం పొందొచ్చు. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో తెగులు సోకిన పైరును ఫొటో తీసి పంపిస్తే దాని నివారణకు సంబంధించి శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞుల సలహాలు, పరిష్కార మార్గాలు అందులో ప్రత్యక్షమవుతాయి. ఇదంతా అతి తక్కువ ఖర్చుతోపాటు చిటికెలో పరిష్కారం దొరుకుతుంది.



యాప్ ఇదే

రైతుకు ప్లాంటిక్స్ యాప్ అండ

- తెగుళ్ల నివారణకు సూచనలు వెంటనే

- తెలుగులోనూ సమాచారం

- సహకారం అందిస్తున్న ఇక్రిశాట్

వేటపాలెం : మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. రైతు వెచ్చించే ఖర్చులో పురుగు మందులదే సింహభాగం. పంటలో తెగులు కనిపిస్తే చాలు ఏ మందులు పిచికారీ చేయాలో అర్థంకాక రైతులు ఆందోళన చెందుతుంటారు. పైరు, తెగులును సరిగా పరిశీలించకుండానే వ్యాపారులు చెప్పిందే వేదంగా రైతులు పురుగుమందులను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు వచ్చి పంటను పరిశీలించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇలాంటి దీర్ఘకాలంగా ఉన్న ఇబ్బందులు తీర్చేందుకు ప్రత్యేకంగా తెగుళ్ల నివారణలు సూచించేందుకు మొబైల్ యాప్‌ను ఇటీవల రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్లాంటిక్స్(పీఎల్‌ఏఎన్‌టీఐఏఎక్స్) అనే ఈ యాప్ ద్వారా రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. మారుతున్న ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి దగ్గర ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయి. ఓ ప్రైవేటు మొబైల్ కంపెనీ సర్వే ప్రకారం ప్రస్తుతం 80 శాతం మంది రైతుల వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. ఇలాంటి వారికి ఈ నూతన యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికే లక్ష మందికిపైగా ఈ యాప్‌ను ఉపయోగించుకుని తెగుళ్ల సమాచారాన్ని గుర్తించగలుగుతున్నారని వ్యవసాయాధికారుల అంచనా, ఈ యాప్‌ను జర్మనీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఇది అక్కడ ఫలితాలు సాధించడంతో మన దేశంలోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ఇక్రిశాట్ అధికారులు జర్మనీతో ఒప్పందం చేసుకున్నారు. మొదటిగా హిందీ భాషలో అందుబాటులోకి రాగా రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ చొరవతో ఈ ఏడాది జూన్ నుంచి తెలుగు భాషలో లభ్యమయ్యేలా రూపొందించారు. ప్రస్తుతం ఈ యాప్ డచ్, ఇంగ్లీషు, ఫ్రెంచ్, పోర్చుగీసు, హిందీ, తెలుగ భాషల్లో అందుబాటులో ఉంది.



వరి చేను

జీపీఎస్ సహకారంతో వాతావరణ సూచనలు

వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం వంటి విషయాలు తెలుసుకునేందుకు ఈ యాప్‌లో ఆప్షన్లు ఉన్నాయి. మొబైల్ జీపీఎస్ ఆప్షన్ ఆన్‌చేస్తే ఆ ప్రాంతానికి సంబంధించిన వాతావరణ సమాచారం తెలుస్తుంది.

యాప్ వాడేదిలా...

ఆండ్రాయిడ్ వెర్షన్‌లో ఈ యాఫ్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. తర్వాత పంటల వారీగా ఆప్షన్లు కనిపిస్తాయి. ఏ పంటపై తెగుళ్ల సమాచారం కావాలో ఆ పంట ఐకాన్‌పై క్లిక్ చేస్తే కెమెరా తెరుచుకుంటుంది. చెట్టుకు తెగులు ఉన్న చోట ఫొటో తీసి ఆప్‌లోడ్ చేస్తే కొద్ది సేపటికే ఆ తెగులుకు సంబంధించిన వివరాలు, లక్షణాలు, పిచికారీ చేయాల్సిన మందుల వివరాలతో శాస్త్రవేత్తలుగానీ, అనుభవజ్ఞులైన రైతులు నుంచి కానీ సమాచారం వస్తుంది. సూచించిన మందులు తెచ్చుకుని పిచికారీ చేస్తే సరిపోతుంది. ఎంత మోతాదులో వాడాలో కూడా వివరాల్లో ఉంటుంది. దీనికి ఇంటర్‌నెట్ సదుపాయం తప్పనిసరి.



అందుబాటులో ఉన్న పంటల వివరాలు

ప్రస్తుతం వరి, అరటి, కంది, గోధుమ, చిక్కుడు, టమాట, దానిమ్మ, పత్తి, బంగాళాదుంప, బొప్పాయి, మామిడి, పెసలు, మినుములు, మిర్చి, మొక్కజొన్న, వంకాయ, సెనగ, సోయాబీన్ వంటి 18 రకాల పంటలకు సంబంధించి ఐకాన్‌లు ఈ యాప్‌లో అందుబాటులో చేయడంతో ఇతర పంటల వివరాల కోసం ఈ ఐకాన్‌ను ఎంచుకుంటే మిగిలిన పంటకు సంబంధించిన సమాచాన్ని తెలుసుకునే అవకాశం ఉంది.

పట్టణ ప్రజలకు సత్వర సేవలకు సర్వే

అద్దంకి నగర పంచాయతీలో ప్రారంభం

జీఐఎస్ సర్వే ద్వారా ప్రతి ఇంట్లో 59 అంశాలపై ఆరా

అద్దంకి వచ్చిన ఆర్‌ఎస్‌ఐ బృందం

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 16 మున్సిపాల్టీల్లో సర్వే

అద్దంకిటౌన్ : అద్దంకి నగర పంచాయతీలోని ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అత్యంత సులువుగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్(జీఐఎస్)సర్వే చేపట్టింది. ప్రతి ఇంటినీ సర్వే చేస్తారు. ఆ గృహానికి సంబంధించి సభ్యుల ఆధార్ కార్డు నెంబర్లు, మొబైల్, కరెంట్ బిల్లు, ఇంటి పన్ను, వాటర్ బిల్లు, ఇంటి నెంబర్, ఇంటిలో ఉన్న వసతులు వంటి 59 అంశాలపై సర్వే నిర్వహిస్తారు. ఆ వివరాలన్నీ క్రోడీకరించి జియోట్యాగింగ్ ద్వారా నమోదు చేస్తారు. దీనిద్వారా ప్రజలకు వివిధ రకాలు సేవలను సత్వరమే అందించడంతో పాటు పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుంది. అలాగే ప్రతి ఇంటికీ ప్రస్తుతం ఉన్న నెంబర్లు మార్చు చేసి శాస్త్రీయ పద్ధతిలో కేటాయించనున్నారు.

చైర్‌పర్సన్, కమిషనర్‌తో సర్వే బృందం భేటి

బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎస్‌టీ సర్వే బృందం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ పరిమి దయామణి, ఇతర విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఐ ప్రాజెక్టు మేనేజర్ గోపి శ్రీకాంత్, విజయ్ మాట్లాడుతూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 16 మున్సిపాల్టీల్లో సర్వే చేస్తామన్నారు. సర్వే బృందాలకు ప్రజలందరూ సహకరించి వారు అడిగిన వివరాలు తెలిపి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ నారాయణరావు కోరారు.



సర్వే బృందంతో మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

దొరికాడు మృగాడు

- చిన్నారిపై అత్యాచారం, హత్య
- కూరగాయల వ్యాపారి ఇచ్చిన సమాచారమే ఆధారం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సత్యఏసుబాబు



నిందితుడిని విలేకరులకు చూపించి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఏసుబాబు

ఒంగోలు క్రైం : పైశాచికం, నేర ప్రవృత్తిగల నేపథ్యం పసిబాలికపై అత్యాచారానికి ఉసిగొల్పి అంతమొందించిన ఉదంతమిది. అభంశుభం తెలియని చిన్నారిపై నేర ప్రవృత్తిగల పెదపేరయ్య ఆత్యాచారం చేసి ఆపై హత్యచేసి బాలిక వద్ద ఉన్న ఆభరణాలతో పరారయ్యాడు. ఈ దుర్ఘటన గతనెల 20వ తేదీన పీసీపల్లి మండలం పెద ఇర్లపాడు గ్రామంలో జరిగింది. నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, గుండవోలు గ్రామానికి చెందిన దుగ్గినేటి బ్రహ్మయ్య ఆయనభార్య పుష్పాలు పీసీపల్లి మండలం కోదండరామపురంలో కూలి పనులు చేసుకుంటున్నారు. బ్రహ్మయ్య ఐదేళ్ల కుమార్తె సియోనుకుమారికి ఆరోగ్యం బాగులేకపోవడంతో పెదఇర్లపాడు ఆసుపత్రికి తీసుకురాగా తిరిగి ఇంటికి వెళ్ళే సమయంలో బాలికను గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన అనంతరం హత్య చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రావూరి పెదపేరయ్యను అరెస్టు చేశారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ బి.సత్య ఏసుబాబు బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నేర చరిత్ర కలిగిన పెద పేరయ్యను గుంటూరు జిల్లా పొన్నూరు రైల్వేట్రాక్ ఒవర్‌బ్రిడ్జికింద ఆరెస్టు చేశామని చెప్పారు. పొన్నలూరు మండలం సింగరబొట్లపాలెంలో నివాసం ఉండే పెద పేరయ్య కుటుంబలో ఎక్కువ మంది నేర చరిత్ర కలిగిన వారు ఉన్నారని ఎస్పీ తెలిపారు. నిందితుడుపై సుమారు 21 దొంగతొనం కేసులు ఉన్నాయన్నారు. సంత నూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామంలోని పూజారి ఇంట్లో కిటికీ పగుల కొట్టి అమ్మవారి అభరణాలు దొంగిలించా డని, పొన్నూరు మండలం మూలకుదురు గ్రామంలో వెంకయ్యగుడిలో హుండీ పగులకొట్టి నగదు చోరీ చేశాడని, ఒంగోలు, సత్తుపల్లి, తెలంగాణలోని ఖమ్మం జిల్లాల్లో పెదపేరయ్య జైలు జీవితం గడిపాడని ఆయన తెలిపారు. సియోను కుమారిని హత్య చేసిన తర్వాత ఆమె వద్ద ఉన్న బంగారు చెవిదుద్దులు, కాళ్ళ పట్టీలు తీసి గుంటూరులోని రత్నా పాన్ బ్రోకర్స్ వద్ద కుదవ పెట్టగా స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు.

సియోను కుమారిని వైద్యం కోసం ఆమె తండ్రి బ్రహ్మయ్య పెదఇర్లపాడుకు తీసుకొచ్చిన క్రమంలో బస్టాండ్ సెంటర్‌లో బ్రహ్మయ్యకు అపరిచిత వ్యక్తి పరిచమై ఫోన్ చేయాలంటూ బ్రహ్మయ్య ఫోన్ తీసుకొని గణేష్ అనే వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అక్కడి నుంచి కొద్ది దూరం వెళ్లాక బ్రహ్మయ్యకు 200 ఇచ్చి మద్యం తెమ్మని చెప్పాడు. దీంతో బ్రహ్మయ్య సెల్‌ఫోనును ఆ అపరిచిత వ్యక్తికి ఇచ్చి సియోను అక్కడే వుంచి వెళ్ళాడు. తిరిగి వచ్చేసరికి అపరిచతి వ్యక్తి తన కుమార్తె కనిపించలేదు. దీంతో బ్రహ్మయ్య పీసీపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేరోజు సాయంత్రం సియోను పెదిర్లపాడు చెరువు సమీపంలో విగతజీవిగా కన్పించింది.

ఇదిలావుండగా పెదపేరయ్య పెద ఇర్లపాడులో నివాసముంటున్న తన ఆక్క, తమ్ముళ్లను వెదుక్కుంటూ వచ్చాడు. అక్కడ కూరగాయలు అమ్ముకొనే చెన్నమ్మవద్దకు వెళ్ళి తన అక్క డబ్బాయమ్మ ఎక్కడ ఉంటుందని విచారించాడు. ఆమెను రెండు నెలల క్రితం చూడటమేనని తరువాత తనకు తెలియదని చెప్పింది. ఆసమయంలో పేరయ్యతోపాటు బ్రహ్మయ్య కూడా ఉన్నాడు. అదే విషయాన్ని బాధితుడు పోలీసులకు చెప్పడంతో వారు కూరగాయల వ్యాపారి చెప్పిన మేరకు డబ్బాయమ్మను విచారించగా పెదపేరయ్య దొరకాడు.

పోలీసులకు ఎస్పీ అభినందన

కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ ఏసుబాబు అభినందించారు. కందుకూరు డీఎస్పీ కె.ప్రకాశ రావు, కనిగిరి సీఐ ఎం.సుబ్బారావు, కందు కూరు ఎస్సై టి.శ్రీరామ్, పీసీపల్లి ఎస్ఐ డి.రామకృష్ణ, పామూరు ఎస్ఐ వి.సాంబ శివయ్య, హెడ్‌కానిస్టేబుళ్ల రవి, కానిస్టేబళ్లు కె.మురళి, ఎన్.ప్రవీణ్, ఎం.రంగస్వామి, నజీర్, హోంగార్డులు రమణయ్య, రవి, సీసీఎస్ ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ బాలా, చంద్ర, కానిస్టేబుళ్లు ఖాదర్, అంజిబాబు, వెంకటేశ్వర్లు, ఐటీ కోర్‌టీమ్ రవి, రాజు, శంకర్‌ను ఎస్పీ అభినందించారు.



ప్రమాదంలో దగ్ధమైన బస్సు

ట్రావెల్స్ బస్సు దగ్ధం

- ఘాట్‌రోడ్డులో ప్రమాదం
- షార్ట్‌సర్క్యూటే కారణం
- డ్రైవర్ అప్రమత్తం
- ప్రాణాలతో బయటపడిన ప్రయాణికులు

కనిగిరి : అగ్ని ప్రమాదంలో మేఘన ఏసీ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. అర్ధరాత్రి అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను కళ్లారా చూసిన ప్రయాణికులు భయోత్పాతానికి గురయ్యారు. కడప నుంచి విజయవాడకు 44 మంది ప్రయాణికులతో బయలుదేరిన మేఘన ట్రావెల్స్‌కు చెందిన ఏసీ బస్సు బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో హనుమంతునిపాడు మండలంలోని మహమ్మదాపురం ఘాట్‌రోడ్డులో కాలిపోయింది. బస్సు డ్రైవర్ ఎస్.కేశవ ప్రమాదాన్ని ముందే గ్రహించారు. బస్సును ఘాట్‌రోడ్డు పక్కగా నిలిపివేసి ప్రయాణికులను కిందికి దింపేశారు. కమురు వాసన రావడంతో బస్సు కింద ఇంజన్‌ను పరిశీలించగా సన్నగా మంటలు రావడం.. కొద్ది సేపటిలో మంటలు చెలరేగి బస్సు పేలిపోయి అగ్నికి ఆహుతయింది. ఆయిల్ ట్యాంకర్ పేలిన శబ్దాలు రెండు కి.మీల దూరంలోని మహమ్మదాపురం, వేములపాడు గ్రామస్తులకు విన్పించాయి.

డ్రైవర్ సమయస్ఫూర్తే ప్రాణాలను కాపాడింది

బస్సు డ్రైవర్ ఎస్.కేశవ కడప జిల్లా పోరుమామిళ్ళకు చెందినవాడు. గత 12 సంవత్సరాలుగా ఏసీ ట్రావెల్స్ బస్సులు నడపటంలో మంచి ప్రావీణ్యత వుండడంతో ప్రమాదాన్ని ముందే గ్రహించి ఐదు నిమిషాల్లో ప్రయాణికులను కిందికి దింపేడంతో అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. లేకుంటే ఘోర ప్రమాదమే జరిగి ఉండేది. డ్రైవర్ కేశవను ప్రయాణికులు అభినందించారు.

ఇదిలావుండగా ఆందోళనతో బస్సు దిగుతున్న ప్రయాణికులు తమ లగేజీని కొందరు బస్సులోనే వదిలేయడంతో కాలిబూడిదయ్యాయి. ప్రమాద విషయాన్ని బస్సుడ్రైవర్ నంద్యాలలోని మేఘన ట్రావెల్స్‌కు సమాచారం ఇవ్వటంతో మేనేజర్ శేఖర్‌రెడ్డి ఐదు ప్రత్యేక వాహనాలతో వెంటనే ప్రమాద స్థలికి చేరుకున్నారు. ఆ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించి విజయవాడకు తరలించారు. కనిగిరి నుంచి అగ్నిమాపక యంత్రం సి బ్బంది వచ్చేసరికి బస్సు పూర్తిగా కాలిపోయింది. సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ హరిబాబు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఈ. చంద్రావతి, డీటీలు, వీ ఆర్వోలు ప్రమాదాన్ని పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక పంపారు.

అద్దంకిలోని కాకానిపాలెంలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు మాయం



బీరువాలో పోయిన బంగారం, నగదు

అద్దంకి: అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో గోరంట్ల శ్రీనివాసరావు ఇంట్లో చోరి జరిగింది. పోలీసుల కథనం మేరకు గోరంట్ల శ్రీనివాసరావు దంపతులు గత 15 రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు వెళ్లారు. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం అల్లుడు ప్రభాకర్ అద్దంకిలోని ఇంటికి వచ్చి హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం ఉదయం శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి అద్దంకి వచ్చాడు. ఇంట్లో వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి వున్నాయి. దొంగలు కిటికీ పగులగొట్టి రెండు బెడ్ రూములలో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బీరువాలోని ఒకటిన్నర సవర్ల బంగారం, ఒకటిన్నర కిలోల వెండి ఆభరణాలు, రూ.14వేల నగదు పోయినట్లు బాధితుడు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ సుబ్బరాజు పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించగా, డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి సమీపంలో ఉన్న మరో గృహం వద్ద కూడా చాలాసేపు తిరిగి ప్రధాన రోడ్డు మీదకు వెళ్లి నిలిచిపోయింది. దీనిని బట్టి దొంగలు మరో ఇంట్లో కూడా చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. ఎస్ఐ సుబ్బరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

డెంగ్యూతో గ్రానైట్ యజమాని మృతి



శివ

చీమకుర్తి: డెం గ్యూతో గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని బుధవారం మృతి చెందారు. మండ లంలోని కేవీ పాలెం గ్రామానికి చెందిన పమిడి శివ (39) గత కొంతకాలంగా చీమ కుర్తిలో నివాసముంటూ ఆర్‌ఎల్‌పురం ప్రాంతంలో గ్రానైట్ ప్యాక్టరీ నడుపుతు న్నారు. 5 రోజుల క్రితం జ్వరం రావడంతో ఒంగోలు లోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. మంగళవారం రాత్రి తీవ్ర జ్వరం, నొప్పిలు రావడంతో ఆసు పత్రిలో చే రారు. బుధవారం వేకువజామున వ్యాధి తీ వ్రత పెరిగి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రానై ట్ యజ మానులు శివ మృతదేహానికి నివా ళులర్పిం చారు. కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మందుబాబు హల్‌చల్

చీరాలఅర్బన్ : చీరాల రైల్వేస్టేషన్ ఎ దురు బస్టాండ్ కూడలి వద్ద బుధవారం మ ధ్యాహ్నం మందుబాబు హల్‌చల్ చేశాడు. వచ్చీపోయే బస్సులకు అడ్డంగా నిలబడడం, దారినపోయే వారిని దూషిస్తూ ట్రా ఫిక్‌కు అంతరాయం కల్గించాడు. ఛాతీపై బ్లేడుతో గీసుకున్న రక్తపుచారలు ఉండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కొంద రు మందుబాబుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన శివరాజు

తాళ్లూరు : నాగంబొట్లపాలెం గ్రామంలో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై బుధవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. గ్రామంలోని తమ్మిశెట్టి శివరాజు (22) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. దర్శిమండలానికి చెందిన తమ్మిశెట్టి తిరుపతయ్య కుమారుడు తమ్మిశెట్టి శివరాజు నాగంబొట్లపాలెం గ్రామానికి చెందినమేన మామ కూతుర్ని రెండేళ్ల క్రితం వివాహం చేసుకుని నాగంబొట్లపాలెం గ్రామంలో నివాసముంటున్నారు. శివరాజు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు తిరిగి రాలేదు. బుధవారం ఉదయం కుటుంబీకులు వెతుకులాడగా మీసాల శ్రీను పొలం వద్ద గల టేకు చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నట్లు తెలుసుకున్నారు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.మహేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను విచారించారు. తాను మనోవేదనతో, ఏమీ చేయలేక మృతి చెందినట్లు ఫోన్‌లో రికార్డు చేసిఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శివరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

కంభం : నవజాత శిశువు సంరక్షణలో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడా కేంద్రం 68లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ తల్లులతో సమావేశం నిర్వహించి, బలహీనంగా ఉన్న నవజాత శిశువు రక్షణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలు బాబోయ్ దోమలు

- వర్షాలతో క్షీణిస్తున్న పారిశుధ్యం
- పేరుకుపోతున్న చెత్తతో కాలుష్యం
- ప్రజల అవస్థలు, పట్టించుకోని అధికారులు

గిద్దలూరు టౌన్ : అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పారిశుధ్యం క్షీణించి దోమలు విజృంభిస్తున్నాయి. వీటి కారణంగా ఎక్కడ వ్యాధుల బారిన పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి కాలుష్యం అధికమవుతోంది. రాత్రి వేళ కాకుండా పగలు కూడా దోమలు కుట్టే పరిస్థితి ఏర్పడింది. ఇళ్లల్లోనే కాక కార్యాలయాల్లో కూడా అధికారులు దోమల దెబ్బలకు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని సత్యనారాయణ నగర్, నల్లబండబజారులోని పలు ప్రాంతాల్లో మురుగు నీటి కాలువలు చిల్లకంప, చెత్తాచెదారాలు పోగవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలులేవు. ప్రధాన రహదారుల్లోనే దోమలు దాడి చేస్తుంటే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణం నడిబొడ్డున ప్రధాన కార్యాలయాల ఆవరణలో సాయంత్రం అయితే 10 నిమిషాలు నిలబడలేని పరిస్థితి. దోమల నివారణకు మందులు, యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదు.

మున్సిపల్ అధికారులు త్వరితగతిన స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సత్యనారాయణనగర్‌లో చిల్లకంపతో మూసుకుపోయిన వీధి కాలువ

అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్ల నిలిపివేత

బేస్తవారపేట : పట్టణంలో అక్రమ లేఅవుట్లు వేసి ప్రజలను నిలువనా మోసం చేస్తున్నారని, వ్యవసాయ భూమిలో కొంత విస్తీర్ణం వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు ఉత్తర్వులు పొంది పూర్తిగా ప్లాట్లు వేసి అమ్మకాలు జరుపుతున్నారని తోటకూరి దివాకర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీవో ఉత్తర్వులు జారీచేయడంతో తహసీల్దార్ ఎం.రాజ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. బేస్తవారపేట సర్వే నెంబర్ 44,46,41 నుంచి 48 వరకు, పూసలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 96-1,42లో గ్రామ పంచాయతీ నుంచి అనుమతి పొందిన విస్తీర్ణం వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరపాలని మిగిలిన వాటికి నిలిపివేయాలని కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు.

చెంచమ్మకు నివాళులు

బేస్తవారపేట : మండలంలోని పిటికాయగుళ్ల సర్పంచ్ నర్రా సత్యనారాయణరెడ్డి తల్లి చెంచమ్మ(90) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు : ఐవీరెడ్డి

గిద్దలూరు : రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసీపీ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఐవీరెడ్డి అన్నారు. స్థానిక విరా సుబ్బరత్నం కల్యాణ మండపంలో బుధవారం జరిగిన నవరత్నాల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పింఛన్ సొమ్ము రెట్టింపు, రూ. 25 లక్షల పక్కాగృహాలు, జలయజ్ఞం పూర్తి, సంపూర్ణ మద్య నిషేధం లాంటి నవరత్నాలు జగన్ ముఖ్యమంత్రి కాగానే అమలు కానున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ చేరెడ్డి రంగారెడ్డి, వైసీపీ నాయకులు రెడ్డి భాస్కర్‌రెడ్డి, బోయిళ్ళ జనార్దన్‌రెడ్డి, చెన్ను విజయ, శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, శర్మ, ఇండేల నాగిరెడ్డి, జబ్రుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐవీరెడ్డి

ఉద్యోగ అవకాశాలపై అవగాహన అవసరం

కంభం : విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షకుడు జితేందర్ సూచించారు. బుధవారం స్థానిక వాసవి డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రాము ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి, శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

రాచర్ల : అన్ని దానాల్లో కంటి నేత్రదానం మహాదానమని ప్రముఖ కంటివైద్య నిపుణుడు జీకే మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 32వ నేత్రదానం పక్షోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 46 లక్షల మంది నల్లకన్ను అంధత్వంతో బాధపడుతున్నారని, కేవలం 35 వేల మంది మాత్రమే మరణానంతరం తమ నేత్రాలను దానం చేస్తున్నారన్నారు.

ఎంపీడీవో చర్యలకు నిరసనగా ధర్నా

- ఎంపీడీవో కార్యాలయానికి తాళం
- రుణ అర్హుల ఎంపిక తీరుపై

దళిత నాయకుల ఆగ్రహం



ఎంపీడీవోను అడ్డుకుంటున్న దళిత నాయకులు

కంభం : కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులు జాబితాను రాత్రికి రాత్రే తయారు చేయడమేగాక ఇదేమని ప్రశ్నించిన దళిత నాయకులకు కనీస సమాధానం కూడా చెప్పకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోయిన ఎంపీడీవో నిర్మలాజ్యోతి తీరుకు నిరసనగా దళిత నాయకులు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఉదయం 10 గంటలకు చేరుకుని కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిని బయటకు పంపి కార్యాలయానికి, ప్రధాన గేటుకు తాళాలు వేసి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చెన్నకేశవరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి పౌలేంరాజు, బీఎస్పీ జిల్లా కన్వీనర్ పానుగంటి సతీష్, ఎమ్మార్పీఎస నాయకుడు జయరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధికి మంజూరు చేసిన రుణాలను అర్హులకు అందేలా కాకుండా కొంత మంది రాజకీయ నాయకులకు తలొగ్గిన ఎంపీడీవో వారిని కార్యాలయంలో కూర్చోబెట్టి లబ్ధిదారుల ఎంపిక చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సిబ్బందిని వేధించడం, తరచూ సెలవులపై వెళ్లిపోవడం, దళితులపై వివక్షత చూపడం వంటి చర్యలకు ఎంపీడీవోను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసులు ధర్నా విరమించమని చెప్పినా.. ఎంపీడీవో వచ్చి సమాధానం చెప్పేంత వరకు తాము ఇక్కడ నుంచి కదలబోమని స్పష్టం చేశారు. సుమారు 12 గంటల సమయంలో ఎంపీడీవో నిర్మలాజ్యోతి కార్యాలయానికి వచ్చారు. ఆమెను చూడగానే దళిత నాయకులు ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలి, ఇక్కడ నుంచి బదిలీ చేయాలి, పేదలందరికీ న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయనాయకుల జోక్యం అవసరం లేదంటూ ఆమెను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు నచ్చజెప్పినా వారు వినలేదు. ఎట్టకేలకు ఎంపీడీవో నిర్మలాజ్యోతి మాట్లాడుతూ రుణాల ఎంపికలో కమిటీ సభ్యుల నిర్ణయం మేరకే చేస్తాము తప్పితే తాను జోక్యం చేసుకోనని చెప్పడంతో దళితులు శాంతించలేదు. అదే సమయంలో దళిత నాయకుడు చెన్నకేశవరావుకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఫోన్ చేశారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యత తనదేనని, ఈ మేరకు ఎంపీడీవో చేత హామీ ఇప్పించడంతో ఆమెను కార్యాలయంలోకి వెళ్లనిచ్చారు. సుమారు 3 గంటలపాటు ఈ హైడ్రామా వల్ల సిబ్బంది మొత్తం చెట్లకింద కూర్చున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అవసరం



మొక్కలు నాటుతున్న హెచ్ఎం సత్తార్

గిద్దలూరు టౌన్ : వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు చాలా అవసరమని, ప్రతి విద్యార్థి ఇంటి పరిసరాల్లో ఒక మొక్క నాటాలని ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్తార్ పేర్కొన్నారు. బుధవారం మన మార్పు సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సేవాసంస్థ సభ్యులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, సేవాసంస్థ సభ్యులు యు.ఓబయ్య, సురేష్, జయవిక్టర్, రాజు, సుధాకర్, విక్రమ్, చెన్నయ్య పాల్గొన్నారు.

పేదలకు రుణాలు ఇవ్వడంలో ఏపీజీబీ ముందంజ

కంభం : పేదలకు రుణాలను మంజూరు చేయడంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) ప్రథమ స్థానంలో ఉందని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కందులాపురం సెంటర్లో బ్యాంకు మేనేజర్ జి. పోలిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గృహనిర్మాణ రుణమేళా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివశంకర్ మాట్లాడుతూ కంభం శాఖ ఇప్పటి వరకు రూ. 75 కోట్ల రుణాలను మంజూరు చేసిందన్నారు. గృహనిర్మాణానికి, విద్యకు, షాపింగ్‌మాల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, రైతులకు రుణాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ టోరన్‌కుమార్, వాసవి విద్యాసంస్థ చైర్మన్ గోళ్ళ సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీజీబీ ఆర్ఎం శివశంకర్



గ్యాస్ పొయ్యిలను వినియోగించాలి

బేస్తవారపేట : ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి గ్యాస్ పొయ్యిని వినియోగించాలని ప్రధానోపాధ్యాయుడు నర్రా శింగరరెడ్డి అన్నారు. మంగళవారం పందిళ్ళపల్లె పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్లను అందజేశారు.

← గ్యాస్ పొయ్యి అందజేస్తున్న హెచ్ఎం

సినిమాలు

గిద్దలూరు

కృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	- వివేకం
వెంకటేశ్వర	- అర్జున్ రెడ్డి
నటరాజ్	- జయ జానకి నాయక


అద్దంకి బంగ్లారోడ్డులో గణేష్ విగ్రహానికి కూరగాయల అలంకరణ


అద్దంకి కళామందిర్ వద్ద గణేష్ విగ్రహానికి కూరగాయలు, పండ్లతో అలంకరణ


అద్దంకి ఆయిల్‌మిల్ రోడ్డులోని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కొత్తపాలెంలో పూలు, ఆకుల అలంకరణలోని గణేషుడిని ప్రార్థిస్తున్న చిన్నారులు


ఈపూరుపాలెంలో నెమలి వాహనంపై వినాయకుడు

ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

- వినాయక విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు, పూజలు
- పలుచోట్ల నిమజ్జన ఉత్సవాలు

అద్దంకి: వినాయచవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లారోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి వాసవి వనితా క్లబ్ సభ్యులు, సత్యనారాయణ కళామందిర్ వద్ద భక్తులు వినాయక విగ్రహానికి భక్తులు కూరగాయాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆయిల్‌మిల్ రోడ్డుల వినాయక విగ్రహానికి కూడా ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అద్దంకిటౌన్ : అద్దంకి పట్టణంలో గత ఆరు రోజులుగా మండపాలల్లో కొలువు దీరి ఉన్న గణనాథులను బుధవారం నిమజ్జనోత్సవాలకు తరలించారు. స్థానిక గుర్రాలకాలనీ, గ్యాస్ గోడౌన్ రోడ్డు, కొత్తపేట తదిరల కాలనీలోని విగ్రహాలను సంబరంగా నిమజ్జనానికి గుండ్లకమ్మకు తరలించారు.

అద్దంకిరూరల్: వినాయక చవితి సందర్భంగా అద్దంకి పట్టణంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం స్థానిక ఆయిల్‌మిల్ రోడ్డులో మౌలాలి గురుస్వామి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల ఉత్సవాల కమిటీ అయ్యప్ప పడి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు శ్రీను భజన బృందం వారిచే పాట కచేరీ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

నేడు భాగ్యనగర్‌లో భజన

అద్దంకి పట్టణం భాగ్యనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం మల్లి భజన బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటి సభ్యులు బుధవారం తెలిపారు. కాగా గోపాలపురం ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి కాలనీవాసులు నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువకులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రాక్టర్‌పై గణనాథుడి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి గుండ్లకమ్మలో నిమజ్జనం చేశారు.

సంతమాగులూరు: సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు, ఏల్చూరు గ్రామాలలో బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అనూక్ ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చీరాలరూరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చీరాలలో మండలంలోని ఏర్పాటు చేసిన గణనాథుల ప్రతిమలు భక్తులకు కనువిందు చేస్తున్నారు. కొత్తపాలెం గ్రామపంచాయతీలోని శ్రీరామ మందిరప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథడు బుధవారం గులాబీ, చామంతి పూలు, లైన్ ఆకులతో దర్శనమిచ్చాడు. ఈపూరుపాలెంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన నెమలివాహనంలో ఉన్న వినాయకుడు చూపరులకు కనువిందు చేస్తున్నాడు. వాడరేవు గ్రామంలో ఏర్పాటు చేసిన లంభోదరుడుని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, రంగులు చల్లుకుంటూ భక్తులు నృత్యాలు చేశారు.


అద్దంకి గ్యాస్‌గోడౌన్ రోడ్డులోని గణేషుడి నిమజ్జనోత్సవం


గోపాలపురం ఎస్సీకాలనీలో నిమజ్జన వేడుకలు


వాడరేవు బయలుదేరిన కొత్తపాలెం లంబోధరుడు


మిన్నెకల్లులో వినాయక నిమజ్జన ఊరేగింపు

ఆరుతడి పంటలతో రైతులకు ఎంతో మేలు : ఏవో


వరిని పరిశీలిస్తున్న వ్యవసాయధికారులు

బల్లికురవ: ఆరుతడి పంటలు సాగు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఏఈవో కోటేశ్వరరావు అన్నారు. బుధవారం గుంటుపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బోరు బావుల కింద సాగు చేస్తున్న వరి సాగును పరిశీలించారు. ఏఈవో మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకం పెంచేందుకు రైతులకి తమ సిబ్బందే నేరుగా తయారు చేసి ఇస్తున్నారని, రైతులు ఈ అ వకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఖరీఫ్, రబి సీజన్‌లలో ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

వెంపరాల(అద్దంకి రూరల్) : సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చని ఎఫ్‌టీసీ ఏడీఏ డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం అద్దంకి మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో ఏవో రమేష్ బాబు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ సొంత పొలం కలిగిన సన్న, చిన్నకారు రైతులకు 100శాతం రాయతీతో రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మపోషకాలను అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ఏఈవో అజయ్‌బాబు, ఎంపీటీసీ రామలింగయ్య, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రమేష్

విద్యార్థినులకు బ్యాగుల పంపిణీ


బ్యాగులు పంపిణీ చేస్తున్న దాతలు

చీరాల : చీరాల కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు గీత సర్వీస్‌ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. ట్రస్టు డైరెక్టర్ వలివేటి మురళీకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్కూలు హెచ్‌ఎం వెంకటేశ్వరబాబు, పవని భానుచంద్రమూర్తి, ట్రస్టు ఇన్‌చార్జి పేరాల జనార్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవి జయంతి

చీరాల : చీరాల టీడీపీ కార్యాలయంలో బుధవారం పరిటాల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నువ్వుల బ్రహ్మయ్య చౌదరి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్, రావిపూడి జయంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల సెక్రటరీ వేణుగోపాల్

చీరాలటౌన్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగడ వేణుగోపాల్ ఆకాంక్షించారు. స్థానిక కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రేవతి అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో కళాశాల అధ్యాపకులు అందిస్తున్న నైపుణ్యాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు వ్యక్తి జీవితాన్ని ముందంజలో నిలబెడతాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్టాఫ్ ప్రతినిధి తోటకూర సాంబశివరావు, ఆంగ్ల విభాగాధిపతి పోలయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సినీ గీతాలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

పాఠశాలల పర్యవేక్షణకు 'సంకల్పం మానిటరింగ్'

ఒంగోలు విద్య: జిల్లాలోని పాఠశాలల పర్యవేక్షణకు 'సంకల్పం మానిటరింగ్ ప్రోగ్రాం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి ఎంవీ.సుధాకర్ తెలిపారు. సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలో సెప్టెంబరు 1నుంచి అక్టోబర్ 31 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలలను మండలాల వారీగా ప్రత్యేక పర్యవేక్షక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయి. మండల విద్యాధికారులు సర్వశిక్షా అభియాన్ సెక్టోరియల్ అధికారులు, స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, డివిజనల్ లెవల్ మానిటరింగ్ సభ్యులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు సుధాకర్ తెలిపారు. వారానికి 9 మండలాల చొప్పున రెండు నెలల్లో అన్ని మండలాల్లో 504 పాఠశాలలను పర్యవేక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు మండలాన్ని సందర్శించిన రోజు సాయంత్రం ఆ మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేసి పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తారు. పాఠశాల సమీక్షలో పాఠశాలల అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలిస్తారని సుధాకర్ తెలిపారు.

వారం రోజుల్లో 161 డిజిటల్ తరగతి గదులు

డీఈవో విజయభాస్కర్

ఒంగోలు విద్య: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వారంరోజుల్లో 161 డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆర్‌జేడీ కేవీ.శ్రీనివాసులరెడ్డి పాఠశాల విద్యాశాఖలో అమలు జరుగుతున్న వివిధ అంశాలపై డీఈవోకు సూచనలిచ్చారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన డిజిటల్ తరగతి గదులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆర్‌జేడీ సూచించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి డిజిటల్ తరగతి గదుల సాఫ్ట్‌వేర్‌లో ఇన్‌స్టాల్ చేసిన అంశాలకే పరిమితం కాకుండా ఆన్‌లైన్‌ద్వారా వెబ్‌సైట్‌లోని కొత్త అంశాలను కూడా విద్యార్థులకు పరిచయం చేయాలని కోరారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకొని సబ్జెక్టు పరంగా కొత్త విషయాలను దృశ్య శ్రవణ విధానం ద్వారా విద్యార్థులకు అందించాలని కోరారు. డిజిటల్ తరగతి గదుల వినియోగంలో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వివరాలను కూడా ఆన్‌లైన్‌లో యాప్‌ద్వారా సకాలంలో నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఈ హాజరు నమోదుకు బయోమెట్రిక్ పరికరాలను, ట్యాబ్‌లను ఖచ్చితంగా వినియోగించాలని డీఈవో విజయభాస్కర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

రేపు హెచ్ఎంలు, టీచర్ల సమావేశం

డిజిటల్ తరగతులున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిజిటల్ తరగతి గదులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో విజయభాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ తరగతి గదుల్లో కొత్త అంశాలను విద్యార్థులకు పరిచయం చేసే విషయంలో అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

రామన్నకతువ ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ భాస్కర్‌నాయుడు

రాచర్ల: చినగానిపల్లె సమీపంలో రామన్నకతువ ద్వారా ముంపునకు గురవుతున్న భూములను గుర్తించి వారికి అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ భాస్కర్‌నాయుడు అన్నారు. ఇటీవల రామన్నకతువ కింద భూములు కోల్పోయిన రైతులు తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రామన్నకతువ నిర్మాణ పనులను అడ్డుకునేందుకు సైతం వెనుకాడబోమని చోళ్ళవీడు సర్పంచ్ ముత్యాల మధు, చినగానిపల్లె రైతు నాయకుడు పగడాల రమేష్ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. దీంతో ఆర్డీవో కిశోర్‌బాబు ఆధ్వర్యంలో రామన్నకతువ వద్ద బుధవారం ముంపుకు గురవుతున్న భూముల రైతుల సమావేశంలో తహసీల్దార్ కె.ఎలిజబెత్‌రాణి, డిప్యూటీ తహసీల్దార్ కోన చెన్నకేశవులు పాల్గొన్నారు.

స్పెషల్ కలెక్టర్ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ రామన్నకతువ కింద సాగు చేస్తున్న భూములు మునిగిపోతున్న దశలో వాటిని గుర్తిస్తామన్నారు. రైతులు మాట్లాడుతూ రామన్నకతువ పనులు దాదాపు 80శాతంమేర పూర్తయ్యాయని, అయినప్పటికీ ముంపు బాధితులను గుర్తించడంలో జాప్యం జరుగుతుందన్నారు. చినగానిపల్లె, అచ్చంపేట గ్రామాలకు చెందిన 180 మంది రైతుల భూములు మునకకు గురవుతున్నాయని, తామందరికీ న్యాయం చేయాలని కోరారు. రికార్డులను పరిశీలించి ముంపు బాధితులను ఆదుకుంటామని స్పెషల్ కలెక్టర్ హామీ ఇచ్చారు.



సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

సంతతో అధిక లాభాలు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

రాచర్ల: వ్యాపారస్తులంతా ఒకచోట చేరి సంతలో అమ్మకాలు జరుపుకుంటే అధిక లాభాలు గడించే అవకాశం ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోపల్లి హైవే రోడ్డు సమీపంలో మేకల, గొర్రెలకు నూతనంగా ఏర్పాటుచేసిన సంతను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోనే మన నియోజకవర్గంలో అనేక మంది గొర్రెలపై జీవనాధారం సాగిస్తుంటారని అన్నారు. వీరు లావాదేవీలంతా జరుపుకోవాలంటే కర్నూలు జిల్లా నంద్యాలకు వెళ్ళాల్సి వస్తోందన్నారు. ఫలితంగా, వ్యాపారస్తులతోపాటు జీవాల యజమానులకు కూడా ఎంతో వ్యయప్రయాసాలు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆకుమళ్ళ బాలవీరయ్య చెర్లోపల్లి సమీపంలో నూతనంగా సంత ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఈ సందర్భంగా ఆకుమళ్ళ బాలవీరయ్య మాట్లాడుతూ ప్రతి బుధవారం ఈ ప్రాంతంలో సంత నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ శ్రీను, గోపిరెడ్డి రమణారెడ్డి, చెర్లోపల్లి రంగస్వామి రెడ్డి, పందిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, పందిళ్ళపల్లి శ్రీనివాసులు, కొండయ్యయాదవ్, సూరా స్వామిరంగారెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట సుబ్బయ్య

మార్కాపురం టౌన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. కర్నూలు జిల్లా గుంతనాల గ్రామానికి చెందిన ముళ్ళపాటి వెంకట సుబ్బయ్య(27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నికరంపల్లి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మితో కలిసి గత నాలుగేళ్ళుగా మృతుడు మార్కాపురం పట్టణంలో సహజీవనం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిందంటూ చెప్పటంతో ఇరుగు పొరుగు వారు వచ్చి పరిశీలించే లోగా వెంకట సుబ్బయ్య మృతిచెంది ఉన్నాడు. ఆదిలక్ష్మి తమ బంధువులకు ఈ విషయం చేరవేస్తానంటూ అదే సమయంలో వెళ్ళిపోయి ఉదయం తిరిగి వచ్చినట్లు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ శ్రీకాంత్ అనుమానాస్పందంగా మరణం చినట్లు కేసు నమోదు చేశామని తెలిపారు.

గుంటలో జారిపడి మహిళ మృతి



మృతి చెందిన తాళ్లూరి అంజలి

పొదిలి: మూసీవాగు ఇసుక గుంటలో జారిపడి మహిళ మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు దాసర్లపల్లికి చెందిన తాళ్ళూరి అంజలి(23) పశువులు మేపుకొనేందుకు పొలం వెళ్ళింది. పశువులు నీరు తాగేందుకు మూసీ వాగులోకి వెళ్ళగా ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న ఇసుక కుంటలో జారిపడి అంజలి మృతిచెందింది. సమీపంలో ఉన్న పశుకాపరులు కాపాడిన ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సమాచారం తెలుసుకున్న పొదిలి ఎస్ఐ సుబ్బారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలక తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదరలో 150 మంది జ్వరపీడితులకు వైద్యపరీక్షలు

ముండ్లమూరు: మండలంలోని ఈదర గ్రామంలో 150 మంది జ్వరపీడితులకు మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వెంకట్రావు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి జ్వరాలు ఉన్నట్లు తెలిపారు. మిగత వారికి కీళ్ళనొప్పులు ఉన్నట్లు గుర్తించారు. జ్వరపీడితులకు మందులను కూడా పంపిణీ చేశారు. జు

మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలి

ఒంగోలు విద్య: సామాజిక భద్రత లేని కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించనున్న మిలీనియం మార్చ్‌ను, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ.సుబ్బారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీజీ.కీర్తి, బి.అశోక్‌కుమార్‌లు కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని వారు కోరారు.

కాంట్రాక్టు లెక్చరర్ల రెన్యూవల్ ఉత్తర్వులు జారీ

ఒంగోలు విద్య: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూడు నెలలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను ఎట్టకేలకు రెన్యూవల్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 3672మంది కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సేవలందిస్తున్నారు. కళాశాలలు ప్రారంభం తేది నుంచి ఆఖరు పనిదినం వరకు వీరి సేవలు కొనసాగించాలని ఆదేశిస్తూ విద్యాశాఖ కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ ఉత్తర్వులు ప్రాతిపదికగా ఇంటర్మీడియట్‌విద్య కమిషనర్ మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. అదేవిధంగా 50శాతం వేతనాన్ని పెంచిస్తూ కూడా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందని ప్రభుత్వ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరగుంట సురేష్, వైజాన్‌బాబు తదితరులు తెలిపారు. ఉత్తర్వులు జారీచేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

సెప్టెంబర్‌లో హెచ్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు విద్య: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు గురువారం పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగే అవకాశలు కనిపించటం లేదు. పదోన్నతుల సీనియారిటీ జాబితా విషయంలో తాజాగా ట్రిబ్యునల్ స్కూలు అసిస్టెంట్ల సర్వీసు ప్రాతిపదికగా తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న పదోన్నతుల సీనియారిటీ జాబితాలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల సర్వీసును కూడా కలిపి వేసుకున్నవారు కొందరు ఉన్నారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులు ప్రకారం వీరి సర్వీసును సవరించి కేవలం స్కూలు అసిస్టెంటు సర్వీసును మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంది. ఆ ప్రకారం సీనియారిటీ జాబితాను సవరించి ఆర్‌జేడీ ఆమోదం కోసం పంపాల్సి ఉంది. ఆర్‌జేడీ ఆమోదం పొందిన తరువాత పదోన్నతుల కమిటీ ఆమోదంతో ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రక్రియ మొత్తం ఒకరోజులో పూర్తయ్యే అవకాశమే లేదు. జాబితాలను సవరించి సెప్టెంబరు మొదటి వారంలో హెచ్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈవో విజయభాస్కర్ తెలిపారు.

స్కూలు అసిస్టెంట్లకు మాత్రమే హెచ్ఎం పదోన్నతులు ఇవ్వాలి

ఒంగోలు విద్య: ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల స్కూలు అసిస్టెంట్లకు మాత్రమే పదోన్నతులు కల్పించాలని స్కూలు అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సుబ్బారావు, పీవీ.రమణకుమార్‌లు కోరారు. 1198లో కొందరు ఎస్‌జీటీలు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా పదోన్నతులు పొందారు 2001, 2002 సంవత్సరాలలో వారు ఎస్‌జీటీ నుంచి స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం హైస్కూలు హెచ్ఎంల పదోన్నతులకు స్కూలు అసిస్టెంట్ల సీనియారిటీ కాకుండా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సర్వీసును జాబితాలో నమోదు చేసుకున్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హెచ్ఎం పదోన్నతులకు స్కూలు అసిస్టెంట్ల సీనియారిటీని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు హెచ్ఎం పదోన్నతులకు స్కూలు అసిస్టెంటు సర్వీసును మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీని, జిల్లా విద్యాశాఖాధికారిని వారు కోరారు.

జిల్లాలో 3.0 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలో పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 3.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కంభంలో 16.0, యద్దనపూడిలో 15.0, తర్లుబాడులో 14.4, బల్లికురవలో 14.2, మార్కాపురంలో 14.2, పుల్లలచెరువులో 10.4, దొనకొండలో 10.0 మి.మీ.తో పాటు మరో ఏడెనిమిది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

చీమకుర్తి: గుడిపూడి వారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. గుడిపూడి భావన జ్ఞాపకార్థం గుడిపూడి వెంకట్రావు బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్సిల్ బాక్సులు విద్యార్థులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకాయమ్మ, ఎంపీటీసీ గుడిపూడి రమణమ్మ, కాంప్లెక్సు చైర్మన్ పి.శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, హెచ్.ఎం వి.గమినియేలు, ఉపాధ్యాయులు పుట్టా శ్రీనివాసరావు, చదలవాడ శ్రీను, బి.సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో అభివృద్ధి పనులు వేగవంతం

జేసీ నాగలక్ష్మీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నాగలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్: గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాల నిర్వాసితుల కాలనీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం సాయంత్రం నిర్వాసితుల సమస్యలపై భూసేకరణ, వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితుల కాలనీల్లో పలు రకాల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. ఆయా పనులను టెండర్ల ద్వారా చేసే పనులయితే వెంటనే టెండర్లు పిలిచి ప్రా రంభించాలన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నందున సత్వరమే పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని జేసీ నాగలక్ష్మి సూచించారు. ఇంకా ఆయా కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని కూడా గుర్తించి పరిష్కరించాలన్నారు. ఘడియపూడి, ధేనువుకోండ, ఎర్రపాలెం, మణికేశ్వరం, అనుమనమూరు, చిన్న మల్లవరం, భూరేపల్లి, తమ్మవరం, గార్లపాడు, తిమ్మారెడ్డి పాలెం, కోటికలపూడిలలో 25 కాలనీలు ఉన్నాయని తెలిపారు. ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీతో పాటు అంగన్‌వాడీ, పాఠశాలలకు ప్రహరీగోడలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ అదేశించారు.

అనంతరం గ్రామాల వారీగా సమీక్షించి అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్ సుదర్శనం, ఎస్‌డీసీ ఉదయభాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మర్దన్‌ఆలీతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం

ఒంగోలు నగరం: కేంద్ర ఆరోగ్యశాఖకు చెందిన బృందం రెండు రోజులు జిల్లాలో పర్యటించింది. బృందంలోని డాక్టర్ సూరిబాబు, డాక్టర్ శ్రీనివాస్ బుధవారం కొనకనమిట్ల, కనిగిరి మం డలాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు జరుగుతున్న పలు ఆరోగ్య పథకానలు పరిశీలించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారులు మంగళవారం నుంచి జిల్లాలో పర్యటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద ఏటా కోట్లాది రూపాయల నిధులను జిల్లాకు విడుదల చేస్తోంది. వీటి అమలు తీరును పరిశీలించేందుకు జిల్లాలో ఇద్దరు అధికారులు పర్యటిస్తున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం కానున్నారు.

కశ్యప పథకం గడువు పొడిగింపు

ఒంగోలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ 'కశ్యప' పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువు తేదీని సెప్టెంబరు 15వరకు పొడిగించినట్లు కార్పొరేషన్ జిల్లా కో ఆర్డినేటర్ కామరాజుగడ్డ కుసుమకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు ఆగస్టు 31తో ముగియనుండగా, మరింత మందికి లబ్ధిపొందే అవకాశం కల్పించాలని గడువు తేదిని మరో పదిహేను రోజులు పొడిగించినట్లు ఆమె తెలిపారు. పేద బ్రాహ్మణ వృద్ధులు, వికలాంగులు, వృద్ధాశ్రమంలో జీవిస్తున్నవారు, వితంతువులు, భర్త వదిలివేసిన మహిళలు ఈ పథకం ద్వారా నెలవారి జీవన భృతి రూ.వెయ్యి పొందే అవకాశం ఉంది.

దరఖాస్తుదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు ఫొటోతో కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. 2017 జులై 31నాటికి 60 సంవత్సరాలు నిండిన వారు వయస్సు ధ్రువీకరణ, భర్త చనిపోయిన వారు మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా జత చేయాలని ఆమె కోరారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకారవేతనం అందజేసే 'భారతి విద్యా పథకం' గడువు తేదీ సెప్టెంబరు 30తో ముగియనున్నందున జిల్లాలోని పేద బ్రాహ్మణ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.



పాఠకులకు సూచన:
క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

సింహరాశి: (జూలై24-ఆగస్టు23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆర్టీసీలో ఇష్టారాజ్యం

- అద్దంకి డిపోలో గాడితప్పిన పాలన
- అధికారుల మధ్య సమన్వయం లోపం
- దాచి ఉంచిన ఎస్ఆర్‌ల చోరీ

అద్దంకి: అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగలు పడ్డారు. సుమారు నాలుగు సంవత్సరాలకు చెందిన ప్రతిరోజు ప్రతి కండక్టర్ నుంచి వచ్చే ఎస్ఆర్‌లు నెలకోమారు కట్ట కట్టి గోతాములో దాచి ఉంచుతారు. ఇలా 2014 నుండి అద్దంకి ఆర్టీసీలో అన్ని సర్వీసుల కు సంబంధించి జూలై నెల వరకు ఉండాల్సిన ఎస్ఆర్‌లు 40 గోతాలలో ఉన్నాయి. వీటి బరువు సుమారు 40 క్వింటాళ్ళ వరకు ఉంటుందని అంచనా. వీటిని నెల్లూరు జోనల్ కార్యాలయానికి పంపితే అక్కడ అధికారుల సమక్షంలో ధ్వంసం చేయాల్సి ఉంది. అయితే, అద్దంకి డిపో లో నిల్వ ఉంచిన సుమారు 40 క్వింటాళ్ళ బరువు ఉండే ఎస్ఆర్‌లు పది రోజుల క్రితం చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన ఆర్టీసీ అధికారులు చోరీకి కారకుడైన యువకుడిని పిలిపించి విచారించారు.



చోరీకి పాల్పడ్డ యువకుడిని విచారిస్తున్న ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు

పంగులూరుకు చెందిన పఠాన్ సుభాని ప్రతిరోజు అద్దంకి వచ్చి ఆర్టీసీ బస్టాండ్ లో చిల్లర గా తిరుగుతుంటాడు. ఈక్రమంలో ఆర్టీసీ అధికారులతోనూ చనువు గా ఉండటం చేస్తుంటాడు. దీనిని చూసి కార్మికులు కూడా ఆ యువకుడి గురించి పెద్దగా పట్టించుకునే వారు కాదు. ఈక్రమంలో అధికారుల వద్ద ఉన్న చనువుతో ఆ యువకుడు ఏకంగా చోరీకి పాల్పడ్డాడు. ఎస్ఆర్‌ల గోతాలను రిక్షాపై చిత్తు కాగితాల కింద తరలించి అమ్మకాలు చేశాడు. ఇతనితో పాటు మరో వ్యక్తి కూడా చోరిలో పాలు పంచుకున్నట్లు తెలుస్తుంది. ఇంత తతంగం జరిగినా అధికారుల దృష్టికి రాకపోవడం విమర్శలకు తావిస్తుంది. అధికారుల ఉదాసీన వైఖరి వలనే ఈ పరిస్థితి నెలకొందని కార్మికులు అభి ప్రాయపడుతున్నారు.

గత కొంత కాలంగా అద్దంకి ఆర్టీసీ డిపో పాలన పూర్తిగా గాడి తప్పింది. అధికారుల మధ్య సమన్వయ లేమితో ఆర్టీసీ మరింత నష్టాల బాట పడుతుంది. కార్మికులు కూడా అధికారుల అనైఖ్యతను సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు అంటే కార్మికులు, సిబ్బంది లెక్కచేసే పరిస్థితి లేకుండా పోయింది. కార్మికులు కూడా రెండు వర్గాలుగా ఏర్పడి అధికారులకు వత్తాసుగా నిలుస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే చోరి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి ఆర్టీసీ డిపోను గాడిలో పెట్టకపోతే మరింత అబాసుపాలయ్యే అవకాశం ఉంది.



ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్ఆర్‌లు దాచి ఉంచే గది

పోలీసులకు ఫిర్యాదు

అద్దంకి డిపోలో ఎస్ఆర్‌లు చిత్తు కాగితాలుగా అమ్మిన సంఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎం రామ్మోహన్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించి పిలిపించి పోలీసులకు అప్పగించినట్టు ఆ యన తెలిపారు.

పథకాల సద్వినియోగం, గిట్టుబాటు ధరలతోనే రైతు అభివృద్ధి

కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సంకల్పంతో సిద్ధి ప్రతిజ్ఞ

కందుకూరు: వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను రైతుల దరిచేరేలా ఆయా శాఖల అధికారులు కృషి చేయటంతో పాటు పంటలకు గిట్టుబాటు ధరలు పొందటం కోసం రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఉందని పలువురు ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. కందుకూరు సీటీఆర్ఐ ఆవరణలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో నవభారత సంకల్పం - సంకల్పంతో సిద్ధి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీటీఆర్ఐ డైరక్టర్ డి. దామోదర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఈదర హరిబాబు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నాబార్డ్ ఏజీఎం జ్యోతి శ్రీనివాస్ తదితరులు పాల్గొని రైతుల దుస్థితి, వారి ఆదాయాన్ని పెరిగేలా చూడాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా రైతులచే సంకల్ప దీక్ష చేయించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీటీఆర్ఐ డైరెక్టర్ దామోదర రెడ్డి, ఎమ్మెల్యే పోతుల రామారావు, నాబార్డ్ ఏజీఎం జ్యోతి శ్రీనివాస్ తదితరులు

అనంతరం సీటీఆర్ఐ డైరెక్టరు దామోదర రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే పోతుల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పట్ల రైతులకు అవగాహన కల్పించటం లోను, ప్రకృతి అననుకూల పరిస్థితుల్లో పంటల సాగులో పాటించాల్సిన మెళకువలపై చైతన్యం చేయటంలో ఆయా శాఖల మరింత కృషి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతుకి నిజంగా వరమని, అయితే దానిని రైతులంతా సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ శాఖ తగినకృషి చేయటం లేదని పేర్కొన్నారు. కందుకూరులో కృషి విజ్ఞాన కేంద్రం పేరుకే ఉంది తప్ప దీని ద్వారా రైతుకి విజ్ఞానం పెంచటానికి ఎలాంటి కృషి జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట సంజీవని కుంటలు తవ్వుకునేలా రైతులను ప్రోత్సహించటం, పంట ఉత్పత్తులను రైతులు సంఘాలు ఆవిర్భవించి విక్రయించుకోవటం ద్వారా గిట్టుబాటు ధరలు పొందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులు సంఘాలుగా ఏర్పడాలి

జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ నేడు సమాజంలో ప్రతి ఒక్కరికీ సంఘాలు ఉన్నాయని ఆ సం ఘాల ద్వారా వారు లబ్దిపొందుతుండగా సంఘం లేనిది కేవలం రైతులు, రైతు కూలీలకు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సర్పంచ్ నుంచి ప్రధానమంత్రి వరకు ప్రజా ప్రతినిధులు అయినవాళ్లు కోటీశ్వరులు అవుతుండగా ఉద్యోగులు, వ్యాపారులు కోట్లకు పడగలెత్తుతున్నారని అన్నారు. రైతులు మాత్రం అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు సంఘటితమై సంఘాలుగా ఏర్పడి తమ పంట ఉత్పత్తులను మెరుగైన ధరలకు అమ్ముకోవాలని, ఆర్గానిక్ వ్యవసాయానికి మం చి ఆదరణ లభిస్తున్నందున అటువైపు దృష్టి సారించాలని కోరారు.

అనుబంధ రంగాలపై దృష్టిపెట్టాలి

నాబార్డ్ ఏజీఎం జ్యోతి శ్రీనివాస్ మాట్లాడుతూ 2022 నాటికి వ్యవసాయ రంగంలో రైతుల లాభాన్ని రెట్టింపు చేయాలన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అయితే కేవలం వ్యవసాయ ద్వారానే ఐదేళ్లలో ఆదాయం రెట్టింపవుతుందని, ప్రస్తుతం వెయ్యి రూపాయల అమ్ముతున్న పంట ఉత్పత్తి ఐదేళ్లలో రూ.2వేలు పలుకుతుందని కాదని ఆమె వివరించారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం లాంటి వ్యాపకాలతో లాభాలను పెంచుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ రైతులకు పంటలు బాగా పండితే ఆహారభద్రత నినాదంతో ధరలు లేకుండా చేయటం, పంట ఉత్పత్తులు వ్యాపారుల వద్దకు చేరాక ఆహారభద్రత ఎటుపోతుందో కానీ అవే ఉత్పత్తుల ధరలు రెండింతలు, మూడింతలు పెరగటం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో డెయిరీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, జడ్పీటీసీ కంచర్ల శ్రీకాంత్ చౌదరి, పొగాకు బోర్డు ఆర్ఎంలు ఉమామహేశ్వరరావు, రత్నసాగర్, వ్యవసాయ శాఖ డీడీ అబ్దుల్ సత్తార్, దర్శి కెవికె హెడ్ వరప్రసాద్, మత్స్య శాఖ జెడి బలరాం, కందుకూరు కేవీకే ఇన్‌ఛార్జ్ ఎం. అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలపై ఇంటెలిజెన్స్ ఆరా

కురిచేడు: వసతి గృహాల నిర్వహణ, మెనూ, హాజరుపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. గత పది రోజుల నుంచి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలలో హాజరుపై వారు విచారణ చేస్తున్నారు. బుధవారం రాత్రి ఇంటెలిజెన్స్ ఎస్సై రామారావు స్థానిక బీసీ, ఎస్సీ వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మెనూ అమలు, పరిసరాల శుభ్రత, రికార్డులను తనిఖీ చేశారు. విచారణ రిపోర్టును ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కొన్ని వసతి గృహాలలో ఏసీబీ తనిఖీలు జరిగినప్పటి నుంచి వసతి గృహాలపై ప్రభుత్వం నిఘా ఉంచింది. ప్రభుత్వ ధనం వృధా కాకుండా పేదలకు చేరాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వారికే చెందేలా చేయడానికి ఇటువంటి తనిఖీలు ఉపయోగపడతాయి. దీనివలన విద్యార్థులకు సరైన మెనూ అమలు అవుతుంది.

రైలు కిందపడి యువతి మృతి

కురిచేడు: రైలు కింద పడి యువతి మృతి చెందిన సంఘటన కురిచేడు సమీపంలోని గుండ్లకమ్మ రైల్వే స్టేషన్‌లో జరిగింది. కురిచేడు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన తానంచింతల రిబ్కా ఇంట్లో గుంటూరు వెళ్ళి తన సర్టిఫికెట్లు తీసుకు వస్తానని బయలుదేరి వెళ్ళింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుండ్లకమ్మ రైల్వే స్టేషన్‌లో ఆమె మృత దేహం రైలు పట్టాలపై ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. నరసరావు పేట రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె ప్రమాద వశాత్తు రైలు కింద పడిందా లేక ఆత్మహత్య చేసుకున్నదా అనే విషయం పోలీసుల విచారణలో తేలవలసి ఉన్నది.

పౌర సమాజం ఏర్పాటులో భాగస్వామ్యం కావాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కేంద్ర సమాచార కమిషనర్ శ్రీధర్

- సమాచార చట్టాన్ని ఆయుధంగా చేసుకోవాలి
- దుర్వినియోగం కాకుండా కాపాడితేనే భవిష్యత్‌కు రక్షణ
- అవినీతి నిర్మూలన ద్వారానే సమ సమాజం నిర్మాణం
- శిక్షణ తరగతుల్లో కేంద్ర సమాచార కమిషనర్ శ్రీధర్

ఒంగోలు కలెక్టరేట్ : దేశంలో పౌర సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కేంద్ర సమాచార కమిషనర్ ప్రొఫెసర్ ఎం.శ్రీధర్ ఆచార్యులు పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏకలవ్య ఫౌండేషన్, విశ్వ యువక్ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రంగాభవన్‌లో బుధవారం జరిగిన రాజ్యాంగం, సమాచార హక్కు చట్టంపై ప్రాథమిక శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవ సంబంధాలతో కూడిన స్వేచ్ఛ తగ్గిపోతున్న సమయంలో దానిని పెంపొందించుకున్నప్పుడే అన్ని అంశాలపై పారదర్శకత వస్తుందని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత పిటిషనర్(అర్జీదారుడు) అడ్రసు లేకుండా సమాచారం అడిగినా ఇచ్చే విధంగా చట్టాన్ని రూపొందించారని, ఈ చట్టాన్ని కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఆయన పేర్కొన్నారు. ఆ చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కొంత మంది ఆసరాగా చేసుకుని రద్దు చేయించే ప్రమాదం ఉందని, ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టంపై సంపూర్ణ అవగాహన పొంది తద్వారా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే జవాబుదారీ తనం పెరుగుతుందని తెలిపారు. మానవ సంబంధాలు తగ్గిపోతున్న పరిస్థితుల్లో దానిని మెరుగుపరుచుకునేందుకు విద్య కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఆలోచన చేసే స్వాతంత్ర్య హక్కు ప్రతిఒక్కరికి ఉందని, దీనిని పిల్లల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలులో గ్రామస్థాయి నుంచి పిల్లల్లో క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులను బొకేలు, శాలువాలతో సత్కరించకుండా పుస్తకాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. అదే సమయంలో సమాచార హక్కు చట్టం దుర్వినియోగం కాకుండా దానిని కాపాడుకుంటూనే ప్రజల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుందని తెలిపారు. అవినీతి నిర్మూలన ద్వారానే నమసమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. 1857లోనే బ్రిటీష్ టెలిగ్రాం కనిపెట్టి వారి అనుయాయులకు అవసరమైన సమాచారాన్ని పంపేవారని, కానీ అప్పట్లో మన దేశంలో పావురాల ద్వారా సమాచారం పంపేవారన్నారు. అందుకు కారణాలు ఏమిటని విశ్లేషించుకుంటే అనేక అంతరాలు ఏర్పడుతాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్రం సమాచార హక్కు చట్టం తెచ్చిందని, చట్టాన్ని దుర్వినియోగం కాకుండా అవసరాలకు వినియోగించుకుంటూ పౌర సమాజాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతకు ముందు న్యాయ పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు మేడా లోకేష్ ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సివిల్ ప్రొసీజర్ కోడ్‌లపై వివరించారు. విశ్వ యువక్ కేంద్రం న్యూఢిల్లీ ప్రతినిధి రాజీవ్ నిర్మల్ పలు అంశాలపై వివరించారు. ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి నటుకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, వినియోగదారుల సమాఖ్య రచయిత దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సత్కారం

ఇదిలా ఉండగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో రాజ్యాంగం, సమాచార హక్కు చట్టంపై ప్రాథమిక శిక్షణ తరగతుల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర సమాచార కమిషనర్ శ్రీధర్ ఆచార్యులును జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఆర్డీవో కె.శ్రీనివాసరావు బొకే ఇచ్చి సత్కరించారు. అదే విధంగా పలువురు సమాచార హక్కు చట్టం సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రెవెన్యూ రికార్డులను ఒకే చోటకు తెచ్చి సమాచార హక్కు చట్టం దినంగా ఏర్పాటు చేసి ప్రజలు దరఖాస్తు చేస్తున్న సమాచారాన్ని సత్వరమే అందించే విధంగా ఒంగోలు డీఆర్వో ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టడం అబినందనీయమని పేర్కొన్నారు. ఆ దిశగా అన్ని జిల్లాల్లో జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పచ్చదనం పరుచుకున్న వసతిగృహం

- మొక్కల సంరక్షణలో సిబ్బంది, విద్యార్థులు
- ఆహ్లాదకర వాతావరణంతో ఉల్లాసం
- కాయగూరలు, ఆకుకూరల సాగు

దొనకొండ : పచ్చని మొక్కలు ఆహ్లాదకరాన్ని పంచుతాయి. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడతాయి. ఇందుకు దొనకొండ బీసీ బాలుర వసతిగృహ సంక్షేమాధికారి కె.జాన్‌విల్సన్ తన వంతు కృషి చేస్తున్నారు. వసతిగృహాన్ని పచ్చగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన కొత్తరకం మొక్కలు కనిపిస్తే చాలు వెంటనే తీసుకుని నాటి బాధ్యతగా సంరక్షిస్తుడటంతో హాస్టల్ పరిసరాలు మొక్కలతో ఉద్యానవనాన్ని తలపించేలా ఆహ్లాదకరంగా మారింది.

పని వత్తిడిలో ఉన్నా...

వివిధ రకాల పని వత్తిడిలో ఉన్నా విద్యార్థులతో పాటు ప్రతిరోజు ఉద్యానంలో వనమాలిగా మారి మొక్కలకు పాదులు తీయటం, నీళ్లు పోస్తూ ప్రత్యేక శ్రద్ధతో వసతిగృహాన్ని పచ్చదనంతో నింపేస్తున్నారు. మొక్కలకు రక్షణ నిమిత్తం హాస్టల్ భవనం చుట్టూ ప్రహరీగోడ లేకున్నా ముళ్లకంపను ప్రహరీగోడగా ఏర్పాటు చేయించి ఎటువంటి పశువులు లోనికి రాకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టి సంరక్షిస్తున్నారు.


నీళ్ల పాదులు తీస్తున్న విద్యార్థులు



కూరగాయలు, ఆకుకూరల సాగు

విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలతో భోజనం అందించేలా తోటకూర, గోంగూర, బెండకాయ, గోరుచిక్కుళ్ళు, బీరకాయ, గుమ్మడికాయ తదితర కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. అదే విధంగా కొబ్బెర, వెలక్కాయ, నేరేడు, మామిడి, దానిమ్మ తదితర పండ్ల మొక్కలు, వేప, గానుగ నీడనిచ్చే మొక్కలను బాధ్యతగా సంరక్షిస్తున్నారు. విద్యార్థుల తల్లితండ్రులు వారి పిల్లల కోసం హాస్టల్ వద్దకు వచ్చిన సమయంలో మొక్కల పెంపకం పట్ల కలుగు ప్రయోజనాలను వార్డెన్ విల్సన్ వివరిస్తున్నారు. పలువురు తల్లితండ్రులు సైతం మొక్కల పెంపకం పట్ల పిల్లలకు పండించిన ఆకుకూరలతో అందిస్తున్న భోజనాన్ని ప్రత్యక్షంగా చూసి అభినందిస్తున్నారు. అన్ని వసతిగృహాలు అదే రీతిలో సాగాలని ఆకాంక్షిద్దాం.

భావితరాలకు పచ్చదనం పంచటమే లక్ష్యం


కటారి విల్సన్, సంక్షేమాధికారి, బీసీ బాలుర వసతిగృహం, దొనకొండ

2012లో దొనకొండలో వార్డెన్‌గా బాధ్యతలు చేపట్టాను. భావితరాల విద్యార్థులకు పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంను అందించాలనే ధ్యేయంతో మొక్కల పెంపకం పట్ల చర్యలు తీసుకుంటున్నా. ప్రతిరోజు విద్యార్థులతో కలసి వాటి సంరక్షణ ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.

75 శాతం పూర్తయిన తీగలేరు

- కాల్వకు కోతలు...పెరిగిన చిల్లకంప
- 62 వేల ఎకరాలకు ఆయకట్టు
- అదనంగా 11500 ఎకరాల సాగుకు ఎమ్మెల్యే కృషి
- సర్వేకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం

తీగలేరు కాలువలో పెరిగిన చిల్లకంప



పెద్దదోర్నాల: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని ప్రధానమైన తీగలేరు కాలువ పనులు 75 శాతం పూర్తి కావచ్చాయి. 2018 సెప్టెంబరు మాసానికి కాల్వ నిర్మాణ పనులు పూర్తి అయ్యే లా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నిర్మాణం వల్ల ప్రకాశం జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో దోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెంకు చెందిన 62 వేల ఎకరాల భూములు ఆయకట్టుగా మారనున్నాయి. కాగా పుల్లలచెరువు మండలంలో మరిన్ని ఎకరాల సాగు కోసం ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే డేవిడ్‌రాజు కాల్వ నిర్మాణం పొడిగించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి సర్వేకు అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

కాల్వ ప్రయాణం ఇలా...

కృష్ణా నది ఎగువ బాగాన కొల్లం వాగు ప్రాంతం నుంచి సొరంగాల గుండా ఫీడర్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను రిజర్వాయర్లకు తరలిస్తారు. రిజర్వాయర్ నుంచి 650 మీటర్ల పొడవున చిన్నపాటి సొరంగం ఏర్పాటు చేసి కలనూతల నుంచి తీగలేరు కాలువ ప్రారంభమవుతుంది. పెద్దారవీడు, దోర్నాల, ఎర్రగొండపాలెం వరకు 48.5 కిలోమీటర్ల పొడవున నిర్మాణం జరుగుతుంది. 49.150 కిలోమీటర్లకు గాను 45 కిలోమీటర్లు పూర్తి అయింది. కాల్వపై 74 వంతెనలు నిర్మించాల్సి ఉండగా 19 పూర్తి అయ్యాయి. 55 వంతెనలు నిర్మాణ దశలో ఉన్నాయి. కాల్వ నిర్మాణం పూర్తి గావించేందుకు 66 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 40 కోట్లు ఖర్చు చేశారు. 6 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతు ఉన్న కాల్వలో నీటి ప్రవాహం సెకండుకు 21.95 గణపు మీటర్లు, ఈ కాల్వ నిర్మాణానికి గాను 140 ఎకరాల అటవీ భూమి, 80 ఎకరాల ప్రభుత్వ భూమి, 442 పట్టా భూములు సేకరించారు.

కాల్వకు కోతలు...పెరిగిన చిల్లకంప

తీగలేరు నిర్మాణం పూర్తి కాకుండానే వర్షాలకు కాల్వ కోతలకు గురైంది. నిర్మించిన కాల్వంతా చిల్లకంప పెరిగి చిట్టడవిలా మారింది. మళ్లీ తిరిగి కాల్వ పనులు చేయాల్సి ఉంది. ప్రభుత్వం గుత్తేదారుల ఒప్పందం ప్రకారం సెప్టెంబరు 2018 నాటికి కాల్వ పూర్తి చేయాల్సి ఉంది. కాల్వలపై 74 వంతెనలు నిర్మించాల్సి ఉండగా 19 మాత్రమే నిర్మించారు. ప్రభుత్వం 2018 నాటికి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో కాల్వల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది.

ఆయకట్టు వివరాలు ఇవి...

తీగలేరు కాల్వ పూర్తి అయితే ఆయకట్టుగా 62 వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి. దోర్నాల మండలంలో కటకానిపల్లి 1966, చిన్నదోర్నాల 832, దోర్నాల 1270, పెద్ద బొమ్మలాపురం 2032 మొత్తం 6,100, పెద్దారవీడు మండలంలో పెద్దారవీడు 2065, సానికవరం 4994, బద్వీడు చెర్లోపల్లి 2256, మద్దలకట్ట 1113, గొబ్బూరు 3126, చట్లమిట్ల 2225, తోకపల్లి 1154, ఓబులక్కపల్లి 647 మొత్తం 17600 ఎకరాలు, ఎర్రగొండపాలెం లింగంవారిపల్లి 474, అమానిగుడిపాడు 3562, బోయలపల్లి 871, గురిజేపల్లి 2024, గుర్రపుశాల 3537, కొలుకుల 1665, వెంకటాద్రిపాలెం 3766, వీరభద్రపాలెం 647, ఎర్రగొండపాలెం 2354, మొత్తం 19800 ఎకరాలు, త్రిపురాంతకం మండలం రామసముద్రం 1042, మిట్టపాలెం 1866, దువ్వలి 928, లేళ్ళపల్లి 1019, దూపాడు 2115, మొత్తం 7 వేల ఎకరాలు, పుల్లలచెరువు మండలం కొమరోలు 1366, చాపలమడుగు 1484, మల్లాపాలెం 1239, అయ్యప్పరెడ్డిపల్లి 1171, కవలకుంట్ల 1128, రాచకొండ 1572, వెంకటరెడ్డిపల్లి 1216, ఉమ్మడివరం 1070, పుల్లలచెరువు 1254, మొత్తం 11500 ఎకరాలు.

అదనపు ఆయకట్టుకు ఎమ్మెల్యే కృషి

తీగలేరు కాల్వ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు పుల్లలచెరువుకు మరిన్ని ఎకరాలు సాగులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. ఆయన ప్రభుత్వం దృష్టికి పదే పదే తీసుకెళ్ళటంతో సర్వేకు అనుమతి నిచ్చింది. ఇందుకు రూ.54 లక్షల నిధులను మంజూరు చేసిందని సర్వే అనంతరం భూముల వివరాలు ఉన్నతాధికారులకు అందజేసి అనుమతులు రాగానే ఆ పనులు కూడా ప్రారంభిస్తామని తీగలేరు ఈఈ చిన్నబాబు తెలిపారు.

కార్పొరేషన్ రుణాల్లో ఎవరి వాటా ఎంత?

- ముగిసిన ఇంటర్వ్యూలు
- మొదలైన బేరసారాలు
- మీరు ఇచ్చేది సబ్సిడీలోనే కదా అంటున్న మధ్యవర్తులు

చీరాల : కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించి బేరసారాలు మొదలయ్యాయి. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి కొందరు వ్యక్తులు మధ్యవర్తిత్వం మొదలుపెట్టారు. అయితే దరఖాస్తుదారులలో కొందరు ముందస్తుగా డబ్బు ఇచ్చేది లేదని రుణం మంజూరై డబ్బు చేతికి వస్తేనే మీ కమిషన్ ఇస్తామని ఖరాఖండిగా చెప్పారు. దీంతో వారి హడావుడి కొంత మేర తగ్గింది. ఈ నెల 23,24,28,29 తేదీలలో కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరిగాయి. వీరిలో అర్హులకు రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అర్హుల జాబితాను గుర్తించటంలో మండల పరిధిలో నియమించిన కమిటీ, బ్యాంకు ప్రతినిధులదే తుది నిర్ణయం. అయితే బ్యాంకర్లు రుణం తిరిగి చెల్లించే పరిస్థితి ఉన్న వారికి రుణాలు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. అయితే ముందస్తుగా కమిటీ సభ్యుల ఆమోదం కూడా అవసరమని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మరలా తెరపైకి మధ్యవర్తులు రంగప్రవేశం చేస్తున్నారు. రుణానికి సంబంధించి వచ్చే సబ్సిడీలో ఎంత మొత్తం మామూలుగా ఖర్చు చేయగలరని బేరసారాలు మొదలు పెట్టారు. కొందరు ద్వితీయశ్రేణి నాయకులను ఆశ్రయిస్తున్నారు. మండల పరిధిలో మొత్తం 690 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 402 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో 315 మందిని ఎంపిక చేయాల్సి ఉంది. ఆ ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఇంటర్వ్యూలు ముగిశాయి. లబ్ధిదారులను జాబితాను ప్రకటించాల్సి ఉంది. కమిటీలోని పది మంది రుణగ్రహీతలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కమిటీ వారు ముందస్తుగా ఆమోదం తెలిపితే తుదిగా బ్యాంకర్లు, మధ్యవర్తులు తమకు ఇష్టమొచ్చిన వారిని ఎంపిక చేస్తారేమోననే సందేహాన్ని కమిటీ బాధ్యులతో కొందరు సందేహ పడుతున్నారు. అయితే కమిటీకి సంబంధించి ఎవరు ఉన్నా ఎవరికి ఎలాంటి సంబంధం లేకుండా తృణమో, ఫణమో తమకిస్తే రుణాలు మంజూరు చేయిస్తామని మధ్యవర్తులు ఎరవేస్తున్నారు.

ఎవరెవరికి ఎంతెంత?

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి పారదర్శకత ఉండాలని పాలకులు స్పష్టంగా చెప్తున్నారు. అయితే ఆచరణలో అది అమలు కావటం లేదు. లబ్ధిదారులు ఎంతోకొంత తమకు వచ్చే సబ్సిడీలో చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనార్టీ, బీసీలకు మాత్రమే ఈ రుణాలు పొందే అర్హత ఉంది. వారు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. యూనిట్ విలువను బట్టి సబ్సిడీ మొత్తం మారుతుంది. మండల పరిధిలో ఎస్సీలకు 184, ఎస్టీలకు 10, బీసీలకు 70, మైనార్టీలకు 11, కాపులకు 40 చొప్పున రుణాలు మంజూరుకు అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఎస్టీలలో యానాదులకు 90 శాతం, బీసీ, మైనార్టీ, కాపులకు 50 శాతం సబ్సిడీ వస్తుంది. యూనిట్ విలువ పెరిగితే రూ.లక్ష మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది. దీంతో మధ్యవర్తులు కొందరు మీకు ఇంటర్వ్యూలు పూర్తయినా రుణాలు మంజూరు కావాలంటే తమ అవసరం ఉంటుందని నమ్మబలుకుతున్నారు. మీరు మీ చేతి డబ్బు ఏమీ ఇవ్వటం లేదు కదా సబ్సిడీ మొత్తంలో కొంత ఇవ్వండి అని వారిని అనునయిస్తున్నారు. దీంతో వచ్చే సబ్సిడీలో కొంత ఇచ్చేందుకు ఇంటర్వ్యూలకు వచ్చిన వారిలో కొందరు అంగీకరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ మధ్యవర్తుల బెడద లేకుండా అర్హులైన వారికి మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా మూతపడ్డ పాఠశాలల భవనాలు

- పలు చోట్ల అన్యాక్రాంతం
- ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగంలో నిర్లక్ష్యం

అద్దంకి: లక్షల రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తున్న ప్రభుత్వం తర్వాత వాటిని వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. గతంలో విద్యార్థులకు అందుబాటులో పాఠశాలలు ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి గ్రామంలో రెండుమూడు పాఠశాలల ఏర్పాటు జరిగింది. అదే సమయంలో లక్షల రూపాయలు వెచ్చించి భవనాలు కూడా నిర్మించారు. విద్యార్థులు సరిపడా లేరని కొన్ని చోట్ల... ప్రస్తుతం మారిన విద్యా విధానంతో గ్రామానికి ఒక ప్రాథమిక పాఠశాల అన్ని సౌకర్యాలతో ఉండాలన్న ఉద్దేశంతో గతంలో ఉన్న పలు పాఠశాలలను మూసివేసి ఒక చోట మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మూసివేసిన పాఠశాలల భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ భవనాలను ఇతర శాఖల అవసరాల కోసం వినియోగించు కునే అవకాశం ఉన్నా అధికారుల మధ్య సమన్వయ లోపంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ రెవెన్యూ కార్యాలయాలు, సాక్షర భారత్ కేంద్రాలు తదితర విభాగాలకు సంబంధించి భవనాలు అందుబాటులో లేవు. అయినప్పటికీ మూతపడ్డ పాఠశాల భవనాలను ఆయా శాఖల అధికారులు వినియోగించుకోవచ్చు. కానీ, అత్యధిక చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల కోసం కొత్తగా భవనాలు కడుతున్నారే కానీ, మూతపడ్డ పాఠశాల భవనాలను ఉపయోగించుకోవాలన్న ఆలోచనే అధికారులకు రాకపోవడం శోచనీయమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. పలు శాఖలకు కొత్తగా భవనాలు నిర్మించే కంటే వీటన్నింటిని వినియోగించుకునేలా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రామైక్య సంఘాల కోసం కూడా పలు గ్రామాలలో భవనాలు నిర్మించాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్న నేపథ్యంలో పాఠశాల భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటిని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.


గోపాలనగరం ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా భవనం, చెరువుకొమ్ముపాలెంలో పశువుల పాకగా భవనం

గ్రామగ్రామాన అవెన్యూ ప్లాంటేషన్లు

ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమాలు

టంగుటూరు: డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో మండలంలో గ్రామగ్రామాన అవెన్యూ ప్లాంటేషన్‌కు వెలుగు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. ఇందుకు అవసరమైన 5 రకాలకు చెందిన 4,400 మొక్కలు హైదరాబాద్ నుంచి బుధవారం టంగుటూరులోని వెలుగు కార్యాలయానికి చేరాయి. వాతావరణ సమతుల్యత సాధించి ప్రకృతి విపత్తుల నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తుంది. మండల స్థాయిలో వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ శాఖలకు ఈ బాధ్యత అప్పగించారు. ఈ ఏడాది వెలుగు వారి ద్వారా అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో ప్రతి గ్రామంలో కిలోమీటరు పొడవున మొక్కలు నాటే పని చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా అర కిలోమీటర్ లెక్కన మొత్తం కిలోమీటరు పొడవున మొక్కలు నాటుతారు. తొలి విడతలో మండలంలో 11 పంచాయతీలలో ఈ కార్యక్రమం చేపట్టారు. టంగుటూరు, అనంతవరం, ఆలకూరపాడు, వెలగపూడి, కాకుటూరివారిపాలెం, జయవరం, వల్లూరు, వాసేపల్లిపాడు, సూరారెడ్డిపాలెం, మర్లపాడు, కొణిజేడులలో మొక్కలు నాటనున్నారు. మిగిలిన గ్రామాల్లో రెండో విడతలో మొక్కలు నాటుతారు. ప్రతి గ్రామంలో కిలోమీటర్ పొడవున 400 మొక్కలు నాటుతారు. వేప, గానుగ, చింత, కొత్త రకం మొక్కలు సీమ రూబు, సిస్ రకాల మొక్కలు వచ్చాయి. లారీలో వచ్చిన మొక్కలను వెలుగు ఏపీఎం తూమాటి రాజారావు స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ సర్పంచ్‌ల సహకారంతో వాటిని నాటనున్నట్లు ఆయన చెప్పారు. మొక్కలు నాటే పనులకు ఎన్ఆర్ఈజీఎస్ కూలీలను వినియోగిస్తారు. మొక్కలు వేసేందుకు తీసే ప్రతి కుంటకు రూ36-70 పైసలు, అలాగే మొక్క నాటేందుకు మొక్కకు రూ7 కూలీలకు చెల్లిస్తారు. అవెన్యూ ప్లాంటేషన్‌పై ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ మొక్కలు రాగానే బుధవారమే వెలుగు ఏపీఎం రాజారావుతో చర్చించారు. గురువారం ఉదయానికి ఆయా పంచాయతీ కేంద్రాలకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున మొక్కలు ఇప్పుడే నాటాలని ఎంపీపీ సూచించారు. రక్షణగా కంచె ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఎం చెప్పారు. నాటిన మొక్కల్లో బతకని మొక్కలు స్థానంలో కొత్తవి నాటేందుకు వచ్చే ఏడాది 20 శాతం మొక్కలకు అవకాశం కల్పిస్తామని, మొక్కల పరిరక్షణకు మనిషిని కేటాయిస్తారని చెప్పారు. గ్రామాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.


లారీ నుంచి దించుతున్న మొక్కలు


ప్లాంటేషన్ కోసం తెచ్చిన మొక్కలు

‘మిస్ ట్రాన్స్‌క్వీన్-2017’ విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **‘ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017’కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)
2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)
3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)
4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)
5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా
6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్
7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన ‘నంగ్‌తాంగ్ తంపక్’ గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్
8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజౌరి
9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్



10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**
ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా

11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30
12. **ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ
13. **101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత
14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్
15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్
16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై
17. **ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి
18. **‘గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు’గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి
20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ ‘విస్తారా’తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)
21. **రైల్వే బోర్డు నూతన చైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్థుతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహని
22. **ఒడిశా ప్రభుత్వం అందించే ‘బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్’ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు
23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి
24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ‘స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్’ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)
25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)
26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ
27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్
28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్
29. **లింగ సమానత్వం కోసం ‘జండర్’ ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా
30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి ‘విదేశీభవన్’ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు
31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా



32. **స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన ‘మిస్ ట్రాన్స్‌క్వీన్-2017’ విజేత?**
ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ

33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు
34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ
35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తముర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది
36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)
37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్
38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్
39. **‘జార్’లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్
40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

1) సి	7) డి	13) బి	20) ఎ	27) బి	34) బి	
2) డి	8) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ	
3) బి	9) ఎ	15) బి	22) బి	29) డి	36) డి	
4) ఎ	10) బి	16) బి	23) బి	30) ఎ	37) సి	
5) ఎ	11) బి	17) సి	24) ఎ	31) డి	38) బి	
6) బి	12) డి	18) సి	25) బి	32) ఎ	39) డి	
		19) ఎ	26) డి	33) డి	40) బి	

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 5
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆరోపెడిక్స్ 1)
కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు
అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న
వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం
2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్
3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంబన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్
4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం
5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్
6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్
7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ
8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపొడర్ డి) ఏదీకాదు
9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు
10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం
11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2
12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్
13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్
14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్
15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ ఫెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్
16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ
17. ఆర్ధ్రతను కొలిచే పరికరం?
ఎ) థర్మామీటర్ బి) హైడ్రోమీటర్
సి) హైగ్రోమీటర్ డి) బారోమీటర్
18. చల్లని నీటిలో పూర్తిగా రూపాంతరం చెందనిది?
ఎ) బెంజోయికామ్లం బి) చక్కెర
సి) వంటసోడా డి) కాస్టిక్‌సోడా
19. పెట్రోల్ వల్ల కలిగే మంటలను ఆర్పేందుకు నీటిని ఉపయోగించరు ఎందుకు?
ఎ) నీటి చల్లదనం కన్నా మంటలు అధికంగా ఉంటాయి
బి) నీరు, పెట్రోల్ రసాయనికంగా చర్య జరుగుతుంది
సి) నీరు, పెట్రోల్ ఒకదానితో ఒకటి కలిసిపోయి పై పొరలోని పెట్రోల్ మండుతుంది
డి) ఏదీకాదు
20. నీరు మరిగే స్థానం?
ఎ) ఎల్లప్పుడూ 100°C
బి) వాతావరణ పీడనంపై ఆధారపడి ఉంటుంది
సి) సాపేక్ష ఆర్ద్రతపై ఆధారపడుతుంది
డి) సాంద్రతపై ఆధారపడుతుంది
21. వాతావరణం కలిగి ఉండే నీటిఆవిరి పరిమాణం కింది వాటిలో దేనిపై ఆధారపడుతుంది?
ఎ) ఉష్ణోగ్రత పెరిగితే నీటి పరిమాణం పెరుగుతూ ఉంటుంది
బి) ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి పరిమాణం తగ్గుతుంది
సి) ఉష్ణోగ్రతపై ఆధారపడదు డి) ఏదీకాదు

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

22. శరీరంపై మరుగుతున్న నీరు పడినప్పుడు కంటే వేడి నీటి ఆవిరి వల్ల ఎక్కువ బొబ్బలు ఎందుకు వస్తాయి?
ఎ) నీటి ఆవిరి శరీరంలోకి తొందరగా చొచ్చుకొని పోతుంది
బి) నీటి ఆవిరి అధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉంటుంది
సి) నీటి ఆవిరికి వేడి నీటి కంటే శక్తి అధికం
డి) నీటి ఆవిరి అధిక పీడనాన్ని కలిగి ఉంటుంది
23. అరచేతిలో 'ఈథర్' ద్రావణం పోసినప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
ఎ) ఈథర్ చల్లని ద్రావణం కనుక
బి) భాష్పీభవనం చెందుతుంది
సి) స్వేద రంధ్రాలను చేరుతుంది
డి) అరచేతిలో కందెనగా మారడం వల్ల
24. ఒక వ్యక్తి సముద్రపు నీటిలోకి ప్రవేశించగానే చల్లదనం పొందిన భావనకు గురవుతాడు. ఎందుకు?
ఎ) ఉష్ణ సంవహన ప్రవాహాలు
బి) శరీరంలో ఉష్ణ లవణాలు పేరుకుపోవడం
సి) దేహంపై నీరు భాష్పీభవనం వల్ల
డి) భూమికి, సముద్ర నీటికి మధ్య ఉష్ణోగ్రతల భేదం
25. థర్మో ఫ్లాస్క్‌లో చల్లని లేదా వేడి ద్రవాలు చాలాసేపటి వరకు అలాగే ఉండటానికి కారణం?
ఎ) థర్మో ఫ్లాస్క్‌లో రెండుగోడల నిర్మాణాలు అధమ ఉష్ణ వాహకంగా పనిచేస్తాయి
బి) ఈ రెండు గోడల నిర్మాణాలకు లోపలి భాగం సిల్వర్ పూత ఉంటుంది
సి) రెండు గోడల నిర్మాణాల మధ్య శూన్య ప్రదేశం ఉంటుంది డి) బి, సి
26. ఒక నదిలో ప్రయాణిస్తున్న నౌక సముద్రానికి చేరిన వెంటనే...
ఎ) కొద్దిగా పైకి లేస్తుంది
బి) కొద్దిగా మునుగుతుంది
సి) అదేవిధంగా కొనసాగుతుంది డి) ఏదీకాదు
27. సముద్రపు సాంద్రత దేనిలో పెరుగుతుంది?
ఎ) సముద్రపు లోతు, లవణీయత తగ్గుతూ ఉంటే
బి) సముద్రపు లోతు, లవణీయత పెరుగుతూ ఉంటే
సి) సముద్రపు లోతు పెరిగి లవణీయత తగ్గుతూ ఉంటే
డి) లవణీయత, సముద్రపు లోతు పెరుగుతూ ఉంటే
28. కింది ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
ఎ) నీరు బి) పాదరసం సి) ఈథర్ డి) ఆల్కహాల్
29. ఘనీభవించిన సరస్సులో చేపలు జీవించి ఉండటానికి కారణం?
ఎ) చేపల రక్తం వేడిగా ఉంటుంది
బి) మంచు కింద భాగంలోని నీరు ఘనీభవనం చెందదు
సి) మంచు ఒక మంచి ఉష్ణవాహకం
డి) ఏదీకాదు
30. రెండు పాదరస బిందువులను కలపగా ఒక పెద్ద బిందువుగా మారడానికి కారణం?
ఎ) కనిష్ఠ ఘనపరిమాణం
బి) గరిష్ఠ తలతన్యత
సి) కనిష్ఠ తలతన్యత వైశాల్యం
డి) గరిష్ఠ ఘనపరిమాణం
31. ఘనీభవించిన సరస్సు పైభాగంలో -
15°C ఉష్ణోగ్రత ఉంటే కింది పొరల్లో ఉండే ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 0°C బి) 4°C సి) -15°C డి) -7.5°C
32. శీతల ప్రదేశాల్లో ఉపయోగించే థర్మామీటర్‌లో పాదరసం కన్నా ఆల్కహాల్ ద్రావణాన్ని తీసుకోవడానికి కారణం?
ఎ) ఆల్కహాల్ ఉత్తమ ఉష్ణవాహనం
బి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం తక్కువ
సి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం ఎక్కువ
డి) ఏదీకాదు
33. 97% సముద్రపు నీరు, 3% శుద్ధమైన నీరు ఉండే లవణం?
ఎ) జలావరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) శిలావరణం డి) వాతావరణం
34. నీరు అనేది ఒక?
ఎ) ఒక మూలకం బి) ఒక ద్రవం
సి) ఒక మిశ్రమం డి) ఒక సంయోగ పదార్థం
35. నీటిలో ఆక్సిజన్ ఎంత శాతం ఉంటుంది?
ఎ) 86% బి) 96% సి) 21% డి) 100%
36. చెమట ఎక్కువగా పట్టేస్థితి?
ఎ) వేడి అధికంగా ఉండి, గాలిలో తేమ ఉండటం
బి) వేడి అధికంగా ఉండి గాలి పొడిగా ఉండటం
సి) వేడి తక్కువగా ఉండి గాలిలో తేమ ఉండటం
డి) వేడి తక్కువగా ఉండి గాలి పొడిగా ఉండటం
37. వార్షిక గ్లోబల్ ఇన్నోవేషన్ బారోమీటర్‌లో ఇండియా స్థానం?
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6
38. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం?
ఎ) ఏప్రిల్ 7 బి) మే 7
సి) ఆగస్టు 7 డి) సెప్టెంబరు 6
39. ఇండియాలో చమురు శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ) 19 బి) 18 సి) 17 డి) 16
40. వాటర్ గ్యాస్ అంటే?
ఎ) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్
బి) కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్
సి) అల్యూమినియం హైడ్రేట్ డి) ఏదీకాదు
41. అనిమోమీటర్ ద్వారా దేన్ని లెక్కించవచ్చు?
ఎ) సముద్ర స్థాయిపైన ఎత్తుని బి) గాలి తేమను
సి) సముద్రపు లోతు డి) గాలి వేగాన్ని
42. వెంచురీ మీటర్ ద్వారా దేన్ని లెక్కిస్తారు?
ఎ) ప్రవాహిరేటు బి) గాలివేగం
సి) సాంద్రత డి) ఆర్ద్రత
43. మేఘాలు ఏర్పడటానికి కింది వాటిలో ఏది అవసరం లేదు?
ఎ) వాతావరణంలోని దుమ్ము కణాలు
బి) నీరు ఆవిరి కావడం సి) నీరు గడ్డకట్టడం
డి) గాలి
44. ద్రవ నైట్రోజన్‌లో దీర్ఘ అపరిశుద్ధమైనది?
ఎ) ద్రవ హీలియం బి) ద్రవ ఆక్సిజన్
సి) ఘన కార్బన్ డై ఆక్సైడ్ డి) ద్రవ హైడ్రోజన్
45. వేసవి ద్రవంగా పిలిచే పదార్థం?
ఎ) పాదరసం బి) నీరు సి) గాలియం డి) రేడియం

సమాధానాలు

		15) సి	23) బి	31) ఎ	39) ఎ
1) బి	8) బి	16) డి	24) సి	32) సి	40) ఎ
2) బి	9) ఎ	17) సి	25) డి	33) ఎ	41) డి
3) సి	10) ఎ	18) ఎ	26) ఎ	34) డి	42) ఎ
4) ఎ	11) ఎ	19) సి	27) డి	35) ఎ	43) సి
5) డి	12) సి	20) బి	28) బి	36) ఎ	44) డి
6) సి	13) ఎ	21) ఎ	29) బి	37) డి	45) సి
7) సి	14) బి	22) సి	30) సి	38) ఎ	

స్కాలర్‌షిప్

నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి), హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్(హెచ్‌బిసిఎస్‌ఇ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌కు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

విభాగాలు: ఆస్ట్రానమీ, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్
అర్హత: నవంబరు 30 నాటికి ఇంటర్ లోపు చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు
వయసు: 1998 జూలై 1 నుంచి 2003 జూన్ 30 మధ్య జన్మించి ఉండాలి
విభాగం: జూనియర్ సైన్స్
అర్హత: నవంబరు 30 నాటికి పదోతరగతి లోపు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: 2003 జనవరి 1 నుంచి 2004 డిసెంబరు 31 లోపు జన్మించి ఉండాలి.

ఈ ప్రోగ్రామ్‌లో అయిదు స్టేజ్‌లు ఉంటాయి. మొదటి స్టేజ్‌ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి) నిర్వహిస్తుంది. మిగిలినవాటిని హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బిసిఎస్‌ఇ) నిర్వహిస్తుంది.

స్టేజ్ 1 - ఫస్ట్ స్టెప్ టు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ 2018 ఎగ్జామ్స్: నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఇన్ ఆస్ట్రానమీ (ఎన్ఎస్ఇఎ), బయాలజీ (ఎన్ఎస్ఇబి), కెమిస్ట్రీ(ఎన్ఎస్ఇసి), జూనియర్ సైన్స్ (ఎన్ఎస్ఇజెఎస్), ఫిజిక్స్(ఎన్ఎస్ఇపి)
పరీక్ష తేదీలు: ఎన్ఎస్ఇజెఎస్ ఎగ్జామ్ నవంబరు 19న, మిగతావన్నీ నవంబరు 26న
ఎన్‌రోల్‌మెంట్‌నకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15

ప్రతి సబ్జెక్టులో అర్హత పొందిన మొదటి 300 మందిని స్టేజ్ 2కు అనుమతిస్తారు.

స్టేజ్ 2 ఎగ్జామ్స్: ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్స్ ఇన్ ఆస్ట్రోనమీ, బయాలజీ, కెమిస్ట్రీ, జూనియర్ సైన్స్, ఫిజిక్స్(ఐఎన్ఎఒ, ఐఎన్‌బిఒ, ఐఎన్‌సిహెచ్‌ఒ, ఐఎన్‌జెఎస్ఒ, ఐఎన్‌పిహెచ్ఒ)
స్టేజ్ 3: ప్రతి సబ్జెక్టులో ఓరియంటేషన్ కం సెలెక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని స్టేజ్ 4 కింద ప్రి డిపార్చ్యూర్ ట్రైనింగ్‌కు పంపుతారు. తదుపరి స్టేజ్ 5 ఉంటుంది.

పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.iapt.org.in
olympiads.hbcse.tifr.res.in

అడ్మిషన్స్

ఎన్ఐఇఎల్ఐటి

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- కింద పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **పీజీ డిప్లొమా**

విభాగాలు: క్లవుడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ
కాలవ్యవధి: 24 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి
విభాగం: ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టం డిజైన్
కోర్సు వ్యవధి: 24 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 25 నుంచి

జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు

- **బిగ్ డేటా అనలిటిక్స్**

కోర్సు కాలవ్యవధి: 16 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి

- **ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్**

కోర్సుల కాల వ్యవధి: 12 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 11 నుంచి
వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

అందరూ విద్య నేర్చుకోవాలి

త్రిపురాంతకం: ప్రతి ఒక్కరూ విద్య నేర్చుకొని విలువలను పెంచుకోవాలని సాక్షర భార త్ మండల కోఆర్డినేటర్ సురేష్ అన్నారు. మండలంలోని జి. ఉమ్మడివరం గ్రామంలో సాక్షర భారత్ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మనిషికి విలువ, గౌరవం రావాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. అనంతరం రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు.

పంట నమోదు తప్పనిసరి

త్రిపురాంతకం: ప్రతి రైతు పంట నమోదును తప్పని సరిగా చేయించుకోవాలని ఎంపీవో లాలునాయక్ రైతులు సూచించారు. జి.ఉమ్మడివరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వరి సాగును పరిశీలించారు. వందశాతం రాయితీతో జింకు, జిప్సం, బోరాన్ రైతులకు అందజేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ కాలేజీ విద్యార్థుల రాస్తారోకో

ఎర్రగొండపాలెం : తరగతులు లేక చెట్ల కింద చదువుకోవల్సిన దుస్థితి నెలకొందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ మూడేళ్లుగా కళాశాల భవనాలు నిర్మాణంలోనే ఉన్నాయన్నారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో అవి ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తరగతుల నిర్వహణపట్ల జూనియర్ కాలేజీ వారు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. త్వరితగతిన భవనాలను పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు.

రోడ్డుపై వరినాట్లు



బురద రోడ్డుపై వరినాట్లు వేస్తున్న మహిళలు

గంగుపల్లి ఎస్సీ కాలనీ మహిళల వినూత్న నిరసన

ఎర్రగొండపాలెం : వీధి రోడ్డుపై వరినాట్లు వేసి మహిళలు నిరసన తెలిపిన సంఘటన గంగుపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. కాలనీలో కనీస వసతులు లేవని, సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి వీధి రోడ్డు బురదమయమై నడిచేందుకు కూడా వీలులేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం వీధి రోడ్డులో వరినాట్లు నాటారు. ఈ కాలనీలో 600 పైగా జనాబా నివాసముంటున్నారు. సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించలేదని స్థానికులు తెలిపారు. గుర్రపు సాల గ్రామపంచాయతీలో ఉన్న ఈ కాలనీలో వసతులు కల్పించాలని అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని, వీధిలో ఏర్పడిన గుంతలు కూడా పూడ్చలేదని కాలనీవాసులు బెజవాడరాజారావు, దర్శనం సామ్యేలు, యోగయ్య, వెంకటయ్య తెలిపారు. తక్షణమే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి కాలనీకి రోడ్లు, కాల్వలు, మౌలికవసతులు కల్పించాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తీరును తప్పుబట్టారు.

నేడు జాబ్‌మేళా

పెద్ద దోర్నాల: భ్రమరాంబ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగ పరుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ మీరావలి బుధవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి పీజీ చేసిన అభ్యర్థులు మేళాను సద్వినియోగపర్చుకోవాలని, 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు, ఎమ్మెల్యే పి.డేవిడ్ రాజు హాజరవుతారని ఆయన తెలిపారు.

నూర్ బాషా సంఘం యూత్ కార్యదర్శిగా ఖాశిం పీరా

పెద్ద దోర్నాల: రాష్ట్ర నూరు బాషా సంఘం ఎన్నిక ఈనెల 27న జరిగింది. ఈ కమిటీలో రాష్ట్ర యూత్ జాయింట్ కార్యదర్శిగా చిన్నదోర్నాలకు చెందిన దూదేకుల ఖాశింపీరా ఎన్నికయ్యారు.

గ్రంథాలయం ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ఎర్రగొండపాలెం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముందస్తుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పోటీలు వారం నిర్వహించారు. 6, 7 తరగతుల బాలికలకు జూనియర్స్ విభాగంగా, 8, 9, 10 తరగతి బాలికలకు సీనియర్స్‌గా విభజించి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని సైన్సు ఉపాధ్యాయులు నాగమూర్తి, గ్రంథ పాలకులు కె.జాన్సీ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోటీల వలన విద్యార్థుల్లో మేథాశక్తి పెరుగుతుందని అన్నారు.

పంట సాగు ధ్రువీకరణ పత్రాలను కౌలు రైతులు తీసుకోవాలి

పుల్లలచెరువు: కౌలు రైతులు పంట ధ్రువీకరణ పత్రాలను తీసుకొని ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఐటీవరం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఆహార భద్రతా మిషన్ పథకం కింద జనరేటర్లు రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా 500 హెక్టార్లలో కంది సా గులో ఉన్నదని, మెట్ట పరిస్థితుల నుంచి కాపాడుకునేందుకు కంది సాలుకు తల్లి సాలును నాగళితో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జవహర్‌లాల్ నాయక్

'ఆరోగ్య రక్ష' వరం



ఆరోగ్యరక్షపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య మిత్రలు

పెద్ద దోర్నాల: ఆరోగ్య రక్ష పథకం ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వైద్య మిత్రలు రాంబాబు, చంద్రశేఖర్, మణి కుమార్ అన్నారు. మోట్ల మల్లికార్జునపురం వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరోగ్య రక్ష పథకంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు లేని వారు ఏడాదికి రూ.1200 చెల్లించినట్లయితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో 1044 వ్యాధులకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో బీటీఎల్ హుస్సేన్‌వలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిరాలకు గిడుగు సాహితీ ప్రతిభా పురస్కారం



మద్దిరాలను సన్మానిస్తున్న రచయితల సమాఖ్య

త్రిపురాంతకం: కంకనాలపల్లి యూపీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న మద్దిరాల శ్రీనివాసులుకు గిడుగు సాహితీ ప్రతిభా పురస్కారం లభించింది. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా మంగళవారం ఒంగోలులోని నారాయణ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమం సందర్భంగా శ్రీనివాసులుకు ప్రతిభ పురస్కారం, ప్రశంసా పత్రం, మెమోంటో అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షుడు అంకమ్మరావు, కార్యదర్శి ప్రసాదుబాబు, నవ్యాంధ్ర చయితల సంఘ గౌరవాధ్యక్షులు పీ.అరుణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వేతనం పెంచాలి

పెద్ద దోర్నాల: వీఆర్ఏల వేతనం పెంచాలని ఆ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పూర్ణకంటి యాకోబు ప్రభుత్వాన్ని కోరారు. మండల వీఆర్ఏల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా యాకోబు మాట్లాడుతూ తె లంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు రూ.10,500 వేతనం ఇస్తుండగా, ఇక్కడ రూ.6,500 ఇస్తున్నారన్నారు. వెంటనే జీతాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సంఘ మండల అధ్యక్షుడు ఆశీర్వాదం, కార్యదర్శి వెంకటనారాయణ, కోశాధికారి డి.పెద్ద కాశయ్య, వెంకటేశ్వర్లు, మూగయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఊట బెల్లం, సారా ధ్వంసం

పెద్ద దోర్నాల: ఎక్సైజ్ శాఖ అధికారులు జరిపిన దాడుల్లో 1500 లీటర్ల బెల్లంఊట, 20 లీటర్ల సారాను కడపరాజుపల్లెలో బుధవారం ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది రంగారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

త్రిపురాంతకం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయ హుండీని బుధవారం ఈవో రమేష్ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.9,51,566 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

త్రిపురాంతకం: మండలంలోని వెల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సాంబశివరావు, హిమబిందు, బీవీ నరసింహారావు, మురహరిలను ఎంఈవో కేటీ మల్లికార్జుననాయక్, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులందరి సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచారని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి పంపిణీ

త్రిపురాంతకం: ఇటీవల మరణించిన మండలంలోని డీవీఎన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హనుమంతరావు కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమనిధి నుంచి రూ.లక్షా నలభైవేలు ఎంఈవో కేటీ మల్లిఖార్జుననాయక్, యూటీఎఫ్ ప్రతినిధులు బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఆవుల వెంకటేశ్వర్లు, బీవీ నరసింహారావు, కె.నాగభూషణం, పద్మనాభరెడ్డి, సురేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

త్రిపురాంతకం: అన్ని పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఎంఈవో కేటీ మల్లికార్జున్‌నాయక్ అన్నారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం వివరాలను రోజూ ఎస్ఎంఎస్ రూపంలో అధికారులకు పంపించాలని సూచించారు. నాణ్యత గల కోడి గుడ్లు మాత్రమే విద్యార్థులకు పెట్టాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో మల్లికార్జున్ నాయక్

నేడు గుంటూరులో సంచార జాతుల విముక్తి దినోత్సవం

మార్కాపురం వన్‌టౌన్ : గుంటూరులోని అరండల్ పేటలో గురువారం సంచార జాతుల వి ముక్తి దినోత్సవం జరుగుతుందని దాసరి సంక్షేమ సంఘ జిల్లా కోశాదికారి తుపాకుల శ్రీని వాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1952 ఆ గస్టు 31న దాసరికులు టీటీ యాక్ట్ నుంచి వి ముక్తి పొందన సందర్భంగా ప్రతి ఏటా ఆ రోజున కేంద్ర ప్రభుత్వం సంచారజాతుల దినోత్సవం నిర్వహిస్తుందని వివరించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

మార్కాపురం వన్‌టౌన్ : మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సమావేశం గురువారం ఉదయం 11.30 గంటలకు స్థానిక అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్టిపై చేసిన గోవులను వధించుటకు అనుమతి

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పురపాలక సంఘ పరిధిలో బక్రీద్ పండుగ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్లచే సర్టిఫై చేసిన గోవులను స్లాటర్ హౌస్‌లలో వధించుటకు అనుమతించినట్టు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అన్ని పురపాలక సంఘాల పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్‌లతో సర్టిఫై చేసిన గోవులను మాత్రమే స్లాటర్ హౌస్‌లలో వధించాలని, ఆ విధంగా కాక బహిరంగంగా వధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శరవేగంగా అలుగు వాగు అభివృద్ధి పనులు

పొదిలి : పొదిలి చిన చెరువు అలుగు వాగు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వాగు పరివాహక ప్రాంతం చిల్లచెట్లతో ముసుకుపోయింది. చెత్తచెదారం పేరుకుపోయి వాగు పూడిపోవడంతో వర్షపునీరు వెళ్లే అవకాశం లేకపోయింది. మురుగు నిలిచిపోయి వాగు పరివాహక ప్రాంతమంతా దుర్గంధం వ్యాప్తించింది. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో దోమల బెడద అధికమైంది. దీంతో చిల్లచెట్లను తొలగించి పూడిక తీసేందుకు మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. పెద చెరువు అలుగు నుంచి చిన చెరువు అలుగు వరకు, చిన చెరువు అలుగు నుంచి హరికృష్ణ థియేటర్ వెనుక వైపు వరకు చెట్లను తొలగించి పూడిక తీయనున్నారు. దీంతో వరద నీరు పారేందుకు అవకాశాలు మెరుగు పడనున్నాయి.



మురుగును తొలగిస్తున్న దృశ్యం

ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

6వ రోజు ప్రత్యేక పూజలు

ప్రతిమలకు అలంకరణలు, నిమజ్జనాలు

మార్కాపురం వన్‌టౌన్ : వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణేష్ నవరాత్రులు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద 6వ రోజు బుధవారం వినాయకునికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రాజాజీవీధి, ఉట్ల మండపం, కోనేటి వీధి, విజయలక్ష్మి వీధి, తూర్పు వీధి, నెహ్రూబజారు, గాంధీ బజారు, కొండేపల్లి రోడ్డు, వడ్డె బజారు తదితర ప్రాంతాల్లో మండపాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా నిమజ్జనోత్సవం

మార్కాపురం : వీహెచ్ ఆర్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల్లో బుధవారం వినాయక నిమజ్జన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగిం చి, గొబ్బూరు చెరువులో నిమజ్జనం చేశారు. కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ నాగ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, ఫణిభూషణ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



బెలూన్‌ల అలంకరణ మధ్య కోనేటి వీధి వినాయకుడు



నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

30 నుంచి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



డీఈకి సమ్మె నోటీసు ఇస్తున్న కార్మిక నాయకులు

మార్కాపురం వన్‌టౌన్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సెప్టెంబర్ 30 సమ్మె నుంచి సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈకి పలు కార్మిక సంఘాల నాయకులు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిటూ డివిజన్ కార్యదర్శి గుమ్మా బాల నాగయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.జగన్మోహనరెడ్డి, తోట నాగాంజనేయులు మాట్లాడుతూ ఆగస్టు 6న ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు అన్ని సమావేశమై సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం సెప్టెంబరు 30న నుంచి స మ్మెలోకి వెళ్లాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ మేరకు చలో విజయవాడ కార్యక్రమంలో ఆగస్టు 16న ట్రాన్స్‌కో సీఎండీకి సమ్మె నోటీసు ఇచ్చారని చెప్పారు. మీటరు రీడర్లు, బిల్ కలెక్టర్లకు పీస్ రేటు రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు వయసు, విద్యార్హతతో నిమిత్తం లేకుండా క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కందుల రమణారెడ్డి, సీహెచ్ శ్రీరామ్ రెడ్డి, షేక్ పెద్ద బాష, నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, కె.రమణారెడ్డి, వెంకటరెడ్డి, బి.రాములు, ఎస్‌కే కలాం, ఎ.రవికుమార్, ఎ.శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, రమణ, మదార్ వలి, వెంకటరెడ్డి, నారాయణ, వీరాంజనేయులు, నూర్‌షా వలి, అబ్దుల్లా, తిరుపతిరెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పొదిలి : కేంద్ర ప్రభుత్వం లా కమిషన్ సూచనల మేరకు అడ్వకేట్స్ అమిన్‌మెంట్ యాక్ట్ 2017 లో రూపకల్పన చేసి, అమలు చేస్తున్న చర్యలను నిలుపుదల చేయాలని కోరుతూ పొదిలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం తమ విధులు బహిష్కరించారు. ఈ సవరణ బిల్లు న్యాయవాది వృత్తి స్వయం ప్రతిపత్తి దెబ్బతిని న్యాయవాదులపై అజామయిషీ చేయుటకు వీలుగా తయారు చేయబడిందన్నారు. బిల్లు నిలుపుదల చేయకుంటే భవిష్యత్‌లో తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌ఎం బాషా, న్యాయవాదులు వి.నాగరాజు, శ్రీనివాసులు, డి.రామారావు, ఎం.ఖాదర్‌వలి, సురేష్‌కుమార్, నాయబ్ రసూల్, సుబ్బారావు, సలీం, జీవీ సుబ్బారావు, మహిళ న్యాయవాదులు శైలజ, జ్ఞానకుమారి పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

తర్లుపాడు : విజయవాడలో సెప్టెంబరు 1న సీపీఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు చేపట్టిన మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ఎర్రయ్య కోరారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి ఎర్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనం తరం తుమ్మలచెరువు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల ఎస్‌టీయూ అధ్యక్షుడు బీసీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యూసఫ్ షరీఫ్, ఉపాధ్యాయులు వి.రంగారావు, తిరుపతిరావు, బి.ప్రభాకరరావు, ఎం.జనార్ధనరెడ్డి, శివశంకర్ రెడ్డి, శ్రీనివాసరావు, శి వకుమారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎర్రయ్య

నీరు వృథా

మార్కాపురం వన్‌టౌన్: పట్టణంలో మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు వృథగా పోతోంది. గొర్లగడ్డ పీర్ల చావిడి వద్ద పంపిణీ చేస్తున్న ట్యాంకరుకు ఎటువంటి మూతలు లేవు. లీకులు ఉండటంతో నీరు వృథా అవుతోంది. అధికారులు స్పందించి మంచి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరంక్షించాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని రక్షించాలని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ గరల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కళింగరాజు అన్నారు. స్థానిక పాఠశాలలో బుధవారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు విచక్షణారహితంగా చెట్లను నరకటం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పీఈటీ ప్రసాదరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• సినిమాలు

మార్కాపురం

జగదీశ్వరీ	- జయజానకి నాయక
విజయా	- ఫిదా
శ్రీనివాస	- నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ	- ఆనందోబ్రహ్మ
సాయిబాలాజి	- వివేకం
విశ్వేశ్వర	- అర్జున్‌రెడ్డి

పొదిలి

వెంకటేశ్వర	- లై
హరికృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
రాఘవేంద్ర	- జయ జానకి నాయక

చిట్టీల్స్



మీకు తెలుసా?
వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



ఔనా!
మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

సూక్తి
అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.

ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదూ! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం

క్రీ.పూ. 10000



ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేలపైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు

క్రీ.పూ. 3600



ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.

క్రీ.పూ. 3400



పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.

క్రీ.పూ. 27



ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

క్రీ.శ. 1300
మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలం లోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.

1500
(పునరుజ్జీవన కాలం)



ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.

18వ శతాబ్దం



1865



'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కిటిల్' ఈమాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

1879
థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.

విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్జ్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి

1950



1970
స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.

1960



మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

1990



నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం

2012



ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

పదాలు కనుక్కోండి


L	E	A	F	Y	E	Y	P	N
Y	O	A	Y	E	K	L	E	C
C	R	U	E	K	A	D	N	R
E	A	T	L	R	R	L	W	I
I	N	U	L	U	T	O	O	S
P	G	M	O	T	F	C	R	P
C	E	N	W	R	E	D	B	W
E	L	P	P	A	P	M	A	J
B	C	H	A	N	G	E	Q	K

YELLOW PIE BROWN RAKE ORANGE	COLD CRISP AUTUMN RED	LEAF CHANGE APPLE TURKEY

చెప్పగలరా?
ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు
చెప్పగలరా?: ఉద్యమం
జంతర్‌మంతర్: 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. పారాహుష్యం 4. మెరుపు

రంగులద్దండి



జంతర్‌మంతర్
ఈ కింది పదాలను సరిచేయండి
1. మ్మఉడి ▸ ....
2. శ్రీరంకా ▸ ....
3. రూసాప్యం ▸ ....
4. రుపుమె ▸ ....

టంగ్ ట్విస్టర్స్
1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli

జెన్‌కో భూములకు విముక్తి

ఒంగోలు,ఆంధ్రజ్యోతి : నాగులుప్పలపాడు మండలంలో జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కోసం చేపట్టిన భూసేకరణను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆ మండలంలోని మూడు గ్రామాల్లోని నాలుగు వేల ఎకరాల సాగు భూమికి విముక్తి కలుగగా దాదాపు 20 గ్రామాల ప్రజలకు ఊరట కలగనుంది. దీని వెనుక పెద్ద పోరాటం, అరెస్టులు, కేసులు, ఉద్రిక్తతలు అనేక సంఘటనలు ఉన్నాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో నాగులుప్పలపాడు మండలం కనపర్తి సమీపంలో వాడరేవు పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఐదు యూనిట్లు కలిపి మొత్తం నాలుగు వేల మెగా యూనిట్ల విద్యుత్‌ను బొగ్గు ఆధారంగా ఉత్పత్తి చేయాలని భావించింది. ఇందుకోసం కనపర్తి, వినోదరాయునిపాలెం, చవటపాలెం గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే గుండ్లకమ్మ నీటి ఆధారంగా ఆ భూములలో రెండు పంటలు పండుతున్నాయని అలాంటివి తీసుకొంటే తమకు జీవనం ఏలా అని ఆయా గ్రామాల రైతులు, అలాగే భారీ విద్యుత్ ప్లాంట్లను బొగ్గు ఆధారంగా ఏర్పాటు చేస్తే దాని వల్ల కాలుష్యంతో తాము జీవించలేమని పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ప్రస్తుతం నాగులుప్పలపాడు మండల పరిషత్ అధ్యక్షుడు ముప్పవరపు వీరయ్య చౌదరి ఆప్పట్లో జెన్‌కో వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడిగా ఉండి దాదాపు పదికి పైగా గ్రామాల ప్రజలను కదిలించి పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆ సమయంలో పోలీస్ ప్రయోగాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి అరెస్టులు చేసి, కేసులు పెట్టినా ఆ గ్రామాల ప్రజలు వెనుకడుగు వేయలేదు. అదే సమయంలో హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటానికి కూడా దిగారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పును పొందగలిగారు. అలా జెన్‌కో భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయినా అందుకోసం గుర్తించిన భూములపై ప్రభుత్వ ఆంక్షలు కొనసాగుతూ వస్తున్నాయి.

వాస్తవ యజమానులు ఆ భూములను సాగు చేసుకుంటున్నప్పటికి క్రయ, విక్రయాలు, రిజస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయలేదు. బ్యాంకుల నుంచి రుణాలు కూడా ఇవ్వడం ఆపేశారు. అలా సాగు చేసుకోవడం తప్ప ఇతర హక్కులు, సౌకార్యలు పొందలేక తాము పడుతున్న అవస్థలను పలుమార్లు ఆ ప్రాంత ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకరాగా జిల్లా యంత్రాంగం ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళింది. అలా ఆరేడు సంవత్సరాలు కాలం గడుస్తూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వపండుగగా ప్రకటించడంతో పాటు ఆయన స్వగ్రామమైన వినోదరాయునిపాలెంలో భారీగా కార్యక్రమాలను మూడేళ్లుగా నిర్వహిస్తున్నది. జెక్‌కో బాధిత గ్రామాలలో ప్రకాశం పంతులు స్వగ్రామం అయిన వినోదరాయునిపాలెం కీలకమైనది కావడంతో ఈ సమస్య తీవ్రత ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. ఆ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించిన సమయంలో ఆ ప్రాంత ఎమ్మెల్యేగా ఉండి వారి అవేదన ప్రత్యక్షంగా చూచిన, ప్రస్తుత టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయకుమార్ కూడా ఇటీవల ఈ విషయంపై దృష్టిపెట్టారు. ప్రభుత్వ స్థాయి పెద్దలను కలిసి మాట్లాడారు. ఆ రైతులకు ఊరట కలిగేలా భూసేకరణ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకల సందర్భంగా ఎంపీపీ వీరయ్య చౌదరి మరికొందరు ఆ సభకు వచ్చిన పెద్దల దృష్టికి మరోసారి ఈ సమస్యను తెచ్చారు. దీంతో కలెక్టర్ వినయ్‌చంద్ ఆ వెంటనే ప్రభుత్వం దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లారు.

దీంతో కనపర్తి సమీపంలో ఏర్పాటు చేయతలపెట్టిన వాడరేవు థర్మల్ విద్యుత్ ప్లాంట్ కోసం ప్రతిపాదించిన భూసేకరణను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఇచ్చిన ఉత్తర్వులు బుధవారం జిల్లా యంత్రాంగానికి అందాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉండటం, బొగ్గు అందుబాటులో లేకపోవడం, సోలార్ విద్యుత్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టడం వంటి చర్యల నేపథ్యంలో కనపర్తి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదన మిరమించుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే అందుకోసం తీసుకోదలిచిన భూసేకరణను కూడా ఉపసంహరించుకున్నామని తదుపరి చర్యలను కలెక్టర్ తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో జెన్‌కో కోసం మూడు గ్రామాలలో తీసుకోదలిచిన నాలుగు వేల ఎకరాల భూమికి విముక్తి కలిగింది. రైతులకు తిరిగి అన్ని రకాల హక్కులు లభించనున్నాయి. అలాగే పరిసర పదికి పైగా గ్రామాల ప్రజలలో ఇప్పటి వరకు ఉన్న ఆందోళన శాశ్వతంగా తొలగనుంది.

కదలని రైతు రథం

(మొదటి పేజీ తరువాయి)

రైతులు మీ సేవ కేంద్రంలో వెయ్యి రూపాయలు చలానా చెల్లించి దరఖాస్తు చేసుకుంటే సంబంధిత మండల వ్యవసాయాధికారి దానిని పరిశీలించి అర్హత ఉంటే పైఅధికారులకు నివేదిస్తారు. అలా వచ్చిన అన్ని దరఖాస్తులను వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు సమగ్రంగా పరిశీలించి కలెక్టర్ ద్వారా ఇన్‌చార్జి మంత్రికి నివేదించాలి. మంత్రి ఆమోదం తెలిపిన తర్వాత వారికి రాయితీపై రైతు రథాలను ఇస్తారు. అయితే అర్హుల ఎంపిక, దరఖాస్తులు ఇతర మార్గదర్శకాలు అన్ని కాగితాలకే పరిమితమయ్యాయి. స్థానికంగా ఆయా నియోజకవర్గాలలో అధికార టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, లేదా ఆ నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా ఉన్న వారి నిర్ణయం ప్రకారం లబ్ధిదారుల ఎంపిక అన్నది బహిరంగ రహస్యం. ప్రస్తుతం జిల్లాలో అధికార పార్టీలో నెలకొన్న పరిణామాలు ఒక వైపు నాలుగైదు మండలాలు ఉండే నియోజకవర్గాలకు 33 లేదా 34 మా త్రమే కేటాయించడం మరో వైపు ప్రతిబంధకంగా మారింది. నియోజకవర్గం యూనిట్‌గా కేటాయింపు చేయడం కూడా హేతుబద్ధం కాదన్న విమర్శలు అధికార పార్టీ నేతల నుంచే వస్తున్నాయి. మూడొంతులు పట్టణ ప్రాంతం, ఒక వంతు గ్రామీణ ప్రాంతం ఉండే ఒంగోలు, చీరాల నియోజకవర్గాలను, ఆరేసి మండలాలు అవి కూడా పూర్తిగా గ్రామీణ ప్రాంతాలుగా, వ్యవసాయ ప్ర ధాన వృత్తిగా రైతులు అధికంగా ఉండే పర్చూరు, కొండపి, దర్శి, కనిగిరి వంటి సెగ్మెంట్లకు ఒకే విధంగా కేటాయింపులను ప్రభుత్వం చేసింది. ఈ తరహా కేటాయింపులపై నేతలలో నిరసనలు వ్యక్తం కావడమే కాక మండలానికి ఐదారు ట్రాక్టర్లు కూడా ఇవ్వలేని పరిస్థితి ఎదురైంది. దీంతో మండల నాయకులకు సర్దిచెప్పలేక నియోజకవర్గ బాధ్యులు సతమతం అవుతున్నారు. ఫలితంగా లబ్ధిదారుల జాబితాలు రూపొందించడంలో జాప్యం జరుగుతున్నది. మరో వైపు జిల్లాలో అధికార పార్టీలో ఉన్న విభేదాలు ప్రభావం కూడా వీటిపై చూపిస్తున్నది. కొన్ని నియోజకవర్గాలలో స్థానిక ప్రజాప్రతినిధి కొన్ని పేర్లతో కూడిన జాబితా ఇస్తే అదే సెగ్మెంట్‌కు చెందిన మరో హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు లేదా పార్టీ ముఖ్యనేతలుగా ఉండేవారు మరో జాబితాను అధికారులకు ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల రాష్ట్ర స్థాయి ప్రముఖులతో తమకు ఉండే పరిచయాలతో కొందరు స్థానిక నేతలతో సంబంధం లేకుండా జిల్లా అధికారులకే నేరుగా తమ దరఖాస్తులను తెచ్చి ఇస్తున్నారు. తాము ఇచ్చిన జాబితాను మాత్రమే ఇన్‌చార్జీ మంత్రికి పంపాలని కొందరు వ్యవసాయ శాఖ అధికారులకు నిర్దిష్టంగా చెప్తుండటం లేదా తమ ప్రాంతానికి చెందిన మరోనేత తుది నిర్ణ యం మీది కాదు కదా మీరు ఇన్‌చార్జీ మంత్రికి మా జాబితా కూడా పంపించండి అంటూ వత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో జిల్లాలోని దక్షిణ ప్రాంతానికి సంబంధించి ఒక నియోజకవర్గ నేతల నుంచి అధికారుల కు బెదిరింపులు కూడా వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాల్లో చర్చ నడుస్తున్నది. తాము ఇచ్చే జాబితాను తప్ప మరొకరు ఇచ్చే పేర్లను తీసుకోరాదంటూనే తమ జాబితా ఇన్‌చార్జీమంత్రికి పంపక పోతే మిమ్మల్ని ఏసీబీకి పట్టిస్తామంటూ అక్కడి మాజీ ప్రజాప్రతినిధి హెచ్చరిక ఇచ్చినట్లు సమాచారం.

ఒంగోలు పరిసరాల్లో ఉండే మరో గ్రామీణ నియోజకవర్గంలో పార్టీ బాధ్యుడు జాబితాను సిద్ధం చేయగా ఆయనతో ఎడముఖం, పెడముఖంగా ఉండే మండల స్థాయి ప్రజాప్రతినిధి ఒకరు కొన్ని పేర్లతో జాబితా ఇచ్చి ఇన్‌చార్జి మంత్రికి పంపాలని వత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితి నాలుగైదు నియోజకవర్గాల్లో ఉండగా పశ్చిమ ప్రాంతంలోని కొన్ని చోట్ల రాయితీగా రూ. 2 లక్షలకు పైగా వస్తుంది కనుక తమకు కొంతఇవ్వాలని అలా ఇచ్చిన వారి పేర్లనే రికమండ్ చేస్తామని కొంత మంది నేతలు వాటాలు అడుగుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో రైతు రథాల లబ్ధిదారుల ఎంపిక ఎలా అన్నది అర్థం కాక వ్యవసాయ శాఖ అధికారులు తలపట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్ పరిస్థితులు, వ్యవసాయ శాఖ పథకాల అమలు తదితర అంశాలపై జిల్లా మంత్రి శిద్దా రాఘవరావును కలిసి బుధవారం జేడీఏ డాక్టర్ ఎం. మురళీకృష్ణ వివరించారు. ఆ సందర్భంగా కూడా వా రిద్దరి మధ్య రైతు రథాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సమస్యలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుతుండగా ఇంకా ఆలస్యం చేస్తే రబీ సీజన్‌కు కూడా రైతులకు ఈ పథకం కింద ఇచ్చే రైతు రథాలను ఉపయోగించుకొనే అవకాశం లేకుండా పోయే ప్రమాదం కనిపిస్తున్నది. ఇప్పటికైనా కీలక బాధ్యతల్లో ఉన్న నేతలు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏకాగ్రతతో చదువుకోవాలి

అద్దంకిటౌన్ : ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఇప్పుడే సమయం విలువ తెలుసుకుని ఏకాగ్రతతో చదివి భావిభారత పౌరులుగా ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జి సుజాత అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎన్ ఎస్‌పీ కాలనీ ఆవరణంలోని బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అ సోషియేషన్ అధ్యక్షుడు కరి రామకృష్ణ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఏకాగ్రతతో చదివితే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చాన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువు ఎంతో అవసరమని, ప్రభుత్వం కల్పించే వసతి గృహాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ శానం నాగేశ్వరరావు, న్యాయవాదులు పునాటి రామయ్య, కాకాని లక్ష్మి నాగేశ్వరమ్మ, సుబ్బారావు, మహమ్మద్ రఫీ, వై. రమేష్‌బాబు, గృహాలక్ష్మి, కుసుమలత, వార్డెన్ డి. పద్మావతి, ఎ యిడెడ్ పాఠశాల హెచ్‌ఎం మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



ఫ్లోరోసిస్ ప్రాజెక్ట్ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

నీటిలో ఫ్లోరిన్ పరిశీలన

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సర్వే కోసం సీఐఎంఆర్ బృందం

జిల్లాలో 16 మండలాల్లో నీటి శాంపిల్స్ సేకరణ పూర్తి

అద్దంకిటౌన్: తాగునీటి వసతి ఉన్న అన్ని ప్రాంతాలల్లో నీటి శాంపిల్స్ సేకరించి వాటిలో ఫ్లోరిన్ శాతం తెలుసుకుని తగు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నిర్వహించే సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అద్దంకి నగర పంచాయతీ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి వచ్చిన సీఐఎంఆర్ బృందం సభ్యులు, డీఎంహెచ్‌వో ఆఫీస్ సూపర్‌వైజర్ యు. వెంకటరమణతో నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావును కలిశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ. ప్రవీణ్ మాట్లాడుతు ప్రజలు తాగే నీటిలో ఫ్లోరిన్ శాతాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక బృందంచే నీటి శాంపిల్స్ సేకరించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ చేతి బోర్లు వాటర్ ప్లాంట్‌లు వద్ద కూడా నీటి శాంపిల్స్ తీసుకుని ముందుగా ఫ్లోరిన్ ఎంత శాతం ఉంది, ఫిల్టర్ అ యిన తరువాత ఎంత శాతం ఉందో తెలుసుకుని ఆ రెండు శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ప్రజలు వాటర్ ప్లాంట్‌ల నీరు తాగి కూడా రోగాల భారిన పడుతున్నరన్న సమాచారంతో అన్ని ప్లాంట్‌లలో నీటి శాంపిల్స్ సేవకరిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏఎల్ కండారే ఆధ్వర్యంలో పలు బృందాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటిని సేకరిస్తున్నామన్నారు. ఏపీతో పాటు మరో 6 రాష్ట్రాల్లో నీటి శాంపిల్స్ సేకరణ కార్యక్రమం జరుగుతుందని ప్రవీణ్ తెలిపారు. దీనిలో భాగంగానే జిల్లాలో ఇప్పటికి 16 మండలాల్లో నీటి శాంపిల్స్ సేకరిస్తున్నామన్నారు. మొత్తం ఏడుగురు రెండు బృందాలుగా ప్రస్తుతం అద్దంకి నగర పంచాయతీలో శాంపిల్స్ సేకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు హరి, రాజు నాయక్, దుర్గ ప్రసాద్, యాదయ్య, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



మద్దిరాలపాడు యానాదులకు ప్రత్యేక కాలనీ

● జేసీతో భేటీ అయిన ఎన్ఆర్ఐ 'నెప్పల'



జేసీ నాగలక్ష్మితో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ నెప్పల సుబ్బారాయుడు

నాగులుప్పలపాడు: మద్దిరాలపాడు గ్రామంలో యానాదులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రవాస భారతీయుడు నెప్పల సుబ్బారాయుడు, శారద దంపతులు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులో జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మితో వారు భేటీ అయ్యారు. గ్రామంలో నెప్పల ట్రస్టు ద్వారా 57 సెంట్ల భూమిని కొనుగోలు చేశామని, 20 కుటుంబాలకు చెందిన యానాదులకు ప్రభుత్వ సహకారంతో కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. శాఖాపరమైన అనుమతులు సకాలంలో అందించాలని కోరారు. అదేవిధంగా 2002-04 మధ్య 5.20 సర్వే నంబరులో తమ ట్రస్టు ద్వారా 124 మంది ఎస్సీలకు ప్రభుత్వ సహకారంతో కాలనీ ఏర్పాటు చేశామని, దీంతో పాటు చేకూరపాడు ఎత్తి పోతల పథకానికి నిధులు, పలురకాల సేవా కార్యక్రమాలు నెప్పల సుబ్బారాయుడు, శారద ట్రస్టు పేరున అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు జేసీకి వివరించారు. సమాజంలో అత్యంత ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వపరమైన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూపరమైన అంశాలపై సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు వెంకట్రావు, సర్దార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల వసూళ్లలో సీసీలపై ఆరోపణలు వస్తే చర్యలు

● ఏజీఎం హేమంత్‌కుమార్

సంతమాగులూరు: గ్రామాల్లో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను వసూలు చేసి వారితోనే బ్యాంకుల్లో కట్టించాలని, టార్గెట్‌లను పూర్తి చేసుకునేందుకు అడ్డదారులు తొక్కితే సహించేది లేదని జిల్లా స్త్రీనిధి ఏజీఎం హేమంత్ కుమార్ అన్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతి మినీలో వచ్చిన స్త్రీనిధి రుణాలు గోల్‌మాల్ అనే కథనానికి స్పందించిన జిల్లా స్త్రీనిధి అధికారులు బుధవారం సంతమాగులూరు మండల వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాల రికవరీలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాలను వారితోనే వీవోల ఖాతాలలో జమ చేయించాలన్నారు. ఇటీవల ఏల్చూరు క్లస్టరు సీసీ పర్చూరి ప్రమీల ఏల్చూరు గ్రామం వీవోలో జమ చేసిన రూ.1.20 లక్షలను వారి వీవో ఖాతా నుంచి ఆ సభ్యులకు తెలియకుండా కొమ్మాలపాడు వీవో ఖాతాకు మళ్లించటంపై ఆయన సీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా రుణాలు అందించేటప్పుడు సిబ్బంది గ్రూపుల నుంచి నగదు డిమాండ్ చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే పలువురు సీసీలపై ఆరోపణలు వస్తున్నాయని, వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.100 కోట్లు స్త్రీనిధి రుణాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే రూ.25 కోట్లు రుణాలు ఇవ్వటం జరిగిందని, త్వరలో మిగతా రుణాలు కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకునే ప్రతి పైసా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి అద్దంకి క్లస్టర్ అధికారి నాగబాబు, ఏపీఎం హనుమంతరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి

● ఎస్పీ సత్యఏసుబాబు

● పోలీసు అధికారులతో సమీక్ష

ఒంగోలు క్రైం : జిల్లాలో హత్యానేరాల కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ బి.సత్యఏసుబాబు ఆదేశించారు. బుధవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఐటీ సమావేశ మందిరంలో జిల్లా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గత నెలలో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు గురించి అడిగి తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు, జాతీయ మానవహక్కుల సంఘానికి సంబంధించిన కేసుల దర్యాప్తు సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. రహదారి భద్రతపై రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్బారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ టి.శివారెడ్డి, మార్కాపురం డీఎస్పీ లావణ్యలక్ష్మి, డీసీఆర్‌బీ డీఎస్పీ మరియదాసు, ఎస్బీడీఎస్పీ యు. నాగరాజు, పోలీసుశాఖ న్యాయసలహాదారు టి.పురుషోత్తమరావు, డీఎస్పీలు, సీఐలు, గిద్దలూరు సర్కిల్ ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సత్యఏసుబాబు

త్రిబుల్ రైడింగ్ చేస్తే డ్రైవింగ్ లైసెన్సు రద్దు

ద్విచక్రవాహనాలపై ముగ్గురు ప్రయాణం చేస్తే డ్రైవింగ్ చేసే వ్యక్తి లైసెన్సు రద్దు చేయడానికి వెనుకాడబోమని, ఒకవేళ డ్రైవింగ్ చేసే వ్యక్తికి లైసెన్సు లేకుంటే వాహన యజమాని లైసెన్సు రద్దు చేస్తామని ఎస్పీ సత్యఏసుబాబు హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసు, రవాణాశాఖ సంయుక్తంగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. జూన్ నెల కంటే జులై నెలలో రోడ్డు ప్రమాదాలలో మృతుల సంఖ్య తగ్గిందన్నారు. ద్విచక్రవాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. అందుకోసం వచ్చే నెల నుంచి హెల్మెట్ ధరించకపోయినా, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపితే సంబంధిత వాహన యజమాని డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని ఎస్పీ వెల్లడించారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నామని, ఎక్కువగా మద్యం తాగి వాహనం నడిపేవారికి జైలుశిక్ష కూడా విధించారని ఆయన వివరించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా కొత్తపట్న సముద్రతీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. అయితే మద్యం తాగి విచ్చలవిడిగా వాహనాలు నడిపి కొత్తపట్నం వెళ్లే వారిపై చర్యలు తీసుకునేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. ప్రధానంగా కొత్తపట్నం, ఈతముక్కల రహదారులపై పోలీసులు వినాయక నిమజ్జనం జరిగే రోజుల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

7,706 ఎల్‌హెచ్‌ఎంఎస్ రిజిస్ట్రేషన్లు

జిల్లాలో చీరాల, ఒంగోలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)లో 7706 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఎస్పీ సత్యఏసుబాబు తెలిపారు. ఒంగోలులో 4,797 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 36 రిక్వస్టులు వచ్చాయని, చీరాలలో 2,909 మంది రిజిస్ట్రేషన్ కాగా 22 వాచ్ రిక్వస్టులు వచ్చినట్లు వెల్లడించారు. మొత్తం 50 కెమెరాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, అందుకు చీరాల, ఒంగోలు ప్రాంతాలలో ఇంటికి తాళం వేసి వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సమాచారం ఇస్తే మీఇంటిలో సామాను భద్రతకు పోలీసుశాఖ సహకరిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్ : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ బాలుర విభాగం హ్యాండ్‌బాల్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఒంగోలు డీఆర్ఆర్ఎం హైస్కూలులో జరిగిన ఎంపిక ప్రక్రియలో వి. సాయిభరత్, ఎం. రామరాజు, ఎస్. రామస్వామి, కే. సుబ్బారావు, బి. కోటేశ్వరరావు, ఎన్.మురళీకృష్ణ, ఎం.కృపానిధి, బి.సాయిగోవర్ధన్, షేక్ కరిముల్లా, జి. ఆనంద్, ఆర్.ప్రసన్న, కె.కొండలరావు, కె.యల్లమంద, సీహెచ్.రాజ్‌కిరణ్, ఎ.హర్షవర్ధన్, పి. మనోజ్‌లను జట్టుకు ఎంపిక చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, నగర కార్యదర్శి జె.కోటేశ్వరరావు (కోటి), బార్ అసోసియేషన్ ఈసీ సభ్యులు పీఎం. నరసింహారావు, వి.ఆంజనేయులు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం

● వేధిస్తున్న స్థలాల సమస్య ● జిల్లాలో 80 శాతం గ్రామాల్లో లేని వైనం ● రోడ్ల పక్కనే వ్యర్థాలు



కె.రాజుపాలెంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

బల్లికురవ: గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మాణం ముందుకు సాగడం లేదు. స్వచ్ఛ గ్రామాల ఏర్పాటులో భాగంగా అన్ని గ్రామాల్లో వ్యర్థాల నిల్వలకి డంపింగ్ యార్డు నిర్మించాలని ప్రభుత్వం భావించిన వాటి నిర్మాణాలకి స్థల సమస్య పెనుభారంగా మారింది. ప్రభుత్వ భూములను గుర్తించి వాటిల్లో ఈ యార్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్న అధికారులు సరిగ్గా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంబడి వేస్తుండటంతో దుర్గంధంతో దుర్వాసన వెదజల్లుతుంది. అయితే కచ్చితంగా అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డులను నిర్మించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.జిల్లాలో 1056 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 80 శాతం పంచాయతీలలో డంపింగ్ యార్డులు ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. కొన్ని పంచాయతీలలో ఉపాధి నిధులలో నిర్మించినా అవి నిరుపయోగంగానే ఉన్నాయి. బల్లికురవ మండలంలో 21 పంచాయతీలు ఉండగా ఇంతవరకు 20 పంచాయతీల్లో డంపింగ్ యార్డులు నిర్మించిన దాఖలాలు లేవు. ఎక్కడా స్థలాలు కూడా గుర్తించలేదు. డంపింగ్ యార్డుల వల్ల పంచాయతీలకు ఎంతో ప్రయోజనం చేకూరేలా ప్రణాళికలు రూపొందించినా ప్రయోజనం శూన్యంగా ఉంది. గ్రామాలలో వ్యర్థాలను డంపింగ్ యార్డులకి తరలించే ప్లాస్టిక్‌ను వేరు చేసి చెత్తా చెదారాన్ని వర్మి కంపోస్టు ఎరువుగా తయారు చేసి వాటిని విక్రయించి వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకోవాల్సి ఉంది. ప్రభుత్వ స్థలాలు ఎన్నో ఉన్నా అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల వెంబటి వేస్తున్న వ్యర్థాలతో అంటువ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

అక్టోబర్ 2 లోగా పూర్తి చేయాలి

ప్రభుత్వం అక్టోబర్ 2 లోగా అన్ని పంచాయతీల్లో డంపింగ్ యార్డుల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 5 సెంట్ల నుంచి 75 సెంట్ల వరకు ప్రభుత్వ స్థలాలు సేకరించి ఉపాధి హామీ నిధులతో వాటిని పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

స్థలాలను గుర్తిస్తున్నాం



గతంలో అయిదు ఎకరాలలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉండటంతో స్థలాలు దొరకలేదు. తాజాగా ప్రభుత్వం 5 సెంట్లు నుంచి 75 సెంట్లు భూమిలో డంపింగ్ యార్డు నిర్మించవచ్చు అని ఉత్తర్వులు ఇచ్చింది. వెంటనే స్థలాలు సేకరించి నిర్మాణాలు చేయిస్తాం.

-వెకంటస్వామి, ఈవోఆర్డీ, బల్లికురవ

ఆంధ్రజ్యోతి 13

ఒంగోలు

ప్రకాశం ● గురువారం 31 ఆగస్టు 2017

3న వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలపై చర్చా వేదిక

ఒంగోలు వ్యవసాయం : ఎన్నో కష్ట నష్టాలకోర్చి రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం రైతు హక్కుల సాధన ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఏనుగుచెట్టు సమీపంలోని క్రిష్ణలీల అపార్ట్‌మెంట్‌లో సెప్టెంబరు నెల 3వ తేదీ చర్చా వేదిక జరుగుతుందని దేవబత్తిని రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేథావులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

లోకనాయక

వైభవంగా వినాయక నవరాత్రులు



గాంధీరోడ్డులో వినాయకుని వద్ద బాలినేని పూజలు



జీఎస్ అపార్ట్‌మెంట్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, డాక్టరు మాచిరాజు రామచంద్రరావు పూజలు



నెమలి ఈకలతో వినాయకుని చుట్టూ అలంకరణ



రాజాపానగల్ రోడ్డులో చిన్నారుల నృత్య ప్రదర్శన



విద్యుత్‌శాఖాధికారి పూజ

ఒంగోలు కల్చరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నగరంలో వివిధ మండపాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. గాంధీరోడ్‌లో గోల్డ్, సిల్వర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహం వద్ద మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శింగరాజు వెంకట్రావు, కఠారి శంకర్, కుప్పం ప్రసాదు పూజలు చేశారు. తాతా ప్రసాద్, వేమూరి సూర్యనారాయణ స్వాగతం పలికారు. జీఎస్ అపార్టుమెంట్‌లోని వినాయక విగ్ర హం వద్ద డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ చిత్రకారులు డాక్టర్ మాచిరాజు రామచంద్రరావు పాల్గొన్నారు. కర్నూల్‌రోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడు, ఆర్టీసీ కాలనీలో గణనాథులను అలంకరించారు. రాజాపానగల్ రోడ్డులో ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్యప్రదర్శన అలరించింది. సీతారాంపురం వరసిద్ది వినాయక స్వామి దేవస్థానం వద్ద జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్షుడు పప్పు శ్రీను, ధనిశెట్టి సుబ్బారావు, రాము, వాకాటి వెంకటేష్, నక్కా ప్రసాదు, సురేష్‌బాబు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బృందావన నగర్‌లో గోపూజ చేశారు.

కాలనీల్లో కమిషనరు పర్యటన

ఒంగోలు కార్పొరేషన్ : నగర శివారులోని బలరాం కాలనీ, మిలటరీ కాలనీల్లో కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ బుధవారం పర్యటించారు. ఈ మేరకు స్థానికులతో మాట్లాడి, అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పలు సమస్యలను కమిషనరు దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. డ్రైనేజి వ్యవస్థ కోసం మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంటనే కమిషనరు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో చెత్త వేయకూడదని కమిషనర్ సూచించారు. ఏఈ రామ్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి కమిషనరు వెంట ఉన్నారు. అనంతరం కమిషనరు కార్యాలయంలో తన ఛాంబర్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. నగర హోదాకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించిన కమిషనరు, స్మార్ట్ సిటీ ఏర్పాటుకు చేపడుతున్న చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎఫ్‌బాబు, పి. కిరణ్‌లు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవిత కాలమంతా ఉద్యోగుల చేత పని చేయించుకొని వారికి పెన్షన్ ఇవ్వకుండా చేయడం దుర్మార్గమని తెలిపారు.

డబుల్ లైన్‌రోడ్డుగా పొందూరు రోడ్డు

రూ. 5కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ

ఒంగోలు కర్నూల్‌రోడ్డు : ఒంగోలు-పొందూరు రోడ్డు ఇక మీద డబుల్ లైన్‌రోడ్డుగా మారనుంది. ఇప్పటికే ఏడు కోట్ల రూపాయలతో పొందూరు వెళ్లే రోడ్డులో భాగంగా జాతీయ రహదారి 16 నుంచి బగీరథ కెమికల్స్ వరకు డబుల్‌లైన్ రోడ్డుగా విస్తరించారు. ప్రస్తుతం మంజూరైన రూ.5కోట్ల నిధులతో భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ 4/0కి.మీ నుంచి కందులూరు 9/600 కి.మీ వరకు డబుల్ రోడ్డుగా నిర్మాణం కానుంది. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సింగిల్‌రోడ్డుతో అష్టకష్టాలు పడుతున్న వాహనదారులకు డబుల్ రోడ్డు నిర్మాణంతో సాఫీ ప్రయాణం సాగనుంది. రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తీవ్రంగా కృషి చేశారు.

పరిమళించిన పద్యసౌరభం

ఒంగోలు కల్చరల్ : తెలుగువారి తరతరాల సంపదైన పద్యం అందరినీ అలరించింది. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వీవీపీ రోడ్ వినాయక బాలభక్త సమాజం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పద్యాలతోరణం కార్యక్రమం జరిగింది. పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, సిహెచ్. లక్ష్మీనరసింహారావు, పింగళి శ్రీనివాసరావు, శనగపల్లి సుబ్బారావు, జంధ్యాల కామేశ్వరి, దాసరి బాలసుబ్రహ్మణ్యం, పింగళి పూర్ణచంద్రరావు, రామలక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు తమ పద్యాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో రావినూతల గోపాలరావు, రావూరి ఆంజనేయులు, సూదనగుంట వెంకట్రావులు పర్యవేక్షించారు.

పమిడి ఆధ్వర్యంలో పరిటాల రవి జయంతి వేడుకలు

ఒంగోలు కార్పొరేషన్ : మాజీ మంత్రి, దివంగత పరిటాల రవి 60వ జయంతి వేడుకలను తెలుగు యువత నాయకులు పమిడి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగమూరు రోడ్ బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. సురేష్ మాట్లాడుతూ పరిటాల రవి ఆశయాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కట్టా రవితేజ, జూపల్లి గంగాధర్ పలువురు పమిడి యూత్ పాల్గొన్నారు.



యువతకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

రాష్ట్రానికి సమాచార కమిషన్‌ను నియమించాలి

ఒంగోలు కలెక్టరేట్ : రాష్ట్ర విభజన జరిగి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సమాచార హక్కు చట్టం-2005 కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని, అందువల్ల వెంటనే కమిషన్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాలమహాసభ జిల్లా అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ కోరారు. స్థానిక మహాసభ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషన్ లేని కారణంగా సమస్యలను చెప్పుకొనేందుకు కూడా కష్టతరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల వంశీవివేక్‌రాజ్, రాయపూడి ఏసురత్నం, డోలా చక్రవర్తి, చప్పిడి వివేక్‌బాబు, మన్నం కృపారావు, ఎస్. నారాయణ, చేగొండి మహేంద్ర, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేత్రదాన వాగ్దాన కార్యక్రమం

ఒంగోలు కలెక్టరేట్ : జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్ అసోసియేషన్ సహకారంతో నేత్రదాన వాగ్దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 35 మంది నేత్రదానం చేస్తామని వాగ్దాన పత్రాలను రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బట్టు బాలాజీరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సీతారామయ్య, కార్యదర్శి దేసు కాసీ, శ్రీనివాసరావు, బట్టు లీలాకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు లోకాయుక్త కోర్టుకు హాజరుకానున్న కలెక్టర్

- ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ నాగలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ గురువారం హైదరాబాద్‌లో లోకాయుక్త కోర్టుకు హాజరుకానున్నారు. దీంతో ఆయన బుధవారం రాత్రి హైదరాబాద్ బయలు దేరి వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి కలెక్టర్‌గా నాగలక్ష్మీ గురువారం బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్ : మునిసిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు జి.వి. కొండారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు మునిసిపాలిటీ ఏర్పడి 130 ఏళ్లుదాటినా ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి అనే పేరుతో పట్టణ ప్రజలపై అదనపు భారం, మునిసిపల్ కార్మికులకు పనిభద్రత లేకుండా కొత్త కొత్త జీవోలు తెస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఎంప్లాయీస్ నాయకుడు డి. శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ ఇంజనీరింగ్ నాయకుడు పోకల కోటేశ్వరరావు, శ్రీరాం శ్రీను, కె. శ్రీనివాసరావు, యు. కుమారి, రాగి రాములు, పోకల కోటేశ్వరరావు, ఎన్. ప్రభుదాసు, కె. బాలకృష్ణ, దాసరి కృష్ణ, రంపతోట శ్రీను పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె. గోపీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఉదరగుడి రత్నకుమారి, వర్కింగ్ సెక్రటరీగా శ్రీరాం శ్రీను, కోశాధికారిగా నూకతోటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా డి. శ్రీనివాసరెడ్డి, రంపతోటి శ్రీనివాసరావు, జ్యోతి శ్రీనివాసరావు, మల్లవరపు లక్ష్మి, పి. కోటేశ్వరరావు, కె. రవిలను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా కె. బాలకృష్ణ, రాగి రాములు, బి. అక్కేశ్వరరావు, తేళ్ల విజయంతో పాటు 11 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉద్యోగోన్నతి పొందిన డీడీకి అభినందనలు

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లా ట్రెజరీ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆకుల లక్ష్మీకుమారిని ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు అభినందించారు. జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న లక్ష్మీకుమారిని అసోసియేషన్ నాయకులు బుధవారం ట్రెజరీ కార్యాలయంలో బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె. అహ్మద్, కుంచాల వెంకటేశ్వర్లు, కోశాధికారి పి.వి. నారాయణ, హసీనాబేగం, ఎలీషారాణి, సాయి, పి. కోటిసుధీరా, కమలాకర్, దేవరాజు పాల్గొన్నారు.



లక్ష్మీకుమారికి బొకే ఇచ్చి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా పనిచేయడం లేదని ఫిర్యాదు

బల్లికురవ: వైదన పంచాయతీ చవిటిమాదిగపల్లెలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా పనిచేయడం లేదని ఆ కాలనీవాసులు బుధవారం సీడీపీవో విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా నుంచి అంగన్‌వాడీ టీచర్ ప్రతిరోజు రావాల్సి ఉందని, ఇష్టారాజ్యంగా ఎప్పుడో వచ్చి పోతుండడంతో చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్ వారానికి ఒకసారి విధులకు హాజరవుతుందని వారు తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో కాలనీవాసులు నాగిపోగు కన్నయ్య, వెంకట రామాంజనేయులు, ఆదాం, బండి నాగేశ్వరరావు, కవిత తదితరులు ఉన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

● కొద్దికాలనికే దెబ్బతిటున్న రహదారులు

అద్దంకి రూరల్: అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం నుంచి చిన్నకొత్తపల్లి వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి దమ్ము ట్రాక్టర్ల దెబ్బకు పూర్తిగా ఛిద్రమై పోతోంది. వరి చేలలో దమ్ము చేసే ట్రాక్టర్ల వీల్స్‌లకు రబ్బరు తొడుగు లేకుండా రహదారిపై ప్రయాణించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ ట్రాక్టర్ల యజమానులు పాటించడంలేదు. అదేవిధంగా దమ్ము చేసే ఇనుప చక్రాలను పొలం వద్ద తగిలించాల్సి ఉండగా వాటిని నేరుగా ఇంటి వద్ద నుంచే తగిలించి తీసుకు వెళుతున్నారు. దీంతో రోడ్లపై సన్నటి గాడులు పడి ఆ తరువాత గుంతలుగా మారుతున్నాయి. ఆ రహదారిపై వెళ్లే ద్విచక్రవాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ఈ దారిలో ప్రయాణించాలంటే జారి పడతామేమోనని ఆయా వాహచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్‌లు రోడ్లపై ప్రయాణించకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





శింగరకొండపాలెంరోడ్డులో వెళుతున్న దమ్ము ట్రాక్టర్, రోడ్డుపై పడ్డ గాడులు (ఇన్‌సెట్లో)

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అద్దంకి: మొక్కలను నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ పరిమి దయామణి పేర్కొన్నారు. అద్దంకి పట్టణంలోని 19వ వార్డు పరిధిలో పాత దామావారిపాలెం ఊర చెరువు కట్ట వద్ద బుధవారం కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల రక్షణకు అవసరమైన వెదురు ట్రీ గార్డులను వెంకట రమణ మార్బుల్స్, స్వీట్ షాపు నిర్వాహకులు ఆలూరి శ్రీనివాసరావు సమకూర్చారు. ట్రీగార్డులు సమకూర్చిన శ్రీనివాసరావును ఛైర్‌పర్సన్ దయామణి, కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, నాగేశ్వరరావులు అభినందించారు.



ట్రీ గార్డులను అందజేస్తున్న శ్రీనివాసరావు

భారీ వర్షానికి కూలిన చెట్టు-రాకపోకలకు అంతరాయం

బల్లికురవ: బల్లికురవ-సంతమాగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ఈర్లగంగమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పెద్దచెట్టు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులలకు పడిపోయింది. దీంతో ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకి అంతరాయం ఏర్పడింది. రెండు దశాబ్దాల క్రితం నాటి భారీ వృక్షం ఈదురు గాలులకి ఒక్కసారిగా వేర్లతో లేచి కూలిపోయింది. ఈర్లగంగమ్మ దేవాలయం ముఖద్వారం వద్ద నీడని ఇచ్చే చెట్టు కూలిపోవడంతో ప్రయాణికులు పరిశీలించి చూశారు. బుధవారం మధ్యాహ్నం వరకు కూడా రాకపోకలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్టీసీ బస్సు చెన్నుపల్లి మీదగా తిరిగింది.



రోడ్డుపై కూలిన భారీ వృక్షం

సీఎం సహాయ నిధి నుంచి 14 మందికి ఎల్‌వోసీలు : ఎమ్మెల్యే

అద్దంకి: అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్సలు పొందేందుకు అవసరమైన వైద్య ఖర్చులు నిమిత్తం ముఖ్యమం త్రి సహాయ నిధి నుంచి 14 మందికి రూ.30.45 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే రవికుమార్ బుధవారం తెలిపారు. రావినూతలకు చెందిన తమ్మన చిందబరరావుకు రూ.2.80 లక్షలు, మామిళ్లపల్లికి చెందిన గరికపాటి లక్ష్మమ్మకు రూ.2.80లక్షలు, బొమ్మనంపాడుకు చెందిన వసంత వెంకటగౌరికి రూ.80వేలు, అద్దంకికి చెందిన పసుమర్తి రాజకుమార్‌కు రూ.80వేలు, విప్పర్లవారిపాలెంకు చెందిన బొనిగల అంకారావుకు రూ.1.50లక్షలు, వెల్లలచెరువుకు చెందిన కౌసారి నారపురెడ్డికి రూ.2.50లక్షలు, కుందుర్రుకు చెందిన మల్లాధి రత్తమ్మకు రూ.2.50 లక్షలు, అద్దంకి చెందిన నర్రా వెంకటేశ్వర్లుకు రూ.2.80 లక్షలు, నల్లూరి రమణయ్యకు రూ.2.80లక్షలు, సంతమాగులూరుకు చెందిన పోలూరి వెంకటపద్మకు రూ.55వేలు, అద్దంకి చెందిన ఘంటసాల వెంకట మహలక్ష్మికి రూ.2.50 లక్షలు, కుందుర్రుకు చెందిన యడలిపల్లి తిరుపతమ్మకు రూ.2.80లక్షలు, చెల్లకల్ల భ్రమరాంభకు రూ.2.80లక్షలు, సంతమాగులూరుకు చెందిన మోరమ్ ఆదెమ్మకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీలు మంజూరైనట్లు రవికుమార్ పేర్కొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

పంగులూరు: విద్యా, వైద్య రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ఎంపీడీవో ఎం.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. పంగులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబరు 21లో రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారు బుధవారం సాయంత్రం బాలబాలికలకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో పేద విద్యార్థులకు రక్షిత మంచినీరు, నోట్ పుస్తకాలు ఉచితంగా అందజేయడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు గడిమిడి జగన్మోహన్‌రావు, అసిస్టెంట్ గవర్నర్ చిలుకూరి వీరరాఘవయ్య, మాజీ అధ్యక్షులు పూనాటి రామాంజనేయులు, గు ర్రం ఆంజనేయులు, ఉపాధ్యాయులు సుబ్బారావు, మధు, బి.హనుమంతరావు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను అందిస్తున్న రోటరీ సభ్యులు

అగ్రిగోల్డ్ బాధితుల బస్సుయాత్రను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్: అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య బస్సు యాత్ర సెప్టెంబర్ 1 తేదీన అద్దంకి రానుందని, స్థానిక బంగ్లారోడ్డు సాయంత్రం జరిగే బహిరంగ సభను అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నియోజకవర్గ నాయకుడు ఎ.సుభాని కోరారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐకాలనీరోడ్డులోని సీపీఐ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీకేఎంయూ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకట్రావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శింగయ్య, రైతు నాయకులు గోల్లపూడి వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, బాలాజీ, ఫణింద్ర, మణికంఠ,పూర్ణచంద్రశేఖరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.సుభాని

మిలీనియం మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

పంగులూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు చేపట్టిన మిలీనియం మార్చ్ కార్యమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చెంచుబాబు, కె.శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలో ఏపీటీఎఫ్ కార్యవర్గం నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత పీఆర్సీలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనంత రాధాకృష్ణ, జి.లక్ష్మీప్రసాద్, ఆర్‌వీ.సుబ్బారావు, చేజెర్ల రామారావు, కట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రావినూతల విద్యార్థినికి ప్రథమస్థానం

మేదరమెట్ల: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా రచయితుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలను రావినూతల హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానం సాధించారు. ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో రావినూతల హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని చీరాల స్వాతి ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు సురేంద్రబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు స్వాతిని అభినందించారు.



స్వాతిని అభినందిస్తున్న హెచ్ఎం సురేంద్రబాబు తదితరులు

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ-నలుగురికి గాయాలు

సంతమాగులూరు: సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌ను లారీ ఢీకొంది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. గుంటూరు జిల్లా నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన పెరుగు వెంకటేష్, తన భార్యా పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంపై కనిగిరి వెళ్తుండగా పుట్టావారిపాలెం వద్ద లారీ ఢీకొట్టడంతో వెంకటేష్, భార్య నాగమణి, పిల్లలు విజయ్, వినయ్‌లకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నామ్ ఎక్స్‌ప్రెస్ వే ఆంబులెన్స్‌లో నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పంట మార్పిడి వల్ల ఎన్నో ఉపయోగాలు : ఏవో

మేదరమెట్ల: రైతులు ఒకే పంటను సాగు చేయకుండా పంటలను మార్చివేయడం వల్ల తెగుళ్లు రాకుండా చేసుకోవచ్చు అని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తమ్మవరంలో ఆయన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. మొక్క జొన్న పంటను ఒకే పొలంలో తరచుగా వేయడం వల్ల ఆకు ఎండు తెగులు వస్తుందన్నారు. ఈ తెగులును కలుగుచేసే శిలీంద్రం నేలలో ఉండటం వల్ల పైన ఎటువంటి రసాయన ఎరువులు పిచికారి చేసినా ప్రభావం ఉండదని ఆయన చెప్పారు. ఈ తెగులు మొక్కజొన్నపంటను ముందుగానే ఆశించినప్పటికి కండె ఏర్పడే వరకు గుర్తించలేమన్నారు. ఈ దశలో మొక్క కాండము కింద నుంచి పై వరకు ఎండిపోతుందని, తెగులు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు 80 శాతం పంట నష్టం సంభవిస్తుందన్నారు. ఎకరానికి రెండు కేజీల ట్రైకోధర్మవిరిడి అనే జీవ సంబంధ శిలింద్రం, 100 కేజీల పశువుల ఎరువుతో కలిపి పది రోజులు పాటు నీడలో నీళ్లు చిలకరిస్తూ కుళ్లబెట్టి తెల్లటి బూజు వచ్చిన తరువాత పొలంలో చల్లాలన్నారు. పంటపై ఈ తెగులు కనిపించిన వెంటనే ప్రాసికోనాజోలే ఒక మి.లీ లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పంటపై పిచికారి చేయాలన్నారు. రైతులు పంట మార్పిడి వల్ల ఈ తెగులు రాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీలేఖ, రైతులు రావిపాటి సుబ్బారావు, పాలెం శ్రీనివాసరావు, యద్దనపూడి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీల లెక్కింపు

శింగరకొండ(అద్దంకిరూరల్): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఈవో ఈమని చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. కొరిశపాడు గ్రూప్ టెంపుల్స్ ఈవో డి.సుబ్బారావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఈవో పేర్కొన్నారు.

సినిమాగైడ్

అద్దంకి

కళామందిర్ - జయ జానికీ నాయక
శ్రీరామ - అర్జున్‌రెడ్డి
వీఎన్‌ఎస్- వివేకం
మినీవిఎన్‌ఎస్ - నేనేరాజు-నేనేమంత్రి

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - లై

ఆంధ్రజ్యోతి
13
చీరాల
ప్రకాశం ● గురువారం 31 ఆగస్టు 2017
| చీరాల | వేటపాలెం |

బస్టాండ్‌కు దారేది?

- ఫ్లెక్సీలతో నిండిపోయిన మార్గం
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

చీరాలఅర్బన్: చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ముఖద్వారం మూసేసినట్లుగా ఆయా ఆర్టీసీ యూనియన్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఇతర ప్రాంతాల ప్రయాణికులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్‌మజ్దూర్ యూనియన్‌లు పరస్పరం పోటాపోటీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ముఖద్వారానికి అడ్డుగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు లోపలికి రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సిరావటంతో అసహనానికి గురవుతున్నారు. నేషనల్ మజ్దూర్‌యూనియన్‌కు చెందిన ఇరువురి పదవీ విరమణ సన్మానసభలు గురువారం ఉండటం, ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యాలయ భవన ప్రారంభంతో పాటు యూనియన్ రీజినల్ ఉపాధ్యక్షుని పదవీ విరమణ సన్మానసభ శుక్రవారం ఉండటంతో పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు ఆయా యూనియన్లు పోటీపడ్డాయి. బస్టాండ్‌కు ముఖద్వారానికి అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ఫ్లెక్సీలున్నాయి..బస్టాండ్ ఎక్కడ అంటూ ఇతర ప్రాంత ప్రయాణికులు పలువురిని అడగాల్సి వస్తోంది.



బస్టాండ్ ప్రధాన ముఖద్వారం వద్ద ఉన్న ఫ్లెక్సీలు

ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరుతడి పద్ధతిలో వరిసాగు మేలు : ఏవో

చీరాల: ఆరుతడి పద్ధతిలో వరిసాగు చేయటం మేలని, దీనివల్ల పని, ఖర్చు తగ్గుతాయని మండల వ్యవసాయాధికారి ఫాతిమా రైతులకు సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం చీరాల మండల పరిధిలోని ఐక్యనగర్, విజయ్‌నగర్ కాలనీలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆరుతడి పద్ధతితో సాగు చేస్తే అధిక దిగుబడి కూడ వస్తుందని తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి చంద్రశేఖర్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం : సీపీఐ

వేటపాలెం: ఐకమత్యంతో ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.అరుణ పేర్కొన్నారు. బుధవారం వేటపాలెం మండలం రెడ్డికాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేశ స్థలాల కోసం స్థానికులు చేస్తున్న పోరాటానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా కన్వీనర్ డి.రాజారెడ్డి, మండల కన్వీనర్ వి.రాజశేఖర్, సభ్యులు సాదు వెంకటేశ్వర్లు, హసన్ పాల్గొన్నారు.

వైట్‌మజిల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వేటపాలెం: ఆక్వా రైతులు వర్షాకాలంలో వనామీ సాగులో వచ్చే వైట్‌స్పాట్, వైట్‌మజిల్ తెల్లరెట్ట వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవంతి ఫీడ్స్ కంపెనీ డీజీఎం జీఎంపికే.శెట్టి సూచించారు. బుధవారం రామన్నపేట బచ్చులవారిపాలెం రోడ్డులోగల అవంతి సీడ్స్ కార్యాలయంలో ఆక్వా రైతుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీ రీజనల్ మేనేజర్ గోపాలకృష్ణ, ఏరియా మేనేజర్ నారాయణస్వామి, ఆనంద్, రవిశంకర్ పాల్గొన్నారు.

చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోండి

చీరాలరూరల్ : చంద్రన్న బీమా పథకంలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరి సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏరియాకో ఆర్డినేటర్ ఆచారి కోరారు. గురువారం చీరాల మండల పరిషత్ కార్యాలయం సమావేశపుహాలులో మండల సమాఖ్య సమావేశం జరిగింది. సహజమరణానికి గతంలో రూ.30వేలు మాత్రమే ఉండగా ఇప్పుడు రూ.2లక్షలకు పెంచినట్లు చెప్పారు. 18-50 ఏళ్లలోపు వారికి ఇది వర్తించగా ఐదో సంవత్సరం నుంచి 60 సంవత్సరాలలోపు వారికి పాత విధానం వర్తిస్తుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి బీమా రెన్యువల్, నూతన బీమాను అందేలా చూడాలని చెప్పారు. ఏపీఎం మోహన్, సీసీలు వెంకటస్వామి, రాము పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

చీరాల : చీరాలలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అల్ట్రాసోనిక్ రోబోటిక్స్ వర్క్‌షాప్‌ను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు ప్రారంభించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ వారి సహకారంతో రెండు రోజుల పాటు ఈ వర్క్‌షాప్ జరుగుతుందని ప్రిన్సిపాల్ పి.రవికుమార్ తెలిపారు. ఫ్యాకల్టీలు సుభమ్‌గుప్త, సుఖిత్‌శర్మలు భవిష్యత్‌లో రోబోటిక్స్ టెక్నాలజీ ఉపయోగాలను వివరించారు. ఈ వర్క్‌షాప్‌కు ఎంతో ప్రత్యేకత ఉందని విభాగాధిపతి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అక్రిడిటేషన్ డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో రోబోటిక్స్ టెక్నాలజీ అనివార్యమవుతుందని, కళాశాల విద్యార్థులు వర్క్‌షాప్‌లను సద్వినియోగం



అవగాహన కల్పిస్తున్న సుభమ్‌గుప్త

చేసుకోవాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఖరగ్‌పూర్ ఐఐటీలో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను విస్తృతం చేయాలి

చీరాలఅర్బన్ : ఆర్టీసీ స్వీయ పర్యవేక్షణలో చేపట్టిన కార్గో గూడ్స్ అండ్ కవర్స్ పార్శిల్ సర్వీసు సేవలను విస్తృతపరిచి సంస్థకు ఆదాయం వచ్చేలా కృషి చేయాలని ప్రకాశం రీజియన్ కార్గో ఇన్‌ఛార్జి, విజయవాడ హెడ్‌ఆఫీస్ ట్రాఫిక్ ఏటీఎం సి.రఘునాథసాయి కోరారు. చీరాల ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన సందర్శించి డిపో అధికారులతో కార్గో సర్వీస్‌పై సమీక్షించారు. ఏఎన్ఎల్ ఒప్పందం ముగిసిన తరువాత పార్శిల్‌సర్వీస్ నిర్వహణ బాధ్యత ఆర్టీసీ స్వయంగా చేపట్టినట్లు చెప్పారు. సంస్థ నష్టాలను అధిగమించి, లాభాల బాటలో నడిచేందుకు ఇదొక సదవకాశమని, సిబ్బంది అంకితభావంతో సహకరించాలన్నారు. ప్రస్తుతం కార్గో సర్వీస్ ద్వారా సమకూరుతున్న ఆదాయం, అవుతున్న వ్యయం తదితర అంశాలపై డిపో అధికారులు, సిబ్బందితో సమీక్షించి పలు సహాలు, సూచనలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల డిపో మేనేజర్ డి.శ్రీనివాసరెడ్డి, సహాయమేనేజర్ జె.శ్యామల, సీఆర్‌సీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞానయాత్రలు విద్యార్థులకు ఎంతో అవసరం

చీరాల : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విజ్ఞాన, విహారయాత్రలు ఎంతో అవసరమని సీఈసీ, ఆల్టస్ ఇంటర్నేషన్ స్కూలుల సంయుక్త కార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్ అన్నారు. ఆల్టస్ ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులను క్రమం తప్పకుండా యాత్రలకు పంపించటం జరుగుతుందన్నారు. బుధవారం వస్త్ర తయారీ, వినియోగానికి సంబంధించి స్కూలు విద్యార్థులు కొత్తపేటలోని కేఎస్ ఆర్ హ్యాండ్‌లూమ్ సందర్శన యాత్రను ఆయన ప్రారంభించారు. కెఎస్‌ఆర్ హ్యాండ్లూమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజరు రవి వస్త్ర తయారీకి సంబంధించి విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. తయారీ, మార్కెటింగ్ అంశాలపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ సుశీలా కురియాకోస్, డైరెక్టర్ ఎం.ఓ. కురియాకోస్, పర్యవేక్షణ ప్రతినిధి పండిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారిపై దాడికేసులో నిందితుడి అరెస్ట్

చీరాలటౌన్ : కూరగాయల వ్యాపారిపై దాడిచేసి నగదు లాక్కొని పరారీ అయిన కేసులో నిందితుడిని వన్‌టౌన్ సీఐ వి.సూర్యనారాయణ మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇటీవల చీరాల ఫైర్‌స్టేషన్ వద్ద తెల్లవారుజామున కూరగాయలమార్కెట్ వ్యాపారిపై ముగ్గురు యువకులు దాడిచేసి నోట్లో గుడ్డలు కుక్కి అతని వద్ద రూ.4,500లు లాక్కొని పారిపోయిన విషయం విదితమే. ఈ కేసులో ఇద్దరు నిందితులను ఈ పాటికే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కొత్తపాలెం గ్రామపంచాయతీ రామకృష్ణానగర్‌కు చెందిన మూడో నిందితుడు కావూరి వంశీనవీన్‌రెడ్డిని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

హోమియో వైద్యశిబిరానికి విశేష స్పందన

చీరాలఅర్బన్ : ప్రభుత్వహోమియో వైద్యశాల ఆధ్వర్యంలో సీసీఆర్‌హెచ్ సూచనల మేరకు చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయుష్ విభాగం వారు బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరాన్ని ఆర్టీసీ డీఎం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూవ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తగా ఉచితంగా అందజేస్తోన్న హోమియో మాత్రలను వైద్యుల సలహానుసరించి వాడాలన్నారు. శిబిరంలో చీరాల, స్వర్ణ ప్రభుత్వహోమియో వైద్యులు డాక్టర్ కె.శిరీష, డాక్టర్ ఏ.భువనేశ్వరిలతో పాటు చీరాల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ వై.భవానీలు తమ సిబ్బంది ఉచిత వైద్యసేవలు అందించారు. హోమియో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సహాయ మేనేజర్ శ్యామల పాల్గొన్నారు.


డెంగ్యూ నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యులు



చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	జయ జానకి నాయకా
సంగం	అర్జున్‌రెడ్డి
సాయిప్యాలెస్	వివేకం
శాంతి	నేనే రాజు-నేనే మంత్రి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ముండ్లమూరు : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చునని ఏవో జెడ్ శ్రీధర్ చెప్పారు. నాయుడుపాలెం, తమ్మలూరు గ్రామాల్లో బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు పత్తి, కంది, జొన్న పైర్లను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వాడడంతో పైర్లు దెబ్బతింటున్నాయన్నారు. ప్రకృతి ద్వారా లభించే ఆకులను కషాయం చేసి పైర్లకు వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందజేస్తోందన్నారు. విస్తరణాధికారి కిషోర్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిపుర సుందరి పురంలో వినాయక లడ్డూ వేలం

దర్శి : త్రిపుర సుందరిపురంలో వినాయక లడ్డూను బుధవారం వేలం వేశారు. టీడీపీ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయ డానికి ఏర్పాట్లు చేయగా, తొలుత లడ్డూను వేలం వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నప్పటికీ, టీడీపీ నాయకుడు గుర్రం బాలకృష్ణ రూ.40వేలకు దానిని చేజిక్కించుకున్నారు. గత 12 ఏళ్ల నుంచి గ్రామంలో టీడీపీ నేతలు వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

పరిటాల రవి జయంతి

దర్శి : దర్శి పట్టణంలో మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరిటాల రవి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్శి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గొర్రె సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి వెంకటేశ్వర్లు, టైలర్ల సంఘం నాయకుడు కత్తి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు-పరిటాలని పేర్కొన్నారు.పెత్తందారుల దురాగతాలను ఎదిరించి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునగా శ్రీనివాసరావు, జోసఫ్, శ్రీరామ్ తిరుపతయ్య, పరిటాల సురేష్, టైలర్ల సంఘం అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

2న వైసీపీ నవ రత్నాల సభ

దర్శి : దర్శిలోని పీజీఎన్ కాంప్లెక్స్‌లో సెప్టెంబర్ 2న వైసీపీ నవరత్నాల సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎంఎల్‌ఏ దర్శి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సభకు మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని బూత్ కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు,నాయకులు అధికసంఖ్యలో హాజర్ కావాలని కోరారు.

పొదుపుతోనే ప్రశాంతత

దర్శి : సంపాదించిన మొత్తంలో కొంతభాగాన్ని పొదుపు చేసుకుంటే ప్రశాంత జీవనాన్ని సాగించవచ్చునని ఎల్ఐసీ అద్దంకి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటస్వామి సలహా ఇచ్చారు.స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్ఐసీ నూతనంగా ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు పీవీఎస్ రమేష్‌బాబు, అమ్ము నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్ఐసీ అద్దంకి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటస్వామి

వర్షాలతో పైర్లకు జీవం

దర్శి : ఇటీవల కురిసిన వర్షాలకు దర్శి ప్రాంతంలో సాగు చేసిన పైర్లు పుంజుకున్నాయి. ఖరీ్ఫ్‌లో సాగుచేసిన సజ్జపైరు గింజకట్టే దశకు చేరుకుంది. మండలంలో సుమారు 2500 ఎకరాలోల రైతులు సజ్జపైరు సాగుచేశారు. కందిపైరు ఇప్పటికే ఏపుగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో సజ్జ, జొన్న పైర్లలో అంతర పంటగా కందిని సాగు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో 21వేల ఎకరాలలో కంది సాగు చేశారు. ఈ ఏడాది కూడా సాగర్‌జలాలు విడుదల చేయక పోవడంతో చాలామంది రైతులు మాగాణి భూముల్లో కంది, సజ్జ సాగుచేశారు.పైర్లు సాగుచేసిన తరువాత వర్షాలు లేకపోవడంతో పైర్లు వాడిపోయాయి. కొన్ని గ్రామాల్లో సాగుచేసిన పెసర పైరు ఎండిపోయింది.

మిగిలిన పైర్ల పరిస్థితి ఏమవుతున్న సందిగ్దంలో రైతులు చిక్కుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వరుణ దేవుడు కరుణించడంతో రైతులు కొంత వరకూ ఊరట చెందారు. పుష్కలంగా వర్షాలు కురవడంతో కంది, సజ్జ, జొన్న, పత్తి పైర్లు పుంజుకున్నాయి. కొద్దిరోజుల్లో సజ్జ పంట చేతికి అందుతుందని రైతులు ఆశిస్తున్నారు. మిగిలిన పంటలు కూడా ఆశాజనకంగా ఉంటాయన్న ఆశతో వారున్నారు.



ఏపుగా పెరిగిన సజ్జ పైరు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

దొనకొండ : గ్రామాల్లో రైతు మిత్రా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు వ్యవసాయ విస్తరణాధికారి పి శివసుకర్ సూచించారు. ఆరవల్లిపాడు, దొండపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ రైతు మిత్ర సంఘాలతో ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవచ్చునన్నారు. కౌలు రైతు కార్డులు లేనివారు సాగు ధృవీకరణ పత్రాన్ని పొందాలని సూచించారు.



మాట్లాడుతున్న విస్తరణాధికారి శివసుధాకర్

సొసైటీ పదవికి అంజిరెడ్డి రాజీనామా

తాళ్లూరు : డీసీసీబీ చైర్మన్ ఈదరమోహన్‌కు మద్దతుగా నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు పులి అంజిరెడ్డి బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని డీసీసీబీ కార్యాలయానికి ఫ్యాక్స్ ద్వారా పంపించారు. ఈదరకు అండగా ఉండేందుకు తాను తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు అంజిరెడ్డి తెలిపారు.

చేతి వృత్తులపై శిక్షణ

తాళ్లూరు : చేతి వృత్తుల ద్వారా సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని మహత్మాగాంధీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హ్యాండ్ క్రాఫ్ట్ ప్రత్యేక నిపుణులు కమల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఏబీసీ స్కూల్ విద్యార్థులకు చేతి వృత్తులపట్ల శిక్షణ ఇచ్చారు. ప్రతి విద్యార్థి చేతివృత్తిలో అనుభవం పొందితే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందన్నారు. పలు పేపర్లతో తయారు చేసిన వస్తువులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు టి శ్రీనివాసరెడ్డి, కాలే షాబాబు పాల్గొన్నారు.



వస్తువులను తయారు చేస్తున్న కమల్‌కుమార్

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



వీధుల్లో పర్యటిస్తున్న ప్రత్యేకాధికారి రవి

ముండ్లమూరు : ఈదరలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు దర్శి నియోజకవర్గం ప్రత్యేకాధికారి రవి చెప్పారు. బుధవారం ఆయన గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులను పనులను పరిశీలించారు. ప్రతివీధిని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ బి. చూడామణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, పంచాయతీ గద్దల చిన్న సుబ్బయ్య, ఉపసర్పంచ్ బండి నాగిరెడ్డి ఉన్నారు.

రేపు మిలినియం మార్చ్

కనిగిరి : విజయవాడలో శుక్రవారం జరిగే మిలీనియం మార్చ్‌లో పాల్గొనడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ఎన్. రామచంద్రారెడ్డి కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం మిలినియం మార్చ్ గోడపత్రికలు ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాధరరావు

రెండు గ్లాసుల విధానానికి స్వస్తి చెప్పండి

ముండ్లమూరు : రెండు గ్లాసుల విధానానికి స్వస్తి చెప్పి, అందరూ ఐక్యతతో వ్యవహరించాలని తహసీల్దార్ బి. గంగాధరరావు కోరారు. పసుపుగల్లు ఎస్సీకాలనీల్లో అంటరానితనం నిర్మూలనపై బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామసర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి అధ్యక్షతనజరిగిన సమావేశంలో తహసీల్దార్ గంగాధరరావు మాట్లాడుతూ అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఇండ్లా శ్రీనివాసరావు, వీఆర్వో హనుమంతరావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు వి పౌలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుసుమకుమారి పాల్గొన్నారు.

దొనకొండలో పందుల బెడద

దొనకొండ : దొనకొండలో పందులు విపరీతంగా స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఏ క్షణాన ఏ వ్యాధి ప్రబలుతుందోనన్న భయం పలువురిని వెంటాడుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వీధుల్లో మురుగు నీరు చేరుకోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.బురద గుంతలో పందులు దొర్లడంతో దొనకొండ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీనికి తోడుగా దోమల బెడద నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడద నివారించడంతోపాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



150 మందికి వైద్య పరీక్షలు

ముండ్లమూరు : ఈదర గ్రామంలో బుధవారం 150 మంది జ్వరపీడితులకు మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి. వెంకట్రావు వైద్యపరీక్షలు చేశారు. వారిలో 15 మందికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. మిగత వారికి కీళ్లనొప్పులు ఉన్నట్టు తెలిపారు. జ్వరపీడితులకు మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ జ్వరాలు తగ్గేవరకూ వైద్యశిబిరం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అబ్దుల్‌సత్తార్, సిబ్బంది సుభానీ, ఎఎన్ఎంలు ఉన్నారు.

పోలవరంలో ..

పోలవరంలో బుధవారం వైద్యశిబిరంఏర్పాటు చేసి 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 4గురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలను నివారించవచ్చునని ఇన్‌చార్జ్ వైద్యాధికారి నాగరాజు సలహా ఇచ్చారు. శిబిరంలో హెల్త్ హెడ్‌కేటర్ హుస్సేన్‌బీ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకట్రావు

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

కురిచేడు : కందిలో ఆకుచుట్టు ముడత తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాని మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నాదేవి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బయ్యవరం, పెద్దవరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కంది పైరును పరిశీలించారు. కందికి సోకిన తెగుళ్ల నివారణకు తీసుకోవల్సిన అంశాలపై రైతులుకు అవగాహన కల్పించారు. కలుపు నివారణా చర్యలు చేపట్టాలన్నారు. కందిపైరుకు అవసరమైతే ఒకటి లేదా 2 తడులు ఇస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీయం సుధాకరరావు, అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



కిశోర్‌బాబు,
ఉపాధి ఈసీ,
దొనకొండ

దశల వారీగా ఉపాధి వేతనాలు మంజూరు

ప్రశ్న : ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు మంజూరయ్యాయా ?

జవాబు : రూ.80 లక్షల పెండింగ్ వేతనాలు దశలవారీగా మంజూరవుతాయి.

ప్రశ్న : మండలంలో ప్రస్తుతం ఉపాధి పనులు జరుగుతున్నాయా ?

జవాబు : వర్షాల కారణంగా పనులు నిలిచిపోయాయి. కేవలం 120 మంది కూలీలతో మొక్కలు నాటే పనులు చేపడుతున్నాం.

ప్రశ్న : మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఏమైనా ఉందా ?

జవాబు : చందవరం, సంగాపురం, వద్దిపాడు, ఆరవల్లిపాడు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత నెలకొంది. సీనియర్ మేట్ల ద్వారా పనులు చేయిస్తున్నాం.

ప్రశ్న : మరుగుదొడ్ల నిర్మాణాలు ఏ మేరకు జరుగుతున్నాయి ?

జవాబు : ఉపాధి పథకం ద్వారా ఈ ఏడాది 350 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేశాం. 7 పంచాయతీల్లో 240 వివిధ దశల్లో ఉన్నాయి. స్వచ్ఛభారత్ కింద 17 పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాం.

ప్రశ్న : మరుగుదొడ్ల నిర్మాణాలకు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారా?

జవాబు : మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు సమృద్ధిగా ఉన్నాయి. లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు చేపడుతున్నాం.

- దొనకొండ

విషాదం

ముండ్లమూరు, కనిగిరిలో మృత్యు తాండవం
వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాశీవిశ్వనాథరెడ్డి

బుధవారం వారికి దుర్దినమైంది. లేచిన వేళ వారికి అశుభంగా మారింది. విధిరాతను తప్పించుకోలేక వారు విగత జీవులయ్యారు. ముండ్లమూరు, కనిగిరి ప్రాంతాల్లో బుధవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, బావిలో పడి మరొకరు, ఉరివేసుకొని ఓ యువతి ప్రాణాలు కోల్పోయారు. దీంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో చిక్కుకున్నాయి.

ముండ్లమూరు : పులిపాడు సమీపంలో తేజ రెస్టారెంట్ ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో పులిపాడుకు చెందిన గుంటక కాశీవిశ్వనాథరెడ్డి(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వేరే వాహనంపై ప్రయాణిస్తున్న పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని ఇమ్మానుయేలుకు తీవ్రగాయాలయ్యాయి.అతడు ప్రస్తుతం ఒంగోలు ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పులిపాడుకు చెందిన కాశీవిశ్వనాథరెడ్డి దర్శిలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమ యంలో ప్రమాదానికి గురయ్యా డు. తేజ గార్డెన్ రెస్టారెంట్ దగ్గర వాహనం తిప్పుతుండగా పసుపుగల్లు గ్రామానికి చెందిన వరగాని ఇమ్మానుయేలు, మరో ఇద్దరు యువకులు దర్శి నుంచి వస్తూ ఢీ కొట్టారు. దీంతో కాశీవిశ్వనాథరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా , ఇమ్మానుయేలును అక్కడే వదిలి మిగిలిన ఇద్దరు అక్కడ నుంచి పరార య్యారు. గాయపడిన వ్యక్తిని రెస్టారెంట్ సిబ్బంది దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. కాశీవిశ్వనాథరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన తల్లితండ్రులు నారాయణ రెడ్డి, పార్వతి రోదిస్తు న్నారు. చేతికందిన ఒక్కగానొక్క కొడుకు ఇలా మాయమవుతాడని ఊహించ లేదని వారు వాపోతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇంచార్జ్ ఎస్ఐ వి మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాశీవిశ్వనాథరెడ్డిని ఢీకొన్న యువకులు దర్శిలో మద్యంతాగి వాహనం నడిపారనే వదంతలు వినిపిస్తున్నాయి.

బావిలో పడి ఒకరు మృతి

ముండ్లమూరు : బావిలోపడి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటనలో వేములలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భూమా ఏడుకొండలరెడ్డి(40) అనే రైతు చిలకలేరు వాగు సమీపంలో ఉన్న తన పొలానికి నీరు కట్టేందుకు వెళాడు. ప్రమాదవశాత్తూ కాలుజారడంతో అక్కడున్న బావిలోపడి ఆయన మృతిచెదాడు. ఆయన మేనళ్లడు పరుగ తీసి గ్రామంలో ఉన్నవారికి విషయాన్ని చేరవేశారు. గ్రామంలో ఈత వచ్చిన కొందరు యువకులు బావిలో దిగి ఏడుకొండలురెడ్డి జాడకోసం వెతికారు. గంటవరకు అతడు కనిపించకపోవడంతో ఆయిల్ ఇంజన్ సాయంతో నీరు తోడించగా, ఏడుకొండలురెడ్డి మృతదేహం బయటపడింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇంటికి పెద్ద దిక్కు కావల్సిన ఏడుకొండలురెడ్డి బావి పాలు కావ్వడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు.ఆయన మేనళ్లుడు ఫిర్యాదు మేరకు ముండ్లమూరు ఏఎస్ఐ జాన్‌పీటర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువతి ఆత్మహత్య

కనిగిరి : ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన ఓ యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన కనిగిరి ఎన్‌జీవో కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్న 21 ఏళ్ల యువతి ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌తో ప్రేమ వ్యవహారాలు సాగించింది. పెళ్లికి అతడు నిరాకరించడంతో మనస్థాపానికి గురైంది. దీంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వైద్య చికిత్సల కోసం ఆమెను ఓ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. దీనిపై ఎస్ఐ ఉప్పు శ్రీనివాసులను వివరణ కోరగా, వివరాలు అందవలసి ఉందన్నారు.



గాయపడిన ఇమ్మానుయేలు



విలపిస్తున్న మృతుడి బంధువులు



బావిలోపడి మృతిచెందిన ఏడుకొండలరెడ్డి

వైసీపీ నేతలు, పోలీసుల వాగ్వాదం

ముండ్లమూరు : శంఖరాపురంలో వైసీపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బుధవారం వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ఈ సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. 5రోజులపాటు పూజలందుకున్న వినాయక విగ్రహాన్ని వైసీపీ నేతలు ఊరేగించారు. వీధుల్లో బాణాసంచా కాల్చుతుండగా, బందోబస్తు నిర్వహించిన ముండ్లమూరు పోలీసులు వారిని వారించారు. అయినప్పటికీ వైసీపీ నేతలు స్పందించ లేదు. చివరికి పోలీసులు బాణాసంచా స్వాధీనం చేసుకోవడం వివాదం చెలరేగింది. ఇది ఒక దశలో తారాస్థాయికి చేరింది. కాగా, మారెళ్ళ, పులిపాడు, ఈదర గ్రామాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి.

నేడు గుంటూరులో సంచార జాతుల విముక్తి దినోత్సవం

మార్కాపురం వన్‌టౌన్ : గుంటూరులోని అరండల్ పేటలో గురువారం సంచార జాతుల వి ముక్తి దినోత్సవం జరుగుతుందని దాసరి సంక్షేమ సంఘ జిల్లా కోశాదికారి తుపాకుల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1952 ఆ గస్టు 31న దాసరికులు టీటీ యాక్ట్ నుంచి వి ముక్తి పొందన సందర్భంగా ప్రతి ఏటా ఆ రోజున కేంద్ర ప్రభుత్వం సంచారజాతుల దినోత్సవం నిర్వహిస్తుందని వివరించారు.

వల్లపునేనిపల్లెలో మహిళపై దాడి

దొనకొండ : మహిళపై దాడి జరిగిన సంఘటన వల్లపునేనిపల్లె గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ కె.అజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలు వెంకటమ్మ ఇంటి ముందు ఉన్న విద్యుత్ వైర్లకు అదే గ్రామానికి చెందిన గోనా అచ్చయ్య కరెంట్ తీగలు వేస్తున్నాడు.తమ ఇంటిముందు కరెంట్ తీగలు వేయడం వల్ల జరిగే ప్రమాదానికి ఎవరు బాధ్యత వహిస్తారని వెంకటమ్మ ప్రశ్నించింది. దీంతో ఆగ్రహించిన అచ్చయ్య దాడి చేశాడు ఈ సంఘటనలో వెంకటమ్మ తలకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

30 నుంచి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

మార్కాపురం వన్‌టౌన్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సెప్టెంబర్ 30 సమ్మె నుంచి సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈ కి పలు కార్మిక సంఘాల నాయకులు బుధవారం స మ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిటూ డివిజన్ కార్యదర్శి గుమ్మా బాల నాగయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసి టీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.జగన్మోహనరెడ్డి, తోట నాగాంజనేయులు మాట్లాడుతూ ఆగస్టు 6న ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు సమావేశమై సమ్మె చేయాలని తీర్మానించినట్టు తెలిపారు.

దర్శి సినిమాలు

వెంకటేశ్వర	:	ఆనందో బ్రహ్మ
శ్రీనివాస	:	అర్జున్‌రెడ్డి
శివశంకర్	:	జయ జానికి నాయక
భాస్కర్	:	నేనే రాజు నేనే మంత్రి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

గుడ్లూరు : ప్రభుత్వ వైద్యశాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి వైద్యసిబ్బందిని ఆదేశించారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు మేకల మాల్యాద్రి ఈ సందర్భంగా ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

'అన్న అమృతహస్తం'పై నారాసక్తత

అంగన్‌వాడీ కేంద్రాలకు రాని గర్భిణులు, బాలింతలు

మౌలిక వసతులు లేకపోవడమే కారణం

కొరవడిన సూపర్‌వైజర్ల పర్యవేక్షణ

వలేటివారిపాలెం : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అన్న అమృతహస్తం పథకం ప్రవేశపెట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోంది. దీంతో గర్భిణులు, బాలింతలతో పాటూ పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారనేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతులు కొరత కారణంగా గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడం లేదు. రేషన్ బియ్యంతో కూడిన పౌష్టికాహారం ఇస్తున్నందు వల్లే రావడం లేదని కార్యకర్తలు చెబుతున్నారు.

మండలంలో 53 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 251 మంది గర్భిణులు, 217 మంది బాలింతలు ఉన్నారని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ఆ కేంద్రాలన్నింటిలో ఈ నెల 1 నుంచి అన్న అమృతహస్తం పథకం అమలవుతుంది.

గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంది. గతంలో బియ్యం, నూనె, కందిపప్పు గర్భిణులు, బాలింతల ఇళ్లకు ఇచ్చేవారు. అయితే వీటి విని యోగం సక్రమంగా లేకపోవడంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న పథకం అమలు సక్రమంగా లేకపోవడంపై ప్రభుత్వం స్పందించింది. దీంతో అన్న అమృతహస్తం పథకం అమల్లోకి తెచ్చి, విధిగా అంగన్‌వాడీ కేంద్రాల కు వచ్చి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రాల్లో కూర్చోవడానికి వసతులు లేకపోవడం తదితర కారణాలతో అధికశాతం మంది కేంద్రాలకు రావడం లేదు. గతంలో లాగానే పాలు, గుడ్లు తీసుకొని వెళుతున్నారు.

కష్టంగా ప్రీస్కూళ్ల నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాలకు 15 నుంచి 20 మంది వరకు పిల్లలు ఉంటున్నారు. హాజరుశాతం ఆధారంగా చిన్నారులకు మధ్యాహ్న భోజనం వండటానికి ఆయా సమయం సరిపోతుంది. ఇప్పుడు కొత్తగా గర్భిణులకు, బాలింతలకు మధ్యాహ్న భోజనం అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆయాలకు మరింత భారమైంది. పిల్లలతో పాటు పెద్దలకు కూడా వేపుళ్లు చేయడం, కోడిగుడ్లను ఉడికించడంతో సరిపోతుంది. సంగం అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్యాస్ స్టౌవ్‌లు లేక కట్టెల పొయ్యిలపై ఆధారపడుతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పథకం అమలుపై దృష్టి సారించాలి. బాలింతలు, గర్భిణులకు, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాల్సిన అవసరం ఉంది.





అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం తింటున్న చిన్నారులు,

గర్భిణులకు, బాలింతలకు సరఫరా చేసిన పాలప్యాకెట్లు

మిలీనియం మార్చ్‌కు హాజరుకండి

లింగసముద్రం : విజయవాడలో సెప్టెంబర్ 1న జరిగే మిలినియం మార్చ్‌కు మండలంలోని ఏపీసీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని మండల సీపీఎస్ కార్యదర్శి కోటయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు కందుకూరులో అంకమ్మగుడి వద్దకు రావాలన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

లింగసముద్రం : అంబేద్కర్‌నగర్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. లింగసముద్రం పంచాయతీలో అంబేద్కర్‌నగర్‌లో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పౌరహక్కులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, పి.సాగర్, నాగరాజు, గరిక మోహన్‌రావు తదితరులు కాలనీకి రెండున్నర సంవత్సరాల నుంచి రాళ్ళపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి నీరు రావడం లేదని, మూడు బోర్లు పని చేయడం లేదని, నాలుగు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేయలేదని సమావేశం దృష్టికి తెచ్చారు. కాలువల్లో పూడిక తీత తొలగించాలని, పాఠశాల వెనుక వీధిలో సిమెంటు రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతుందని, కాలనీకి వచ్చే ప్రధాన రహదారి వద్ద పశువులను కడుతున్నారని వివరించారు. ఆర్వోప్లాంటు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, కుక్కల బెడద లేకుండా చేయాలని కోరారు. సర్పంచ్ నాగేశ్వరరావు, జడ్పీటీసీ పి. ప్రభావతి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ మంచినీటి ట్యాంకుల ద్వారా ఫిల్టర్ నీరు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే పోతుల రామారావును కోరామని తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గాలంకి ఆదెమ్మ, రేషన్ షాపు డీలర్ గరిక వెంకటేశ్వర్లు, చొప్పర మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లింగసముద్రం : ఉపాధ్యాయులు పాఠశాలకు, గ్రామానికి ప్రతిష్ఠలు తీసుకువచ్చేలా పనిచేయాలని ఎంఈవో టీఎల్ కాంతారావు పేర్కొన్నారు. మండలంలోని గంగపాలెం గ్రామంలో బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం రామయ్య, ఉపాధ్యాయుడు సుధాకర్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా తల్లిదండ్రులు. విద్యార్థుల అభిమానాన్ని చూరగొనాలన్నారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశంలోనే పిల్లలు చక్కటి పౌరులుగా తయారై సమాజానికి, దేశానికి సేవచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేపూరి వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు అత్తంటి రంగయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో

ఉపాధికి కూలీకి సహకారం

లింగసముద్రం : మండలంలోని చినపవని గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మేకల నరసింహం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కావలి మాసేవ గ్రూప్ వారు బుధవారం అతినికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాసేవ గ్రూప్‌కు చెందిన సీహెచ్ రమేష్‌చంద్ర రూ. 3 వేలు ఎంపీటీసీ సభ్యుడు ఉమ్మనేని నరసింహారావు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కేసినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా ఇచ్చారు. రమేష్‌చంద్రను గ్రామస్థులు అభినందించారు.



నగదును అందజేస్తున్న దృశ్యం

హుందాతనం, మాటతీరుతోనే నాయకత్వం

• **టీడీపీ నాయకత్వ శిక్షణ డైరెక్టర్ రాజా మాష్టర్**



శిక్షణ పూర్తి చేసుకున్న నాయకులతో రాజామాష్టర్ తదితరులు

కందుకూరు : హుందాతనం, మాటతీరుతోనే నాయకత్వం అలవడతుందని, ప్రజా జీవితంలో ఉండే ప్రతి ఒక్కరూ ఎంతో హుందాగా వ్యవహరించాలని, ప్రతి మాటను జాగ్రత్తగా వాడాలని టీడాపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నాయకత్వ శిక్షణ శిబిరం డైరక్టర్ దాసరి రాజా మాష్టర్ పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు హుందాతనం వల్లనే నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిందన్నారు. కందుకూరులో జరిగిన టీడీపీ నాయకత్వం 114వ బ్యాచ్ ముగింపు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల గురించి విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వైసీపీ నాయకులు, జగన్ చేస్తున్న అభివృద్ధి నిరోధక చర్యలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ శిక్షణకు గుంటూరు జిల్లా బాపట్ల, పెదకూరపాడు, వినుకొండ, ప్రకాశం జిల్లా కొండపి, పర్చూరు, నెల్లూరు జిల్లా ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల నుంచి గ్రామ, మండల స్థాయి నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో శిక్షకులు పసుపులేటి పాపారావు, జె.చైతన్య, కృష్ణభరత్, కాకర్ల మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష రక్షణ అందరి బాధ్యత

• **సీనియర్ సివిల్ జడ్జి మహేంద్ర ఫణికుమార్**

కందుకూరు : తెలుగు భాష రక్షణ అందరి బాధ్యతని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.మహేంద్ర ఫణికుమార్ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కందుకూరులో కల్యాణభారతి సాహితీ సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి వీవీశేషయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ న్యాయమూర్తిగా తాను తీర్పులను తెలుగులోనే అందిస్తానన్నారు. ప్రాచీన సాహిత్యంపై ప్రజలు మక్కువను పెంచుకోవాలన్నారు. అలంకారం కోటంరాజు రచించిన భువనవిజయం సాహితీరూపకాన్ని ఆయన ఆవిష్కరించగా, ఎస్‌ఏటీకే ఆచార్య సమీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.అనూరాధ, విశ్రాంత హెచ్‌ఎం ఐ. మల్లిఖార్జునరావు, దివి లింగయ్యానాయుడు, ఎస్.ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కల్యాణ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టావధానం సాహితీ ప్రియులను అలరించింది. అవధానిగా రాజమహేంద్రవరానికి చెందిన కుమారి పుల్లాభట్ల నాగశాంతి స్వరూప వ్యవహరించారు. వీవీ శేషయ్య అధ్యక్షతన జరిగిన అవధానంలో ఎస్‌ఏటికె ఆచార్య సంచాలకత్వం నిర్వహించారు. పృచ్ఛకులుగా ఎం.నాగకుమార శర్మ, వీవీ నరసింహరాయశర్మ, డి.రామాచార్యులు, బి.పురుషోత్తం, వి. భాస్కరమూర్తి, పి.శశికుమార్, జి.వెంకటేశ్వరరావు, కుమారి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అవధానులు రసవత్తరంగా సమాధానాలు అందించి ప్రేక్షకుల మన్ననలందుకున్నారు. కార్యక్రమంలో కల్యాణ భారతి సంస్థ ప్రధాన కార్యదర్శి జీవీ మాల్యాద్రి, కోశాధికారి ఎ.విజయకుమార్, బీజేపీఎన్ రాజు, ఎ.శ్రీనివాసులు, జీవీ శేషగిరిరావు, టీవీవీ కృష్ణకుమార్ పాల్గొన్నారు.



భువనవిజయం రూపకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జడ్జి మహేంద్రఫణికుమార్ తదితరులు

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పొదిలి : కేంద్ర ప్రభుత్వం లా కమిషన్ సూచనల మేరకు అడ్వకేట్స్ అమెన్‌మెంట్ యాక్ట్ 2017 లో రూపకల్పన చేసి, అమలు చేస్తున్న చర్యలను నిలుపుదల చేయాలని కోరుతూ పొదిలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం తమ విధులు బహిష్కరించారు. ఈ సవరణ బిల్లు న్యాయవాది వృత్తి స్వయం ప్రతిపత్తి దెబ్బతిని న్యాయవాదులపై అజామయిషీ చేసేందుకు వీలుగా తయారు చేయబడిందన్నారు. బిల్లు నిలుపుదల చేయకుంటే భవిష్యత్‌లో తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

• సినిమాలు

కందుకూరు

రాజ్ - ఫిదా

యువరాజ్ - ఆనందోబ్రహ్మ

ప్రశాంతి - వీఐపీ-2

కోటేశ్వర - నేనే రాజు నేనే మంత్రి

రాఘవ స్క్రీన్-1 - వివేకం

రాఘవ స్క్రీన్-2 - అర్జున్‌రెడ్డి, జయ జానకి నాయక

ఆంధ్రజ్యోతి

కొండపి

12

ప్రకాశం • గురువారం 31 ఆగస్టు 2017

కొండపి । టంగుటూరు । జరుగుమల్లి । సింగరాయకొండ । పొన్నలూరు । మద్దిపూడి

కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా తాతా

మద్దిపూడి : మద్దిపూడి కల్లుగీత సహకార సంఘం అధ్యక్షునిగా తాతా వెంకట నరసింహం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కో-ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ వర్మ ఆధ్వర్యంలో సహకారం సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఉపాధ్యక్షునిగా తిరగబత్తిన వెంకటనరసింహం సభ్యులుగా కొమర రమణయ్య, తుళ్ళూరి బసవయ్య, శేషగాని తిరుపతయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తుళ్ళూరి నరసింహారావు పాల్గొన్నారు.

'బోరు'మంటున్న రైతులు

- భూగర్భ జలాల కోసం రకరకాలుగా వెదుకులాట
- వేసవిలో గ్రామాల్లో బోర్లు వేసినా పడని నీరు
- అందుబాటులో లేని భూగర్భ జల పరిశీలకులు



గుడిలో బోరు వేస్తున్న ఆలయ నిర్వాహకులు

కొండపి: ఇపుడు ఎక్కడ చూసినా కొండపి ప్రాంతంలో 'బోరు' మనే వారే. ఇళ్లల్లో నీటి కోసం జనం, సాగు నీటి కోసం రైతులు బోర్లు ఇబ్బడి ముబ్బడిగా వేస్తున్నారు. ఎక్కడ నీరు పడుతుందో, పడదో తెలియక సతమతమవుతున్నారు. వేల రూపాయలు ఖర్చు చేసినా నీరు పడుతుందో, లేదో తెలియక ప్రజలు సతమతమవుతున్నారు.

దాదాపు 200 అడుగులు వేసినా మూసీ తీర గ్రామాల్లో సైతం నీరు పడటం లేదని ఆయా గ్రామాల వారు వాపోతున్నారు. ఇటీవల వేసవిలో గ్రా మాల్లో నీటి ఎద్దడి ఏర్పడటంతో బోర్లు వేసి నీరందించాలని గ్రామ పంచాయతీలు సం కల్పించాయి. చినవెంకన్నపాలెంలో రెండు బోర్లు వేసినా నీరు పడలేదు. ముప్పవరం, నె న్నూరుపాడు, గుర్రప్పడియ గ్రామాల్లో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒకదశలో భూగర్భ జలవ నరుల శాఖ అధికారుల సాయంతో బోర్లు వేయించాలని యత్నించారు. అదీ ఆచరణలో సాధ్యం కాలేదు.

టెంకాయతో నీటి గుర్తింపు

గడచిన పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండపి ప్రాంతంలో పలు గ్రామాల్లో పొగనారుమడులు పెట్టారు. ఏరుల్లోకి, కుంటల్లోకి నీరు అరకొరగా చేరింది. అది కూడా సరిపోదని తెలిసి కొందరు రైతులు పొలాల్లో బోర్లు వేసేందుకు ఉద్యుక్తులవుతున్నారు. నీరు ఎక్కడ పడు తుందో తెలియక అంచనా వేసేందుకు రకరకాల యత్నాలు ప్రారంభించారు.

భూమిలో నీటిని కనుగొనేందుకు కొందరు ప్రత్యేకమైన అంచనాదారులను తీసు కువచ్చి నీటి కోసం పరిశీలన ప్రారంభించారు. ఆ పరిశీలకులు చేతిలో టెంకాయను ఉం చుకుని చేలో తిరుగుతారు. ఎక్కడ నీరుంటే అక్కడ టెంకాయ చేతిలో లేచి నిలబ డుతు న్నది. అదేవిధంగా నీటిని కనుగొనేందుకు మరో విధానం అవలంబిస్తున్నారు. రెండు రాగి తీగెలను రెండు చేతుల్లో ఉంచుకుని పరిశీలకుడు తిరుగుతారు. భూమిలో నీరున్న చోట రెండు రాగి తీగలు కలుసుకుంటాయి. అక్కడ నీరున్నట్లు భావిస్తున్నారు. అశాస్త్రీయమైన ఈవిధానాలతోపాటు భూగర్భ జల పరిశీలకులను తెచ్చి బోర్ల వేయిస్తున్నారు. మొత్తంగా ఏ విధానంలో నైనా బోరు వేసినా నీరు పడటం లేదు. దీంతో బోర్లు వేయిస్తున్న వారు వేల రూపాయలు బోర్లుకు చెల్లించి అవస్థలు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భూగర్భ జలాలు మండలంలో తగ్గిపోయాయని రైతులు వాపోతున్నారు. నీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.

గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

జరుగుమల్లి : గర్భిణులు ఆరోగ్య సమస్యలు ముందుగా గుర్తించి వైద్య సేవలు పొందినపుడే మాతా, శిశు మరణాలను అరికట్టగలమని కామేపల్లి ప్రాథమిక వైద్యాధికారి రహీమున్నీసా సూచించారు. పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో ఏఎన్ఎంలకు మాతాశిశు మరణాలు, తల్లీ బిడ్డ సంరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.కార్యక్రమంలో హెల్త్‌నర్స్ బి. విజయలక్ష్మీ, ఆరోగ్య విస్తరణాధికారి అక్బర్ బాషా, ఎస్.హైమావతి, జి.నాగేశ్వరరావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

13 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

కారుమంచి (టంగుటూరు) : కారుమంచిలో 13 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ఆరుగురు రైతులను ఎంపిక చేసినట్లు వెలుగు ఏపీఎం తూమాటి రాజారావు బుధవారం తెలిపారు. 5ఎకరాలలోపు సొంత భూములున్న సన్న,చిన్నకారు రైతులకు ఈపథకంలో అవకాశం కల్పించాం అన్నారు. ఎకరాకు 76 మామిడి మొక్కలు నాటు తారు. మండలానికి టార్గెట్ 100 ఎకరాలున్నా తొలి విడతలో కేవలం 13 ఎకరాలనే కేటాయించామని, అర్హులైన రైతులు ముందుకొస్తే ఇంకా అవకాశం కల్పిస్తామని ఏపీఎం చెప్పారు. ప్రస్తుతం 13 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు వీలుగా కారుమంచి పంచాయతీ తీర్మానం తీసుకున్నాం అన్నారు.ఈపథకం ద్వారా మొక్కలు నాటిన రైతులకు రెండవ ఏడాదిలో దెబ్బతిన్న మొక్కల స్థానంలో 20 శాతం మొక్కలు కల్పిస్తామని,మూడేళ్ల పాటు ఈతోటలకు వెలుగు వారి సంరక్షణ ఉంటుందన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన కుంటలు తీసేందుకు కూలి చెల్లిస్తామని, మొక్కలను రైతులు తమకు ఇష్టమైన చోట తెచ్చుకున్నా ఇందుకు అవసరమైన నిధులు తామే చెల్లిస్తామన్నారు. ప్రతి ఎకరా మొక్కల పెంపకానికి రూ.2లక్షలు వ్యయం చేస్తామని, ప్రస్తుతం ఎంపిక చేసిన 13 ఎకరాల్లో మామిడి మొక్కల పెంపకానికి సంబంధించి ఆరుగురు రైతులకు 14లక్షల, 18వేల, 919 వ్యయం చేయనున్నట్లు రాజారావు వివరించారు.

ఈఅవకాశాన్ని వినియోగించుకున్నేందుకు అర్హులైన రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పొన్నలూరు: చెరుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన ఎస్కె ఖాదర్, బండి ధనమ్మకు బుధవారం పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం వారికి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకాలకు వనరుల గుర్తింపు

కొండపి: కొండపి మండలంలో కొత్తగా నిర్మించనున్న రెండు రక్షిత నీటి పథకాలకు పాలేరు, మాకేరులలో బావుల నిర్మాణాలకు నీటి వనరులు గుర్తించామని భూగర్భ జల వనరుల శాఖ డీడీ ఎం. నాగమల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఒంగోలు ఈఈ మర్ధన్ అలీ తెలిపారు. ఈ సం దర్భంగా బుధవారం కొండపిలోని మండల పరిషత్ అతిథి గృహంలో మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు నిధులు రూ.50 లక్షల రూపాయలతో ఇలవర (నేతివారిపాలెం) గ్రా మానికి పాలేరు నుంచి నీటిని అందిం చేందుకు పథకం మంజూరైందన్నారు.

సింగరాయకొండ మండలం శానంపూడికి ఎన్ ఆర్‌డీడబ్ల్యూపీ నిధులు 17 లక్షలతో తాగు నీటి పథకం మంజూరైందన్నారు. రెండు పథ కాలకు మంచినీటి పథకం బావులు, పైపు లైన్లు వేసి ఆయా గ్రామాలకు తాగు నీరందిస్తామని వారు తెలిపారు.



మాట్లాడుతున్న డీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

రామతీర్థం తాగునీటి పథకం ఏడాదిలో పూర్తి

రామతీర్థం నుంచి దాదాపు 40 కోట్ల రూపాయలతో నిర్మించనున్న తాగునీటి పథకం టెండర్ల ప్రక్రియ పూర్తయిందని ఆర్‌డ బ్ల్యూఎస్ ఈఈ మర్ధన్ అలీ తెలిపారు.

కొండపి, టంగుటూరు, జరు గుమల్లి, సింగరాయకొండ మం డలాల్లోని అత్యధిక గ్రామాలకు ఈ పథకం ద్వారా తాగునీ రందుతుందన్నారు. ఒక ఏడాదిలోగా పూర్తిచేసి తాగునీరందిస్తామన్నారు.

పథకంలో ఎలాంటి మార్పు లేకుండా టెండర్లు ప్రభుత్వం పిలిచిందన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కిషోర్, జియాలజిస్టు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆలకూరపాడు హైస్కూల్లో గణిత క్లబ్ ఆవిష్కరణ

ఆలకూరపాడు(టంగుటూరు) : విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పట్ల ఆసక్తి కలిగించి వారికి తగిన నైపుణ్యం నేర్పేందుకు మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం గణిత క్లబ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా హెచ్ఎం కె.మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ గణిత ఉపాధ్యాయుడు పి.సత్య సుధాకర్ మాట్లాడుతూ ఈక్లబ్ ద్వారా విద్యార్థుల్లో గణితం పట్ల తగిన అవగహన ఏర్పడుతుం దన్నారు. గణితంలో వేగం, కచ్చితత్వం, విశ్లేషణ సామర్థ్యం, నైపుణ్యం ఏర్పడి గణితం పట్లపూర్తి అవగాహన ఏర్పడుతుందన వివరించారు. దీని ద్వారా విద్యార్థి సమర్థవంతంగా ముందుకు సాగగల దన్నారు. క్లబ్‌లోని సభ్యులు గణిత శాస్త్రవేత్తల జీవిత విశేషాలు సేకరించడం, లెక్కల్లో షార్ట్‌కట్స్ నేర్చుకోవడం, మ్యాథమెటిక్స్ చేయడం, అగ్గి పుల్లలతో ఆటలు తెలుసుకొని తోటి విద్యార్థుల ముందు ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

ఈవిధానం వలన విద్యార్థులరే గణితం పట్ల ఆసక్తి, అనురక్తి గణనీయంగా పెంచవచ్చని సత్యసుధాకర్ వివరించారు. ఈక్లబ్ ద్వారా ఇక నుంచి గణిత క్విజ్‌లు, ప్రాజెక్టుల రూపకల్పన విద్యార్థుల ద్వారా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూషణరెడ్డి, శ్రీరామమూర్తి, రహీంతుల్లా, జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణిత ఉపాధ్యాయుడు సత్యసుధాకర్

కొనసాగుతున్న గ్రామైక్య సంఘాల ఆడిటింగ్



ఆడిటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: వెలుగు ఆధ్వర్యాన కొనసాగుతున్న డ్వాక్రా గ్రూపుల గ్రామైక్య సంఘాల ఆడిటింగ్ కొనసాగుతుంది. బుధవారం 15 సంఘాలకు ఆడిటింగ్ చేపట్టారు. గ్రామైక్య సంఘాల ఆడిటింగ్ ప్రతి ఏటా కొనసాగుతుంది. అలాగే ఈ ఏడాది ఆడిటింగ్ ఈవా రంలో ప్రారంభం అయింది. మండలంలో మొత్తం 72 సంఘాలున్నాయి. బుధవారం నాటికి 40 సంఘాల అడిటింగ్ పూర్తి చేశారు. ఆడిట్ సిబ్బంది గ్రామైక్య సంఘాల లావాదేవీలు, బ్యాంక్ స్టేట్‌మెంట్, పాస్‌బుక్, జమలు, చెల్లింపులు, నగదు నిల్వాలు, రశీదులు, తీర్మానాలు తదితర అంశాలన్నింటినీ ఆడిటింగ్ చేస్తున్నారు. ప్రతి ఏటా సంఘాల ఆడిటింగ్ పూర్తి చేసి రిటర్న్ పంపించాల్సి ఉంది. జిల్లా కోపరేటివ్ కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఆడిటింగ్ జరుగు తుంది. వెలుగు సిబ్బంది, గ్రామైక్య సం ఘాల ప్రతినిధులు ఆడిటింగ్‌కు కావలసిన సహకారం అడిటింగ్ సిబ్బందికి అందిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
13
కొండపి
ప్రకాశం ● గురువారం 31 ఆగస్టు 2017
కొండపి । టంగుటూరు । జరుగుమల్లి । సింగరాయకొండ । పొన్నలూరు । మర్రిపూడి

పాఠశాలకు గ్యాస్ సిలిండర్ పంపిణీ

పొన్నలూరు: ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన సిలిండర్ ద్వారా స్టౌవ్‌పై బుధవారం మధ్యాహ్నం భోజనం వంటను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ సిలిండర్ ద్వారా వంట చేయడం వలన కుకింగ్ ఏజెన్సీలకు సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.తత

కష్టపడి చదివితేనే ఉన్నతస్థానాలు


పుస్తకాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్

సింగరాయకొండ రూరల్: కృషి, పట్టుదలతో కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉండవచ్చునని కందుకూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గాయత్రి కళాశాల కరస్పాండెంట్ సీహెచ్. రామకృష్ణరావు, ఏవీ రావు సహకారంతో రూ.20వేల విలువ గల 400ల నోటు పుస్తకాలను 80 మంది విద్యార్థులకతు కందుకూరు రోటరీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్‌చౌదరి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని వారు కోరారు. ఊళ్లపాలెం గ్రామంలో ఈ ప్రభుత్వ బడికి వచ్చి పుస్తకాలను పంపిణీ చేయడం నాకెంతో ఆనందంగా ఉందని విద్యతో పాటు ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు.

తీరప్రాంత విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా ముందుంటారని ఆయన అన్నారు. పేద విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు మేము ఈ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కష్టపడి చదివితే విజయం, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.శివన్నారాయణ, ఉపాధ్యాయులు ఏవి రావు, ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు విప్పగుంట మల్లికార్జునరావు, రోటరీ క్లబ్ సెక్రెటరీ సురేష్, కోశాధికారి చక్కా వెంకటకేశవరావు, పి ఆంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెన్నూరుపాడులో సీసీ రోడ్లు

నెన్నూరుపాడు (కొండపి): నెన్నూరుపాడు గ్రామం సిమెంటు రోడ్ల నిర్మాణంతో కొత్త సొబగులు దిద్దుకుంటోంది. గ్రామంలోని పలు వీధులు సీసీ రోడ్లుగా మార్చేందుకు దాదాపు 50 లక్షలు రూపాయలు మంజూరయ్యాయి. దీంతో గ్రామంలోని ప్రధానమైన అంతర్గత రోడ్డు మిల్లు బజారు దాదాపు 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్డుగా మార్చారు. దాదాపు 450 మీటర్లు పొడవైన ఈ బజారు కూడలి నుంచి కొత్తూరు వరకు వేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనితోపాటు ఎస్సీ కాలనీ, బీసీ, ఓసీ కాలనీల్లోని బజార్లు మరో 400 మీటర్లు సీసీ రోడ్డుగా మార్చే కార్యక్రమం ఊపందుకుంది. ఎస్‌డీఎఫ్, పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మ్యాచింగ్‌తో ఈ రోడ్డు వేస్తున్నారు.

ఈ విషయమై పంచాయతీ రాజ్ అధికారులు మాట్లాడుతూ ప్రతినెలా మూడు కిలోమీటర్లు చంద్రన్న బాట కార్యక్రమంలో భాగంగా వేయాల్సి ఉంటుందని వివరించారు. అందులో భాగంగా నెన్నూరుపాడు గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణం జరుగుతున్నదని వివరించారు. చిన్న గ్రామంలో కూడా సీసీ రోడ్లు నిర్మాణం జరగడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నెన్నూరుపాడులో వేసిన సీసీరోడ్డు

ఎమ్మెల్యే కృషి చాలా ఉంది



చిన్న గ్రామమైన నెన్నూరుపాడులో దాదాపు కిలోమీటర్ మేర సీసీ రోడ్డు నిర్మించడానికి ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి కృషి చాలా ఉంది. ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మించుకోవాలని సూచించారు. నిధులు మంజూరులో కూడా సాయ మందించారు. సీసీ రోడ్లు నిర్మాణంతో గ్రామంలో రూపు రేఖలు మారనున్నాయి. ప్రధానంగా ఎస్సీ, బీసీ కాలనీల్లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు నిర్మాణంతో వారి ఇబ్బందులు తొలుగుతాయి. పనులు ప్రారంభించాం. వర్షాల కారణంగా కొంత జాప్యం జరుగుతున్నది. మరో రెండు, మూడు నెలల్లో సీసీ రోడ్లు పూర్తిచేస్తాం.

- తిప్పారెడ్డి క్రిష్ణారెడ్డి
నెన్నూరుపాడు, టీడీపీ నాయకుడు

జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలు

భూగర్భ జలవనరుల శాఖ డీడీ నాగమల్లేశ్వరరావు

కొండపి: జిల్లాలో మే నెల తర్వాత మూడు నెలల్లో కురిసిన వర్షాల కారణంగా భూగర్భ జలవనరులు పెరిగాయని భూగర్భ జలవనరుల శాఖ డీడీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం కొండపిలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సగటున 17,62 మీటర్లు లోతులో భూగర్భ జలాలున్నాయన్నారు. కొండపి మండలంలో 14.6 మీటర్ల లోతులో భూగర్భ జలవనరులున్నాయని ఆయన వివరించారు. మూడునెలల్లో కురిసిన వర్షాలకు, నీరు- చెట్టు లాంటి భూగర్భ జలవనరుల పెంపునకు చేపట్టిన కార్యక్రమాల వల్ల జిల్లాలో సరాసరి 5 మీటర్లుకు పైగా భూగర్భ జలాలు పెరిగాయని ఆయన వివరించారు. జిల్లాలో అత్యధిక లోతులో మార్కాపురం మండలం నికరంపల్లిలో 63.8 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా, అతి తక్కువ లోతులో కారంచేడులో 1.58 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయని ఆయన వివరించారు.

నీటి వనరుల అన్వేషణకు అశాస్త్రీయ పద్ధతులొద్దు

భూగర్భ జల అన్వేషణకు అశాస్త్రీయ పద్ధతులను ఎవరూ అవలంబించొద్దని డీడీ నాగమల్లేశ్వరరావు అన్నారు. టెంకాయ పట్టుకుని, రాగితీగలు పట్టుకుని నీటిని కనుగొనడం అశాస్త్రీయ పద్ధతులన్నారు. అదే విధంగా శాస్త్రీయ పద్ధతిలో కూడా రిజిస్టర్డ్ జియాలజిస్టులను సంప్రదించడం మంచిదన్నారు.

బోర్లు వేసేవారు ఆథరైజుకడ జియాలజిస్టులు సహకారంతో, ప్రభుత్వ అనుమతితో బోర్లు వేసుకోవాలని సూచించారు. రిజిస్టర్డ్ జియాలజిస్టులు జిల్లాలో అయిదుగురు మాత్రమే ఉన్నారన్నారు. తమ శాఖలో ముగ్గురు జియాలజిస్టులు పనిచేస్తున్నారని వివరించారు. డిడబ్ల్యుఎంఏలో అయిదుగురు ప్రభుత్వ జియాలజిస్టులు పనిచేస్తున్నారని వివరించారు.

సమస్యలు పరిష్కరించండి

అధికారులకు ఆదిఆంధ్రవాసుల వినతి


ఎస్సీ వీధిలో పర్యటిస్తున్న తహసీల్దార్ శ్రీశిల్ప

కొండపి: తమ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. మురుగు నీరు ఇళ్ల ముందు నిలిచి దుర్వాసన వస్తున్నది. తాగునీరు రావడం లేదని కొండపిలోని ఆదిఆంధ్ర వాసులు (మాదిగ పల్లె) అధికారుల ముందు వాపోయారు. ప్రతి నెలా 30 వ తేదీన అధికారులు నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా బుధవారంనాడు తహసీల్దార్ శ్రీశిల్ప, ఈవోఆర్డీ ఎం. విజయలక్ష్మి, ఏఎస్ఐ బాషా ఆదిఆంధ్రవాడలో పర్యటించారు.

ఈ సందర్భంగా స్థానికులు అధికారులతో మాట్లాడుతూ గడచిన ఏడాది జ్వరాల కారణంగా తమ కాలనీలో ఇద్దరు చిన్నారులు మరణించారని, ప్రస్తుతం ఇళ్ల ముందు కాల్వల్లో మురుగు నిలిచి దుర్వాసన వస్తున్నదని వాపోయారు. వీధి దీపాలు వెలగడం లేదని వాపోయారు. తాగునీరు కాలనీకి రావడం లేదని సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారు. అధికారుల వెంట ఎమ్మార్వై ప్రసన్నేశ్వరి, వీఆర్వో మల్లికార్జున పాల్గొన్నారు.

పౌరహక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్

పొన్నలూరు: పౌరహక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ మహ్మద్‌హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని బాప్టిస్టు నగర్‌లో బుధవారం పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో అన్నీ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, స్థానికంగా ఉండే సమస్యలను కూడా పరిష్కరించడం కూడా జరుగుతుందన్నారు. అనంతరం బాప్టిస్టు నగర్ ప్రజలు తమ కాలనీలో మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి పడిపోయేవిధంగా ఉన్నాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని వారు కోరారు. తమ కాలనీకి నీటి సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పరిధిలోని ప్రతి అంశాన్ని తక్షణమే పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఎస్ఐ సురేష్, ఏఈ సాంబశివరావు, ఇన్‌చార్జ్ ఇఓఆర్‌డి అశోక్, ఎంఈఓ రవిచంద్రబాబు, వీఆర్‌ఓలు పవన్, కోటయ్య, కార్యదర్శి రవి, సర్పంచ్ పల్లపోతు ప్రసాదు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సర్కారు బడులకు ప్రహరీలు కరువు

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని ప్రహరీలు లేని ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువైంది. లక్షలాది రూపాయల వ్యయంతో పాఠశాలలు భవనాలు నిర్మించినా ప్రహరీ గోడలు లేక ఈ పరిస్థితి నెలకొంది. మండలంలో 42 పాఠశాలలు ఉండగా, సగం పాఠశాలలకు ప్రహరీలు లేవు. పాఠశాల ఆవరణలో కుక్కలు, పందులు, పశువులు తిరుగుతూ అపరిశుభ్రంగా చేస్తున్నాయి. రాత్రివేళ కొంతమంది మందుబాబులు మద్యం సేవిస్తూ ఆ బాటిళ్లు విడిచి వెళ్తున్నారు. వలేటివారిపాలెం, బండివారిపాలెం, గాంధీనగర్, బంగారక్కపాలెం, అమ్మపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాలకొండ, పోలినేనిచెరువు, రామలింగాపురం, వీరన్నపాలెం, కట్లెమ్మపాలెం, లింగపాలెం, ఉప్పలపాడు, శామీరపాలెం, పోకూరు తదితర గ్రామాలలోని పాఠశాలలకు ప్రహరీలు లేవు. ప్రహరీలు లేకపోకపోవడంతో విషసర్పాలు, తరగతి గదులలోకి వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆవరణ స్థలాలలో పూడికమట్టితో ఎత్తు పెంచడంతో పాటు ప్రహరీలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పోతుల

ఎమ్మెల్యే దృష్టికి గిరిజనుల సమస్యలు

గుడ్లూరు : ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానిక ఎంఎస్ఆర్ గిరిజన కాలనీ వాసులు ఎమ్మెల్యే పోతుల రామారావు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు మండలంలోని దప్పళంపాడు, పూరేటిపల్లి, గుడ్లూరులో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయనకు వందలాది మంది గ్రామస్థులు అర్జీలు సమర్పించారు. వృద్ధాప్య పింఛన్లు ఇప్పించాలని, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, గృహనిర్మాణ పథకం ద్వారా పక్కా గృహాలు కేటాయించాలని, గిరిజనులు, దళిత, బడుగు, బలహీన వర్గాల వారు వినతి పత్రాలను అందజేశారు. స్థానిక మిట్టపాలెంలోని వడియరాజుల పాలెంలో 30 కుటుంబాల వారికి తాగునీరు అందడం లేదని వెంటనే సరఫరా చేయాలని ప్రజలు కోరారు.

నూతన పైప్‌లైన్లు వేసి తాగునీరు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, టీడీపీ నాయకులు వలేటి వెంకటనరసింహం, గుడ్లూరు గ్రామ సర్పంచ్ గద్దె సుందరం, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణు, కోకా చిరంజీవి, మేకపోతుల రాఘవులు ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ ఇందిరాదేవి, ఎంఈవో కల్లయ్య, ఉద్యానవనశాఖ ఏడీ జెన్నెమ్మ, పీఆర్‌జేఈ జయరావు, ఏపీఎం కృష్ణరావు, ఏవో గీతాప్రకాష్, ఏపీవో వాక్యావతి, సీడీపీవో ఉమ, సూపర్‌వైజర్ జయలక్ష్మి, పశువైద్యుడు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాల కోసం మన్నేరుకు నీరు విడుదల

లింగసముద్రం : తాగునీటి అవసరాల నిమిత్తం మన్నేరులోని రాళ్ళపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి ప్రాజెక్టు అధికారులు బుధవారం ప్రాజెక్టులోని నీటిని మన్నేరుకు విడుదల చేశారు. రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి తాగునీరు అడుగంటిపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల విజ్ఞప్తి మేరకు ఇరిగేషన్ అధికారుల ఉత్తర్వులతో ప్రాజెక్టు డీఈ శ్రీనివాసమూర్తి కొత్తస్పిల్‌వేలోని 3, 5 గేట్లను ఎత్తి మన్నేరుకు నీటిని విడుదల చేయించారు. 2 ఎంసీఎఫ్‌టీల నీటిని మన్నేరుకు విడుదల చేశామని ప్రస్తుతం ప్రాజెక్టులో 10ఎంసీఎఫ్‌టీల నీరు ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిరణ్‌కుమార్, మంచినీటి పథకం నిర్వాహకులు కిలారి కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



ట్యాంకు, పైపులను అందజేస్తున్న శేషాచార్

లింగసముద్రం : పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. కందుకూరు ఎల్ఐసీ కార్యాలయం చీఫ్ మేనేజర్ శేషాచార్ రూ. 25000 విలువైన సింటెక్ ట్యాంకు, పైపులను హైస్కూల్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పాఠశాలలు అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. శేషాచార్ మాట్లాడుతూ విద్యార్థులు బీమా స్కూల్ పథకంలో చేరి ప్ర యోజనం పొందాలన్నారు. ఎల్ఐసీ ప్రాధాన్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ బ్రాంచి మేనేజర్ మహదేవయ్య, డెవలప్‌మెంట్ ఆఫీసర్ పిచ్చయ్య, ముఖ్య సలహదారు కె.మోహన్‌రావు, ఎల్ఐసీ ఏజెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన అవసరం

కంభం : విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షకుడు జితేందర్ సూచించారు. బుధవారం స్థానిక వాసవి డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

మార్కులు కొలమానం కాదు

- విజ్ఞానం కోసం చదవాలి
- జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ హరిబాబు

లింగసముద్రం : విద్యార్థులకు మార్కులే కొలమానం కాదని విజ్ఞానం ప్రధానమని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఈదర హరిబాబు పేర్కొన్నారు. మండలంలోని వీఆర్‌కోట జడ్పీ హైస్కూల్‌లో ఎన్ఆర్ఐ పాటిబండ్ల శ్రీనివాసులు ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను బుధవారం హరిబాబు ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హెచ్ఎం తన్నీరు బాలాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల కోసమే కాకుండా విజ్ఞానం కోసం చదవాలన్నారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు దేహధారుడ్యం కొరవడడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 125 కోట్ల మంది భారతీయులు ఉన్నా ఒలింపిక్ క్రీడల్లో బంగారు పతకం తెచ్చే వారే కరువయ్యారన్నారు. సమాజంలో నైతిక విలువలు తగ్గిపోతున్నాయన్నారు. మానసికంగా సంపన్నులైతే ఉన్నత శిఖరాలకు చేరేందుకు పేదరికం అడ్డుకాదన్నారు. జిల్లాలోని 300 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రహరీగోడల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీఆర్‌కోట జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ పూర్తికి రూ. 10 లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు. అలాగే పాఠశాలలోని ఆటస్థలాన్ని కూడా గ్రావెల్‌తో అభివృద్ధి చేస్తామన్నారు. హైస్కూల్‌లో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్న గ్రామస్థులను, హెచ్ఎం బాలాజీని ఆయన అభినందించారు. కందుకూరు జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ హైస్కూల్‌లో మొక్కలు నాటించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వంకాయలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తను వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కాంతారావు, సర్పంచ్ పొంతగాని జయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పాటిబండ్ల ప్రమీల, టీడీపీ నాయకులు బోయెళ్ల కొండపనాయుడు, పి.వీరభద్రం, ఎస్ఎంసీ ఛైర్మన్ సీహెచ్ రామారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఊతమేది?

- కస్తూర్బా పాఠశాలలో ప్రారంభానికి నోచుకోని ఇంటర్మీడియట్
- ఇంటికే పరిమితమవుతున్న బాలికలు



వలేటివారిపాలెం కస్తూర్బా పాఠశాల

వలేటివారిపాలెం : కస్తూర్బా పాఠశాలల్లో పదవ తరగతి పూర్తి చేసుకున్న చాలా మంది బాలికలు చదువు మానుకుంటున్నారు. పేద విద్యార్థినులకు ఉన్నత విద్యను అందించేందుకు ఈ ఏడాది నుంచి సౌకర్యాలు ఉన్న పాఠశాలల్లో ఇంటర్ విద్యను ప్రవేశపెడతామని, అలాగే కస్తూర్బా పాఠశాలలో కూడా ఇంటర్ విద్యను అమలు పరచి నిరుపేద బాలికలకు అండగా నిలుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు కనబడటం లేదు.

ఆర్థిక స్థోమత లేనివారికి, అనాథలకు బడిబయట బాలికలకు విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్ విద్య అమలు కాక బాలికలంతా ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. మండలంలోని జమీన్ ఉప్పలపాడు, కేజీబీవీలో 200 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. కేజీబీవీల్లో ఇంటర్ విద్యను ప్రారంభిస్తామని ప్రభుత్వం రెండేళ్ల నుంచి చెబుతోంది. అయితే ఈ ఏడాది కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసైన నిరుపేద బాలికలు వందలాది ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. తల్లిదండ్రులు సైతం వెనుకడుగు వేస్తున్నారు. మరికొంతమంది తల్లిదండ్రులు బాలికలకు చిన్నవయసులోనే వివాహాలు చేస్తున్నారు.

ఈ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న 90 శాతం మంది మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. భద్రత కరువై బాలికలంతా ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. కస్తూర్బా పాఠశాలలన్నీ మంచి వాతావరణంలో ఉన్నప్పటికీ ఇంటర్ విద్యను ప్రవేశపెట్టాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. కానీ ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు.

కేజీబీవీ పాఠశాలలో చదువుకునే బాలికలు దాదాపుగా అందరూ అనాథలు, నిరుపేదలే. వారికి పదవ తరగతి పూర్తికాగానే కుటుంబసభ్యులు పెళ్లిళ్లు చేస్తున్నారని, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం ఆర్భాటంగా 10వ తరగతి తరువాత ఇంటర్మీడియట్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగానే జిల్లా స్థాయి నుంచి వచ్చిన అధికారులు కేజీబీవీ పాఠశాలలకు వెళ్లి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ అమలుచేయడం లేదు.

ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే ఇంటర్ తరగతులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. దీంతో అనేక మంది బాలికలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. అయితే పాఠశాలలు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా ఇంటర్మీడియట్ ప్రారంభించకపోవడంతో పేద విద్యార్థినులకు నిరాశే మిగిలింది.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

ఇక్కడ చదువుకుని మంచి ఉత్తీర్ణత పొందిన 10వ తరగతి విద్యార్థినులందరూ ఇంటర్ విద్యను ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులకు కూడా ఈ విషయాన్ని తెలియజేశాం. ఇంటర్ విద్యను ప్రవేశపెడితే పేద బాలకలు ఉన్నత విద్యను అందుకోగలరు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

- గోవర్ధిని, ఎస్‌వో, కేజీబీవీ వలేటివారిపాలెం

తరలిపోతున్న తెల్లరాయి

- అనుమతులు ఒకచోట, తవ్వకాలు మరోచోట
- ప్రభుత్వ భూముల్లోనూ ఆక్రమణలు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ, అయ్యవారిపల్లె, రామలింగాపురం, అంకభూపాలపురం, చుండి తదితర గ్రామాల్లో తెల్లరాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. కొందరు అక్రమార్కులు లీజుపేరుతో ప్రభుత్వానికి కొద్దోగొప్పో సొమ్ము చెల్లి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ అసైన్డ్ పేదల భూములు, అటవీ భూముల్లో భారీ ఎక్సకవేటర్లతో పెద్దపెద్ద గోతులు తీసి తెల్లరాయి నిక్షేపాలను వెలికితీస్తున్నారు. ఆయా గ్రామాల్లో తెల్లరాయి వ్యాపారం జోరందుకుంది. గూడూరు ఇతర జిల్లాలకు చెందిన కూలీలను తీసుకొచ్చి తవ్వకాలు జరిపిస్తున్నారు. రాత్రివేళల్లో ఎక్సకవేటర్లతో రాయిని వెలికితీయించి పగలు కూలీలచే వాటిని పగులగొట్టి రవాణాకు సిద్ధం చేస్తున్నారు. లారీల్లో కూలీలచే లోడ్ చేయించి అర్ధరాత్రి సమయాల్లో కూడా రవాణా చేస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపి, లీజు క్వారీ వద్ద తవ్వకాలు చేపట్టినట్లు పత్రాలను సృష్టిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ప్రభుత్వ అనుమతి లేనిదే బాస్టింగ్‌లు చేయరాదు. కానీ ఎక్సకవేటర్లతో భూమిలో నుంచి వెలుపలికి తీసిన భారీ రాళ్లకు రంధ్రాలు వేసి బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

ప్రభుత్వ, అటవీ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ప్రధానంగా మైనింగ్ రెవెన్యూ పోలీస్‌శాఖల వారికి ఈ అక్రమాలను అరికట్టే అవకాశం ఉంది.

అక్రమార్కులు ముందుగా రాయి నాణ్యతను పరిశీలించాక తవ్వకాలు జరుపుతున్నారు. వాటిలో ఎ, బి, సి గ్రేడ్‌లకు ఒక్కో ధర ఉంది. ఆ రకం రాయి ఏ క్వారీలో ఉందో గమనించి ముందుకు సాగుతున్నారు. విదేశాల్లో తెల్లరాయికి మంచి డిమాండ్ ఉంది. ప్రధానంగా తెల్లరాయిని చైనా, జర్మనీ తదితర దేశాలకు తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి తెల్లరాయి అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న తెల్లరాయి

పేదల కోసమే మెగా వైద్య శిబిరాలు

కనిగిరి టౌన్ : పేదల కోసమే మెగా వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సాఆర్ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముత్యాల వెంకట సుబ్బారెడి చెప్పారు.స్థానిక కాస్మోపాలిటిన్ క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం చేయించుకోలేక ప్రాణాలు కోల్పోతున్న పేదలను ఆదుకోడానికి తాము సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సెప్టెంబర్ 2న కనిగిరి క్లబ్‌లో సింహపురం ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు గుడిపాటి ఖాదర్, పులి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

చిన్నారి హత్య కేసు నిందితుడికి రిమాండ్

కనిగిరి : చిన్నారి షియోని కుమారి హత్య కేసులో అరెస్టయిన రాపూరి పేరయ్యకు కనిగిరి కోర్టు రిమాండ్ విధించింది. నిందితుడిని స్థానిక సీఐ ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం హాజరుపరిచారు. కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి అతడికి 15 రోజులు రిమాండ్ విధించగా, ఒంగోలు సబ్‌జైలుకు తరలించినట్టు సీఐ ఎం. సుబ్బారావు తెలిపారు.

గొర్రెలు అందజేత

వెలిగండ్ల : గన్నవరం లబ్ధిదారులకు ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి బుధవారం గొర్రెలను అందజేశారు. బీసీ కార్పొరేషన్ అందజేసిన వాటిని వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సబ్సిడీ రుణాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన వాటిని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షరీఫ్, పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

అవగాహన సదస్సులో నగర పంచాయతీ చైర్మన్ చిన మస్తాన్



మాట్లాడుతున్న చెర్మన్ చినమస్తాన్

కనిగిరి : మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని నగర పంచాయతీ చైర్మన్ షేక్ చినమస్తాన్ చెప్పారు. వారి సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక షాదీఖానాలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం వివిధ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ చినమస్తాన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న వివిధ పథకాలను వారు అందుకునేలా అధికారులు చూడాలన్నారు. మైనార్టీలకు కార్పొరేషన్ రుణాలు, పిల్లల విద్యావసతి ఇచ్చే రుణాలు, వృత్తి నైపుణ్యంలో ఇచ్చే రుణాలకు దరఖాస్తు చేసుకునే విధానంపై మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కపీల్ బాషా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగ్జికూటీవ్ డైరెక్టర్, సయ్యద్ ఫీరాజుల్లా, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రోషన్ సందాని, కౌన్సిలర్ చింతం శ్రీను, పోలిచర్ల రహీం, కో ఆప్షన్ సభ్యులు బుజ్జా, పీరమస్తాన్‌వలి, మారుతి పాల్గొన్నారు.


నూతన కమిటీతో ఐక్యవేదిక నాయకులు

బీసీ ఐక్య వేదిక కమిటీ ఏర్పాటు

కనిగిరి : స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో కనిగిరి బీసీ ఐక్యవేదిక సమావేశం బుధవారం జరిగింది. పెన్నా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీసీ ఐక్యవేదిక నూతన అధ్యక్షుడిగా పల్లా మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి కె. పెద్దన్న, కోశాధికారి బొబ్బరాజు వెంకట సుబ్బారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీల ఐక్యత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని కమిటీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. సమావేశంలో పట్టణ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్, గురవయ్య, శ్రీధర్, ఓబులేషు, కె.మనోహర్, దేపూరి వెంకటేశ్వర్లు, కాశయ్య, రసూల్, బాలమదార్, రత్తయ్య పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై పోరాటం



సభ్యత్వం నమోదు చేయిస్తున్న యూటీఎఫ్ నేతలు

వెలిగండ్ల : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పోరాడుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజారహంతుల్లా చెప్పారు. బుధవారం ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తోందని చెప్పారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎన్. వెంకటరెడ్డి, బీ. రుషేంద్ర, నారయ్య, ఎస్. వెంకటేశ్వర్లు,షేక్ మౌలాలి, వీ ఇర్మియా, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బియ్యం అందజేయండి


మాట్లాడుతున్న హనుమంతరావు

వెలిగండ్ల : మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ డీలర్లు సకాలంలో బియ్యం అందజేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి హను వ ం త రా వ ు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల రేషన్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. లారీల నుంచి బియ్యం దించే హమాలీలకు కూలీ డబ్బు కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉందన్నారు. నరసమందాపురంలో అంగన్ వాడీ కేంద్రంలో వేలిముద్ర వేసినా బియ్యం మంజూరు కావడం లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతీ ఫిర్యాదు చేశారు. హనుమంతరావు వెంటనే డీలరుకు ఫోన్ చేసి బియ్యం వెంటనే అంగన్ వాడీ కేంద్రానికి అందజేయాలని ఆదేశించారు. కిరోసిన్ స్టాకు డీలర్లు చూపించాలని నిర్దేశించారు. తహసీల్దార్ ఈ చంద్రావతి, ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం


బదిలీ టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

సీఎస్‌పురం(పామూరు) : వడ్డేపాలెం పాఠశాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఎన్. వెంకట్రామయ్య, జె. వెంకట్రావును గ్రామస్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమావేశం

కనిగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం జరిగిన నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘంలో ఆయన మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందన్నారు. బ్రాహ్మణులు వడ్డీవ్యాపారుల ఉచ్చులో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీలు కట్టలేక షాపులకు తాళాలు వేయించుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మిర్యాల రాఘవరావు, నియోజకవర్గ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వర్లు, చెరుకూరి కాశయ్య, రామయ్య,చెన్నయ్య,శ్రీను, సత్యం,రమేష్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

మేలు రకమైన వరినారు అవసరం

సీఎస్‌పురం(పామూరు) : రైతులు మేలు రకమైన వరినాట్లను ఎంపిక చేసుకోవాలని ఏవో మునిపార్థసారధి సూచించారు. అంబవరం కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దపాలుగా దమ్ముచేసి చదును చేయాలన్నారు. ఐదుసెంట్ల నారుమడికి రెండుకిలోల నత్రజని, కిలో భాషస్ఫరం, కిలో పొటాషియం వేయాలని సలహా ఇచ్చారు. సర్పంచ్ అద్దంకి రమణయ్య, ఎంపీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస : జయ జానకి నాయక

హామీల అమలులో వైఫల్యం

టీడీపీ, బీజేపీ తీరుపై సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అంజయ్య ధ్వజం



మాట్లాడుతున్న అంజయ్య

కనిగిరి టౌన్ : ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య ఆక్షేపించారు. పట్టణంలోని క్లబ్‌రోడ్డులో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేకపో యారని చెప్పారు. రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన పీఎం ఖాళీలను భర్తీ చేయలేకపోయారని చెప్పారు. దీంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రైవేట్ రంగ సంస్థల్లో చదువుకు తగ్గ ఉద్యోగాలు లభించకపోవడంతో నిరుద్యోగులు అల్లాడిపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, పీసీ కేశవరావు, రామకృష్ణ,నారాయణ, పిచ్చయ్య, కాశయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

సీఎస్‌పురం(పామూరు) : ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వారికి పనిదినాల సంఖ్యను పెంచాలని కనిగిరి డివిజన్ యాకా సంఘం కార్యదర్శి ఉసా వెంకటేశ్వర్లు కోరారు. పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు కోరల్లో సీఎస్‌పురం మండలం చిక్కుకుందని వ్యవసాయం, పనులు లేక కూలీలు బతుకు తెరువు కోసం వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల సంఖ్యను పెంచి ఉపాధి కూలీలు వేతనాలు పెంచి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ కార్మికుల ధర్నా

కనిగిరి : అక్రమ బదిలీలు రద్దు చేయాలని, సాధారణ బదిలీల్లో సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగునాడు విద్యుత్ కార్మికుల సంఘం బుధవారం డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేసింది. కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఆర్. మోహన్‌నాయక్, కార్యదర్శి హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిండ్ నాయబ్‌రసూల్, ప్రసాద్, నాగయ్య, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

దాహం కేకలు

పెద ఇర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొరాయించిన మంచినీటి బోరు

పీసీపల్లి : పెద ఇర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాగేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు 275 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో ఈ పాఠశాలలో చేతిపంపు ఉండేది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో అది పనిచేయడం లేదు. మధ్యాహ్న భోజనం సమయంలో నీరు లభించక విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. పాఠశాల వెలపల ఉన్న ఊరిలోని చేతిపంపు వద్దకు వెళ్లి మధ్యాహ్నభోజనం చేయాల్సి వస్తోంది. భోజనం అనంతరం నీరుతాగి ప్లేట్లు కూడా విద్యార్థులు అక్కడే శుభ్రపరుచుకుంటున్నారు.నీటి సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు మూత్రశాలలను వినియోగించుకోలేక పోతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నప్పటికీ, అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీరు లేకుండా మధ్యాహ్న భోజనం ఎలా చేయాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే మధ్యాహ్న భోజన పథకాన్ని బహిష్కరిస్తామని విద్యార్థులు అంటున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


పెద ఇర్లపాడు చేతిపంపు వద్ద విద్యార్థుల పాట్లు

వేరే దారి లేదా?



కోటపాటి అజయ్, విద్యార్థి

మా పాఠశాలలో ఉన్న ఒక్కగానొక్క బోరు ఎండిపోయింది. తాగునీటి సమస్యతో తల్లడిల్లుతున్నా అధికారులు స్పందించడం లేదు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలి. నీరు లేకపోవడంతో అన్నింటికీ ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది.

అల్లాడిపోతున్నాం



- రామన మమత, విద్యార్థి

పాఠశాలలో తాగునీటి కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం సమయంలో గ్రామంలోని చేతి పంపు వద్దకు వెళ్ళాల్సి వస్తోంది. ప్లేట్లు చేత పట్టుకొని గ్రామంలోని వెళ్లలేక అల్లాడిపోతున్నాం. అధికారులు మంచినీటి సౌకర్యంకల్పించాలని కోరుకుంటున్నాం.

మంచినీరిస్తాం



- డీ. సురేష్‌బాబు, ఎంపీడీవో, పీసీపల్లి

పెద ఇర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి కోసం విద్యార్థులు ఇక్కట్లు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. గురువారం నుంచి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూస్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఇకనుంచి ప్రతిరోజూ ట్యాంకర్ ద్వారా పాఠశాలకు మంచినీరు అందిస్తాం.

అగ్రి గోల్డ్ బాధితుల తరపున పోరాటం


అగ్రిగోల్డ్ యాత్రల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ నారాయణ

పామూరు : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తోందని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక జీవైఆర్ భవనంలో అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య సదస్సులకు సంబంధించి గోడ పత్రికలను బుధవారం అవిష్కరించారు. అగ్రిగోల్డ్ బాధితులు చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడినందున వారి కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. తక్షణం రూ.1180 కోట్లును అడ్వాన్సుగా ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ మాటలు నమ్మి లక్షలాది మంది పేదలు పొదుపు చేసి మోసపోయారని చెప్పారు. బాధితులకు ఇంతరకూ న్యాయం జరగలేదన్నారు. వచ్చే నెల మూడున జిల్లా చైతన్యయాత్ర నిర్వహించనున్నందున అగ్రి గోల్డ్ ఏజెంట్లు, వినియోగదారులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డీ మౌలాలి, ఎన్. నాయబ్‌రసూల్, హెల్‌ఫేర్ అసోసియేషన్ సభ్యులు బి. లక్ష్మణ, బి. మాల్యాద్రి, సుబ్బారావు పాల్గొన్నారు.

డాక్టర్ వలి బాధ్యతల స్వీకరణ

పామూరు : బొట్లగూడూరు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్‌గా షేక్ మహ్మద్‌వలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పీహెచ్‌సీకి పూర్తిస్థాయి వైద్యులు ఉండడంతో తమకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.


సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

బాలిక విద్యతోనే దేశాభివృద్ధి

సీఎస్‌పురం(పామూరు) : బాలిక విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ టి. పెద అల్లూరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. డేవిడ్ అన్నారు. పెదరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బడికోస్తా పథకం కింద బుధవారం పలువురు బాలికలకు సైకిళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని చెప్పారు. బాలికలు మధ్యలో బడి మాని వేయకుండా ఉండడానికి బడికొస్తా కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మీరమ్మ, హెచ్‌ఎం పీవీ రామ్మోహన్, నాయకులు బొబ్బూరి రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ డి. నాగార్జున పాల్గొన్నారు.


సమావేశమైన ఫిషర్‌మేన్ ప్రతినిధులు

సొసైటీకే సర్వాధికారాలు

పామూరు : నుచ్చుపొద ఫిషర్ మేన్ సొసైటికే సర్వాధికారులు ఉన్నాయని ఒంగోలు ఫిషర్ మేన్ జేడీ ఎం.బలరామమూర్తి చెప్పారు. నుచ్చుపొద గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ఫిషర్‌మేన్ సొసైటీ సర్వసభ్య సమావేశం సొసైటీ అధ్యక్షుడు కౌలూరి ఖాజారహంతుల్లా అధ్యక్షతన జరిగింది. ఫిషర్‌మేన్ జేడీ బలరామమూర్తి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సొసైటీలో ఉన్న ముగ్గురు సభ్యులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే కమిటీ పరిష్కరిస్తుందన్నారు.సమావేశంలో ఒంగోలు ఫిషర్‌మేన్ ఏడీ ఏ.చంద్రశేఖర్, కందుకూరు డీఆర్ ప్రసాదరావు, దర్శి సబ్ డివిజనల్ అధికారి బీసీ మాలకొండయ్య, కనిగిరి ఏఎఫ్‌డీ పొట్టెయ్య, సొసైటీ కార్యదర్శి ఏ. పుల్లయ్య,ఉపాధ్యక్షుడు జీ. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కుల పంపిణీ

పీసీపల్లి : గోపవరపువారిపల్లి ప్రాథమికపాఠశాల విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు అందజేశారు. కనిగిరి పతాంజలి యోగా కేంద్రం ప్రతినిధులు స్వర్ణా రమణయ్య, పీ వెంకటేశ్వర్లు 40 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా వాటిని అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బరాయుడు, ముప్పూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రగతి పనుల్లో జాప్యం వద్దు

ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, కె.పార్థసారథి

పామూరు : ప్రగతి పనులు సకాలంలో పూర్తి చేయాలని కదిరి పార్థసారథి, ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు అధికారులను కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామూరు మండలంలో అంగన్‌వాడీ, సీసీరోడ్లు, శ్మశానాలు అభివృద్ధి, పాఠశాలలకు ప్రహరీలు, నీరు-చెట్టు కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే కదిరి బాబూరావు కోట్లాది రూపాయల నిధులను కేటాయించారని చెప్పారు, అయితే గుత్తేదారులు, అధికారులు సమన్వయంగా వ్యవహరించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ప్రగతి పనులు చేపడుతున్నందున మండలాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ డీవీ మనోహర్, కో ఆప్షన్ సభ్యుడు ఖాజారహంతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు యూ. హరిబాబు, ఎంజీ రాజు, పాలపర్తి వెంకటేశ్వర్లు, షేక్ బాషా, ఎన్. హరి, శేషం మోషే, దేవరపు మాల్యాద్రి, ముబినా మౌలాలి, పులి నాయబా, పీఆర్ డీఈ చెంచురామయ్య, స్పెషల్ ఏఈ ఆదిశేషు, ఏఈ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆడాప్టర్ కదిరి పార్థసారథి, ఎంపీపీ ఆవుల

డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలకు స్పందన

పర్చూరు: పట్టణంలోని తూర్పువారి వీధిలో గణేష్ని మండపం వద్ద మంగళవారం రాత్రి జిల్లా స్థాయిలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు జరిగాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిని చిలకలూరిపేట వారు కైవసం చేసుకోగా, మిగిలిన బహుమతులను పర్చూరులోని చిన్నారులు కైవసం చేసుకున్నారు. విజేతలకు రోటేరియన్ కోట శ్రీనివాసరావు చేతుల మీదుగా నగదుతో పాటు షీల్డ్‌ను అందజేశారు.

ఇంటర్వ్యూ

పర్మిషన్స్ ఏ పాఠశాలలో లేవు

కె.వెంకటేశ్వరరావు, ఎంఈవో



సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతి ఉపాధ్యాయుడు ఖచ్చితంగా సమయపాలన పాటించాలి. పర్మిషన్స్ ఏ పాఠశాలలో లేవు. సమయపాలన పాటించకపోతే సెలవు నోట్ చేయాలి.

బయోమెట్రిక్ విధానాన్ని ఎన్ని పాఠశాలలో అమలు అవుతుంది?

మూడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి.

అన్ని పాఠశాలలకు గ్యాస్ పంపిణీ జరిగిందా ?

మండలంలోని 37 పాఠశాలలకు గ్యాస్ పంపిణీ జరిగింది.

పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల కొరత ఉందా ?

అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశాం. ఎక్కడా కొరత లేదు.

చినగంజాం

పాఠశాలల్లో బయోమెట్రిక్‌ను తప్పక అమలుచేయాలి

డిప్యూటీ డీఈవో ఇత్తడి సాల్మన్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో ఇత్తడి సాల్మన్

పర్చూరు: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధిగా బయోమెట్రిక్ విధానాన్ని తప్పక అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈవో ఈ.సాల్మన్ అన్నారు. పర్చూరు డివిజన్ పరిధిలోని 13 మండలాలకు సంబంధించిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంత్ర యాప్ ద్వారా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసే విషయంపై బుధవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ దసరా సెలవుల అనంతరం ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తప్పక బయోమెట్రిక్ ద్వారా అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించటం జరిగిందన్నారు. దీంతో పాటు మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల హాజరు ఎప్పటికప్పుడు యాప్ ద్వారా ఆయా ఏజన్సీలకు పంపించాలన్నారు. గతంలో అందజేసిన మెషీన్లు సక్రమంగా పనిచేయకపోతే వాటి స్థానంలో నూతన పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అందజేసిన బయోమెట్రిక్ పరికరాల పనితీరు ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు సెప్టెంబర్ 4న ట్రయల్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధం గా ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి దామా నాగేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పంపిణీ

యద్దనపూడి: పట్టణంలోని ఎలిమెంటరీ స్కూల్‌లో బుధవారం కుకింగ్ ఏజెన్సీలకు గ్యాస్ పంపిణీ చేశారు. ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు , ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

యద్దనపూడి : పూనూరులో పారిశుధ్యం మెరుగుపరచాలని వైద్య సబ్‌యూనిట్ ఆఫీసర్ భూపతి తెలిపారు. బుధవారం పూనూరును సందర్శించి పంచాయతీ సిబ్బందికి తెలిపారు.

భర్త ఇంటి ముందు భార్య మౌన దీక్ష



చినగంజాం : భర్త, అత్తమామలు వేధింపులు తాళలేక భర్త ఇంటి ముందు ఓ వివాహిత మౌన దీక్ష చేపట్టిన సంఘటన మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ పరిధిలోని కుక్కలవారిపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గాలి రామకృష్ణారెడ్డికి కొత్తపట్నంకు చెందిన సుబ్బరావమ్మకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వారికి సంతానం లేదు. కట్నంగా రూ.2 లక్షల నగదు, నాలుగు సవర్ల బంగారం ఇచ్చారు. కొంతకాలంగా రామకృష్ణారెడ్డి, అతని తల్లిదండ్రులు గాలి రవణమ్మ, శ్రీనివాసరెడ్డి, అన్నయ్య సాంబశివారెడ్డి అదనపు కట్నం తెమ్మని, ఇప్పటి వరకు నీకు పిల్లలు లేరు కనుక వేరే వివాహం చేస్తామని వేధిస్తున్నారు. అదనపు కట్నం కింద కొత్తపట్నంలోని ఉప్పు కొఠారులు, ఇళ్లస్థలాలు అమ్మాలని ఒత్తిడి చేస్తున్నారని సుబ్బరావమ్మ వాపోయింది. మూడురోజుల క్రితం సుబ్బరావమ్మను ఆమె భర్త, అత్తమామలు ఇంటి నుంచి బయటకు గెంటివేశారు. దీంతో ఆమె ఇంటి ముందు బంధువులు, గ్రామంలోని మహిళలతో కలిసి మౌనదీక్ష చేపట్టింది. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.విజయ, శ్రీశక్తి ఎడ్యుకేషన్ ఎకనామికల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు భ్రమరాంబ, బంధువులు, గ్రామ మహిళలు, సీఐటీయూ పర్చూరు డివిజన్ అధ్యక్షుడు జి.ప్రతాప్‌కుమార్‌లు ఆమెకు అండగా నిలిచారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలి సమక్షంలో సుబ్బరావమ్మకు, ఆమె భర్త రామకృష్ణారెడ్డికి, అత్త రమణమ్మకు, మామ శ్రీనివాసరెడ్డికి చినగంజాం ఎస్సై సురేష్ కౌన్సిలింగ్ ఇచ్చారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఇంకొల్లు: ఇడుపులపాడు ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ)లో బుధవారం గ్రామానికి చెందిన దాత బి.వెంకటరెడ్డి దంపతులు, పి.బుల్లియ్య నోట్‌పుస్తకాలు, బ్యాగులు, ప్యాడ్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.జయరాజ్, రిటైర్డ్ ఎంఈవో గోరంట్ల హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు గోరంట్ల సింగమ్మ, ప్రధానోపాధ్యాయుడు జి.పేరిరెడ్డి, ఉపాధ్యాయులు బి.హరేరామిరెడ్డి, బి.కేశవరెడ్డి, బి.విజయలక్ష్మీ, పున్నమ్మ, మస్తాన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



సభలో మాట్లాడుతున్న కొర్రపాటి సుధాకర్

ఇంకొల్లు: ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి సుమారు రూ.26 వేల విలువ కలిగిన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి డా.కొరపాటి సుధాకర్, ప్రధానోపాధ్యాయులు పిడపర్తి పేర్రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టిపాటి నగర్‌లో పందుల స్వైర విహారం

- నిర్మూలన చర్యలు శూన్యం
- కాలనీవాసుల ఆందోళన

మార్టూరు: గ్రామ పంచాయతీ పరిధిలోని గొట్టిపాటి నగర్‌లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కాలనీలో సైడు కాలువల్లో మురుగునీరు పేరుకుని ఉండటం, దోమలు విజృంభించడంతో ప్రజానీకం అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికే ఒక పిచ్చికుక్క కారణంగా గత ఆదివారం నలుగురు కాలనీ వాసులు తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రతి వీధిలో పందులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ఒక్కోసారి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పెద్ద వారు పనులకు వెళ్లడంతో ఇళ్ల వద్ద చిన్నారులు ఉంటున్నారు. పందులు, కుక్కలు పిల్లలపై దాడి చేస్తాయోమోనని ఆందోళనకు గురవుతున్నారు. కాలనీలో కూలినాలి పనులు చేసుకుని జీవనం సాగించే వారే అధికం. గ్రామ పంచాయతీ వారు కనీసం మురుగు కాల్వలపై బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఓ వీధిలో సంచరిస్తున్న పందులు

పందుల బెడద ఎక్కువైంది

పఠాన్ గఫూర్, గొట్టిపాటి నగర్



కాలనీలో పందులు వీర విహారం చేస్తున్నాయి. ఇంటి ముందు ఉంచిన వస్తువులపై దాడులు చేస్తున్నాయి. పిల్లలపై దాడి చేస్తాయని భయంగా ఉంది.

దోమలతో అల్లాడిపోతున్నాం

గద్దం మస్తాన్‌వలి, గొట్టిపాటి నగర్



పందులు, కుక్కలతో పాటు కాలనీలో దోమల గోల ఎక్కువైంది. వాటి కారణంగా జ్వరాలు వస్తున్నాయి. అధికారులు కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదు.

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం

చినగంజాం : పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే ఎంతో లాభకరమని మండల వ్యవసాయాధికారి ఎన్.మేరమ్మ రైతులకు సూచించారు. మండలంలోని నీలాయిపాలెం, పూలవారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. వేరుశెనగపైరులో ఆధునిక పద్ధతులు పాటించి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని అన్నారు. ఘన జీవామృతం, జీజామృతం, జీవామృతం, వరి విత్తనాలకు విత్తన శుద్ధి నాండేప్ కంపోస్ట్ తదితర వాటిని రైతులకు వివరించారు. పూలవారిపాలెం ప్రాంతంలో వేసిన వేరుశెనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భరత్, ఎంపీఈవో చెన్నయ్య, సీఆర్పీ గీత, జయమ్మ, రైతులు పాల్గొన్నారు.

కోలలపూడిలో వినాయక నిమజ్జనం

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామంలో గౌడ కాలనీలో బుధవారం ఉదయం వినాయకుని లడ్డును శొంటి డోలేశ్వర్ రూ. 15,700లకు పాటపాడారు. అనంతరం వినాయకుని ఊరేగింపు నిర్వహించారు. బాణా సంచా కాలుస్తూ భక్తులు కోలాహలంగా నిమజ్జనం చేశారు. మార్టూరు పలు కాలనీల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

నేడు నవరత్నాల సభకు తరలిరావాలి

మార్టూరు: పర్చూరులో గురువారం సాయంత్రం రాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో జరిగే నవరత్నాల సభకు వైసీపీ పార్టీ మండల బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు హాజరుకావాలని మండల పార్టీ అధికార ప్రతినిధి గద్దం మస్తాన్‌వలి ఒక ప్రకటనలో కోరారు.

భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

పర్చూరు: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం పర్చూరు మండలంలోని అనేక గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను నిమజ్జనానికి చీరాల సముద్రానికి తరలించారు. దేవరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి చీరాల వాడరేవుకు తరలించారు.

నేడు అన్నదాన కార్యక్రమం

అడుసుమల్లి గ్రామంలో వినాయక విగ్రహం వద్ద భక్తులు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం మండపం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు అడ్డగడ్డ వేణుగోపాల్, కారుమంచి పాపారావు, కారుమంచి కృష్ణ తెలిపారు.

ఇంకొల్లు మండలంలో...

ఎంఆర్ఆర్ ప్రకాశం పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని బుధవారం ఆ పాఠశాల విద్యార్థులు నిమజ్జనానికి తరలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరింజేశాయి. కొణికి గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు వినాయక విగ్రహాలను నిమజ్జనం కోసం తీరానికి తరలించారు.

యద్దనపూడి మండలంలో...

వినాయక నిమజ్జనం సందర్భంగా పూనూరు, చిమటావారిపాలెంలో గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పూనూరులో సినిమా హాలు సెంటర్, చిమటావారిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను బుధవారం నిమజ్జనం చేశారు.

ఉపాధి పనుల రికార్డుల పరిశీలన

నాగులుప్పలపాడు: స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం ఏపీడీ కాత్యాయని ,ఎఓ విజయలక్ష్మి ఉపాధి పనుల రికార్డులు పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబరు మొదటి వారంలో కేంద్ర బృందం పరిశీలన నేపథ్యంలో మండలంలో జరిగిన ఉపాధి పనులు, నీటికుంటలు ,మరుగుదొడ్లనిర్మాణం పనులు తదితర అంశాలపై సిబ్బందితో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఈదుమూడిలో తవ్విన నీటి కుంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో బులెన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ పై వీడని ప్రతిష్టంభన

అసాంఘిక కలాపాలకు నిలయంగా మారిన వైనం

పట్టించుకోని నగర పంచాయతీ

నేటి కౌన్సిల్‌లో చర్చించేనా

చీమకుర్తి: కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా సేవలు మాత్రం ప్రజలకు అందుబాటులోకి రాలేదు. గదుల కేటాయింపులో నెలకొన్న ప్రతిష్టంబన ఇంకా వీడలేదు. నగర పంచాయతీ హోదా వచ్చిన తరువాత పట్టణంలో జరిగిన ఏకైక శ్వాశత పని అది. రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి ,మాజేటి హనుమానుల ఆధ్వర్యంలో దాదాపు రూ. 15లక్షల నిధులు వెచ్చించి నిర్మాణాన్ని పూర్తి చేశారు. జూన్ 23న మంత్రి శిద్దా రాఘవరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించి దాతలు మార్కెట్‌ను నగర పంచాయతీకి అప్పగించారు. అప్పటి నుంచి గదుల కేటాయింపు ప్రక్రియ చేపట్టక పోవడంతో వృథాగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా కనీసం మార్కెట్‌కు తాళం కూడా వేయకపోవడంతో అందులో అసాంఘిక కలాపాలు జరుగుతున్నాయి. రాత్రివేళ మందుబాబులకు నిలయంగా మారింది. బహిరంగ మలవిసర్జనకు సైతం మార్కెట్‌ను వాడుకుంటున్నా నగర పంచాయతీ అధికారుల్లో ఎటువంటి చలనంలేదు. రెండు కౌన్సిల్ సమావేశాలు జరిగినా గదుల కేటాయింపు ప్రక్రియపై ఎటువంటి తీర్మానాలు చేయలేదు. మరోవైపు మార్కెట్‌కు నెలకొన్న ఈదుస్థితిపై దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రజలకోసం ఖర్చుకు వెనకాడకుండా నిర్మాణాన్ని పూర్తి చేసి నగర పంచాయతీకి అప్పజెపితే గాలికి వదిలివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గురువారం నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం జరగనుంది. కనీసం ఈ సమావేశంలోనైనా చర్చించి మార్కెట్ సేవలను ప్రజలకు త్వరిత గతిన అందజేయాలని వారు కోరుతున్నారు.




చీమకుర్తిలో దాతల సహాయంతో నిర్మించిన మార్కెట్ భవన వసతి సముదాయం



చాలా బాధగా ఉంది

- చెరుకూరి రఘుకిరణ్ -అసిస్టెంట్ గవర్నర్ , రోటరీ క్లబ్

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగామారిన కూరగాయాల మార్కెట్ దుస్థితిని చూస్తే చాలా బాధగా ఉంది. ప్రజలకు మేలు కలగానే సదుద్దేశంతో త్వరిత గతిన నిర్మాణం పూర్తి చేశా, కానీ, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఆలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారో అర్థం కావడంలేదు.



వేలం ద్వారా గదులు కేటాయిస్తాం

- ఆముదాలపల్లి ఆదినారాయణ , కమిషనర్, నగర పంచాయితీ

కౌన్సిల్ సమావేశంలో చర్చించి వేలం పద్ధతిలో గదులు కేటాయిస్తాం. తలుపులు అన్ని బిగించి అక్టోబర్ 1కల్లా మార్కెట్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.



విఘ్నేశ్వరుడి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్

వినాయక పూజల్లో ఎమ్మెల్యే

ఓబనపాలెం (నాగులుప్పలపాడు) : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఓబనపాలెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి పూజల్లో ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైసీపీ జిల్లా కార్యదర్శి మారెళ్ల బంగారు బాబు, సర్పంచ్ వక్కింటి శ్రీనివాసరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో లో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్వరూప

సబ్సిడీపై రైతులకు పీవీసీ పైపులు

సంతనూతలపాడు : రైతులకు సబ్సిడీపై పీవీసీ పైపులు ఎన్ఎఫ్ఎస్ఎన్ పథకంద్వారా పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి డి. స్వరూప తెలిపారు. బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రుద్రవరం ,లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి నారు పెంపకంలో మెలకువలను రైతులకు వివరించారు. పైపులు అవసరమైన వారు పట్టాదారు పాసుపుస్తకం ,ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టుసైజుఫోటోలు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీఏ కార్యాలయంనుంచి ఆర్.వెంకటస్వామి, ఏఈవో మహీధర్‌బాబు పాల్గొన్నారు.

కాసిరాజు కుంట - సాగుకు తంటా



కాసిరాజుకుంట భూములు

సాగుకు అనుమతి ఇవ్వాలని దళిత రైతుల గోడు

ముప్పాళ్ళ (నాగులుప్పలపాడు) : ఇంకొల్లు మండలం భీమవరం గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెం 201లో కాసిరాజు కుంట భూముల్లో సాగుకు అనుమతి ఇవ్వాలని ముప్పాళ్ళ గ్రామానికి చెందిన దళితులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన 20 కుటుంబాల దళితులు గత 50 ఏళ్లుగా కాసిరాజు కుంట భూములైన 23 ఎకరాలలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భూములు ఇంకొల్లు మండల పరిధిలో ఉన్నాయి. గత జూన్ నెలలో భీమవరం రెవెన్యూ పరిధిలోని నాలుగు కుంటలను నీరు -చెట్టు పథకం క్రింద చెరువులుగా వరార్చేందుకు పర్వార్చరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిధులు మంజూరు చేయించారు. జూన్‌లోఆ భూముల్లో నీరు - చెట్టు కింద చెరువు తవ్వకం పనులు చేపట్టారు. ఆసమయంలో సాగు చేసుకుంటున్న దళితులు తమజీవనాధారం తీయవద్దని పనులను అడ్డుకున్నప్పటికి పోలీసుల సహాయంతో 23 ఎకరాల చుట్టూ ఎత్తుగా ఎక్స్‌కవేటర్‌తో కట్టనిర్మాణలు చేపట్టారు. దీనిపై పలుమార్లు మండల , జిల్లా స్థాయి రెవెన్యూఅధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని దళితులు వాపోతున్నారు. కుంటభూములను కొం దరు అగ్రకులాలకు చెందిన రైతులు ఆక్రమించి ఉండగా వారి పరిధిలో చెరువులు తవ్వకుండా మా భూముల్లోనే చెరువు నిర్మాణం చేపట్టడం ఏమిటని బాధిత దళిత రైతులు వాపోతున్నారు.

50 ఏళ్లుగా సాగు

50 ఏళ్లుగా ఆ భూములనే నమ్ముకొని సాగు చేసుకుంటున్నామని దళితులు చెబుతున్నారు. వర్షాలు పడి భూములు సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చెరువుభూముల్లో సాగుకు దళితులు ఉపక్రమిస్తే శాంతి భద్రతల సమస్యగా మారే ప్రమాదం ఉంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రతినిధులు , రెవెన్యూ అధికారులు కాసిరాజు కుంట భూముల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



భూమే జీవనాధారం

- పి.సుధాకర రావు

కాసిరాజు కుం ట భూముల్లో 90 సెంట్ల భూమిని మాపూర్వీకులనుంచి సాగు చేసుకుంటున్నాం. ఆ భూములే మాకు జీవనాధారం. అవి కోల్పోతే కుటుంబ పోషణే గగనంగా మారి రోడ్డుపై పడతాం. మా భూములు మాకిప్పించండి.



సాగుకు అనుమతివ్వాలి

- పెదపూడి పూర్ణ చంద్రరావు

కాసిరాజు కుంటభూముల్లో సాగుకు అనుమతివ్వాలి . ఆభూమిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మా భూముల్లోనే చెరువు తవ్వడం హేయమైన చర్య . ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై స్పందించాల్సిన అవసరం ఉంది.

ఉపాధిలో పురోగతి సాధించండి

మద్దిపాడు : ఉపాధి హామీ పనులల్లో పురోగతి సాధించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర సహాయకులు పనితీరు మెరుగు పరుచుకోవలని సూచించారు. ఎన్‌టీఆర్ జలసిరి ,లేబర్‌బడ్జెట్, ప్లాంటేషన్, ఆధార్ సీడింగ్ , మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

నైపుణ్య అభివృద్ధిని పెంపొందించుకోవాలి

తిమ్మసముద్రం (నాగులుప్పలపాడు): వృత్తి శిక్షణతో నైపుణ్య అభివృద్ధిని పెంపొందించుకోవాలని కోఆర్డినేటర్ శ్రీశైలం అన్నారు. నేషనల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో తిమ్మసముద్రంలో బుధవారం భవననిర్మాణం , ఇతర నిర్మాణ రంగాలలో పనిచేసే కార్మికులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే వృత్తిలో మెలకువలు పాటించక పోతే ప్రాణాంతకమైన ప్రమాదంలో చిక్కుకు పోతారన్నారు. ఇందుకోసం ఆయా రంగాల్లోని వారికి నైపుణ్యతను పెంపొందించుకొనేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులు , ఉపాధి కూలీలు ,పెయింటర్స్ , అసంఘటిత రంగాల్లోపనిచేసే కార్మికులందరికి ప్రాంతాల వారీగా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో రోజుకు స్టైఫండ్‌తో పాటు ఉచిత భోజన , వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. తిమ్మసముద్ర పరిసరప్రాంతాలలో పనిచేసే కార్మికులు , కూలీలందరూ నైపుణ్యాభివృద్ధి శిక్షణలో పాల్గొనాలని కోరారు.

చెట్లతోనే మానవ మనుగడ

మద్దిపాడు ఎస్సై రాజేష్

మద్దిపాడు: చెట్లతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలని మద్దిపాడు ఎస్సై రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని మద్దిపాడు ఘడియపూడి కాలనీలో వనం-మనం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొక్కలు నాటేందుకు సైన్యంలా కదిలిరావాలన్నారు.

పాఠశాలల పర్యవేక్షణకు 'సంకల్పం మానిటరింగ్'

ఒంగోలు విద్య: జిల్లాలోని పాఠశాలల పర్యవేక్షణకు 'సంకల్పం మానిటరింగ్ ప్రోగ్రాం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి ఎంవీ.సుధాకర్ తెలిపారు. సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలో సెప్టెంబరు 1నుంచి అక్టోబర్ 31 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలలను మండలాల వారీగా ప్రత్యేక పర్యవేక్షక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయి. మండల విద్యాధికారులు సర్వశిక్షా అభియాన్ సెక్టోరియల్ అధికారులు, స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు , డివిజనల్ లెవల్ మానిటరింగ్ సభ్యులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు సుధాకర్ తెలిపారు. వారానికి 9 మండలాల చొప్పున రెండు నెలల్లో అన్ని మండలాల్లో 504 పాఠశాలలను పర్యవేక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు మండలాన్ని సందర్శించిన రోజు సాయంత్రం ఆ మండల విద్యావనరుల కేంద్రలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేసి పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తారు. పాఠశాల సమీక్షలో పాఠశాలల అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలిస్తారని సుధాకర్ తెలిపారు.

వారం రోజుల్లో 161 డిజిటల్ తరగతి గదులు

డీఈవో విజయభాస్కర్

ఒంగోలు విద్య: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వారంరోజుల్లో 161 డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆర్‌జేడీ కేవీ.శ్రీనివాసులరెడ్డి పాఠశాల విద్యాశాఖలో అమలు జరుగుతున్న వివిధ అంశాలపై డీఈవోకు సూచనలిచ్చారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన డిజిటల్ తరగతి గదులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆర్‌జేడీ సూచించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి డిజిటల్ తరగతి గదుల సాఫ్ట్‌వేర్‌లో ఇన్‌స్టాల్ చేసిన అంశాలకే పరిమితం కాకుండా ఆన్‌లైన్‌ద్వారా వెబ్‌సైట్‌లోని కొత్త అంశాలను కూడా విద్యార్థులకు పరిచయం చేయాలని కోరారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకొని సబ్జెక్టు పరంగా కొత్త విషయాలను దృశ్య శ్రవణ విధానం ద్వారా విద్యార్థులుకు అందించాలని కోరారు. డిజిటల్ తరగతి గదుల వినియోగంలో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వివరాలను కూడా ఆన్‌లైన్‌లో యాప్‌ద్వారా సకాలంలో నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఈ హాజరు నమోదుకు బయోమెట్రిక్ పరికరాలను, ట్యాబ్లను ఖచ్చితంగా వినియోగించాలని డీఈవో విజయభాస్కర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

రేపు హెచ్‌ఎంలు, టీచర్ల సమావేశం

డిజిటల్ తరగతులున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిజిటల్ తరగతి గదులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో విజయభాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ తరగతి గదుల్లో కొత్త అంశాలను విద్యార్థులకు పరిచయం చేసే విషయంలో అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

రామన్నకతువ ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ భాస్కర్‌నాయుడు

రాచర్ల: చినగానిపల్లె సమీపంలో రామన్నకతువ ద్వారా ముంపునకు గురవుతున్న భూములను గుర్తించి వారికి అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ భాస్కర్‌నాయుడు అన్నారు. ఇటీవల రామన్నకతువ కింద భూములు కోల్పోయిన రైతులు తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రామన్నకతువ నిర్మాణ పనులను అడ్డుకునేందుకు సైతం వెనుకాడబోమని చోళ్ళవీడు సర్పంచ్ ముత్యాల మధు, చినగానిపల్లె రైతు నాయకుడు పగడాల రమేష్ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. దీంతో ఆర్డీవో కిశోర్‌బాబు ఆధ్వర్యంలో రామన్నకతువ వద్ద బుధవారం ముంపుకు గురవుతున్న భూముల రైతుల సమావేశంలో తహసీల్దార్ కె.ఎలిజబెత్‌రాణి, డిప్యూటి తహసీల్దార్ కోన చెన్నకేశవులు పాల్గొన్నారు.

స్పెషల్ కలెక్టర్ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ రామన్నకతువ కింద సాగు చేస్తున్న భూములు మునిగిపోతున్న దశలో వాటిని గుర్తిస్తామన్నారు. రైతులు మాట్లాడుతూ రామన్నకతువ పనులు దాదాపు 80శాతంమేర పూర్తయ్యాయని, అయినప్పటికీ ముంపు బాధితులను గుర్తించడంలో జాప్యం జరుగుతుందన్నారు. చినగానిపల్లె, అచ్చంపేట గ్రామాలకు చెందిన 180 మంది రైతుల భూములు మునకకు గురవుతున్నాయని, తామందరికీ న్యాయం చేయాలని కోరారు. రికార్డులను పరిశీలించి ముంపు బాధితులను ఆదుకుంటామని స్పెషల్ కలెక్టర్ హామీ ఇచ్చారు.



సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

సంతతో అధిక లాభాలు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

రాచర్ల: వ్యాపారస్తులంతా ఒకచోట చేరి సంతలో అమ్మకాలు జరుపుకుంటే అధిక లాభాలు గడించే అవకాశం ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోపల్లి హైవే రోడ్డు సమీపంలో మేకల, గొర్రెలకు నూతనంగా ఏర్పాటుచేసిన సంతను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోనే మన నియోజకవర్గంలో అనేక మంది గొర్రెలపై జీవనాధారం సాగిస్తుంటారని అన్నారు. వీరు లావాదేవీలంతా జరుపుకోవాలంటే కర్నూలు జిల్లా నంద్యాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఫలితంగా, వ్యాపారస్తులతోపాటు జీవాల యజమానులకు కూడా ఎంతో వ్యయప్రయాసాలు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆకుమళ్ళ బాలవీరయ్య చెర్లోపల్లి సమీపంలో నూతనంగా సంత ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఈ సందర్భంగా ఆకుమళ్ళ బాలవీరయ్య మాట్లాడుతూ ప్రతి బుధవారం ఈ ప్రాంతంలో సంత నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ శ్రీను, గోపిరెడ్డి రమణారెడ్డి, చెర్లోపల్లి రంగస్వామిరెడ్డి, పందిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, పందిళ్ళపల్లి శ్రీనివాసులు, కొండయ్యయాదవ్, సూరా స్వామిరంగారెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట సుబ్బయ్య

మార్కాపురం టౌన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. కర్నూలు జిల్లా గుంతనాల గ్రామానికి చెందిన ముళ్ళపాటి వెంకట సుబ్బయ్య(27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నికరంపల్లి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మితో కలిసి గత నాలుగేళ్ళుగా మృతుడు మార్కాపురం పట్టణంలో సహజీవనం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిందంటూ చెప్పటంతో ఇరుగు పొరుగు వారు వచ్చి పరిశీలించే లోగా వెంకట సుబ్బయ్య మృతిచెంది ఉన్నాడు. ఆదిలక్ష్మి తమ బంధువులకు ఈ విషయం చేరవేస్తానంటూ అదే సమయంలో వెళ్ళిపోయి ఉదయం తిరిగి వచ్చినట్లు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ శ్రీకాంత్ అనుమానాస్పందంగా మరణించినట్లు కేసు నమోదు చేశామని తెలిపారు.

గుంటలో జారిపడి మహిళ మృతి



మృతి చెందిన తాళ్లూరి అంజలి

పొదిలి: మూసీవాగు ఇసుక గుంటలో జారిపడి మహిళ మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు దాసర్లపల్లికి చెందిన తాళ్ళూరి అంజలి(23) పశువులు మేపుకొనేందుకు పొలం వెళ్ళింది. పశువులు నీరు తాగేందుకు మూసీ వాగులోకి వెళ్ళగా ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న ఇసుక కుంటలో జారిపడి అంజలి మృతిచెందింది. సమీపంలో ఉన్న పశుకాపరులు కాపాడిన ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. సమాచారం తెలుసుకున్న పొదిలి ఎస్ఐ సుబ్బారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలక తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదరలో 150 మంది జ్వరపీడితులకు వైద్యపరీక్షలు

ముండ్లమూరు: మండలంలోని ఈదర గ్రామంలో 150 మంది జ్వరపీడితులకు మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వెంకట్రావు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి జ్వరాలు ఉన్నట్లు తెలిపారు. మిగత వారికి కీళ్ళనొప్పులు ఉన్నట్లు గుర్తించారు. జ్వరపీడితులకు మందులను కూడా పంపిణీ చేశారు. జు

మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలి

ఒంగోలు విద్య: సామాజిక భద్రత లేని కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించనున్న మిలీనియం మార్చ్‌ను, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ.సుబ్బారావు, జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు కేవీజీ.కీర్తి, బి.ఆశోక్‌కుమార్‌లు కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని వారు కోరారు.

కాంట్రాక్టు లెక్చరర్ల రెన్యూవల్ ఉత్తర్వులు జారీ

ఒంగోలు విద్య: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూడు నెలలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను ఎట్టకేలకు రెన్యూవల్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 3672మంది కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సేవలందిస్తున్నారు. కళాశాలలు ప్రారంభం తేది నుంచి ఆఖరు పని దినం వరకు వీరి సేవలు కొనసాగించాలని ఆదేశిస్తూ విద్యాశాఖ కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ ఉత్తర్వులు ప్రాతిపదికగా ఇంటర్మీడియట్‌విద్య కమిషనర్ మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. అదేవిధంగా 50శాతం వేతనాన్ని వెచ్చిస్తూ కూడా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందని ప్రభుత్వ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరగుంట సురేష్, వైజాన్‌బాబు తదితరులు తెలిపారు. ఉత్తర్వులు జారీచేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

సెప్టెంబర్‌లో హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు విద్య: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు గురువారం పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగే అవకాశలు కనిపించటం లేదు. పదోన్నతుల సీనియారిటీ జాబితా విషయంలో తాజాగా ట్రిబ్యునల్ స్కూలు అసిస్టెంట్ల సర్వీసు ప్రాతిపదికగా తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న పదోన్నతుల సీనియారిటీ జాబితాలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల సర్వీసును కూడా కలిపి వేసుకున్నవారు కొందరు ఉన్నారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులు ప్రకారం వీరి సర్వీసును సవరించి కేవలం స్కూలు అసిస్టెంటు సర్వీసును మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంది. ఆ ప్రకారం సీనియారిటీ జాబితాను సవరించి ఆర్‌జేడీ ఆమోదం కోసం పంపాల్సి ఉంది. ఆర్‌జేడీ ఆమోదం పొందిన తరువాత పదోన్నతుల కమిటీ ఆమోదంతో ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రక్రియ మొత్తం ఒకరోజులో పూర్తయ్యే అవకాశమే లేదు. జాబితాలను సవరించి సెప్టెంబరు మొదటి వారంలో హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈవో విజయభాస్కర్ తెలిపారు.

స్కూలు అసిస్టెంట్లకు మాత్రమే హెచ్‌ఎం పదోన్నతులు ఇవ్వాలి

ఒంగోలు విద్య: ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల స్కూలు అసిస్టెంట్లకు మాత్రమే పదోన్నతులు కల్పించాలని స్కూలు అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సుబ్బారావు, పీవీ.రమణకుమార్‌లు కోరారు. 1198లో కొందరు ఎస్‌జీటీలు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందారు 2001, 2002 సంవత్సరాలలో వారు ఎస్‌జీటీ నుంచి స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం హైస్కూలు హెచ్‌ఎంల పదోన్నతులకు స్కూలు అసిస్టెంట్ల సీనియారిటీ కాకుండా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సర్వీసును జాబితాలో నమోదు చేసుకున్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హెచ్‌ఎం పదోన్నతులకు స్కూలు అసిస్టెంట్ల సీనియారిటీని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు హెచ్‌ఎం పదోన్నతులకు స్కూలు అసిస్టెంటు సర్వీసును మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీని, జిల్లా విద్యాశాఖాధికారిని వారు కోరారు.

నేడు పలు సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు కల్చరల్ : సీవీఎన్ రీడింగు రూంలో గురువారం ఉదయం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబులు తెలిపారు. ప్రముఖ రంగస్థల నటులు, నామినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు పదవీ విరమణ సందర్భంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు కవి సమ్మేళనం, కవులు, కళాకారులకు సన్మానం, 11 గంటల నుంచి మల్లికార్జునరావు అభినందన సభ, సాయంత్రం నాలుగు గంటలకు సినీ సంగీత విభావరి, రాత్రి 8 గంటల నుంచి పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కొప్పోలు రోడ్డులోని జర్నలిస్టు కాలనీ వాసులకు అన్నీ అవస్థలే

సమస్యలతో విలవిల

సరైన రోడ్డు వ్యవస్థ లేదు.. డ్రైనేజీ వ్యవస్థ లేనేలేదు.. సక్రమంగా తాగునీరు ఏ రోజూ అందదు.. ప్రస్తుత వర్షాలకు పార్కు స్థలం అంతా చెరువు తలపిస్తోంది.. పగలూరాత్రి తేడా లేకుండా దోమల బెడద.. వీధి దీపాలు వెలుగులు అంతంతమాత్రమే... స్థూలంగా ఇదీ కొప్పోలు రోడ్డులోని జర్నలిస్టు కాలనీ దుస్థితి. నగర అభివృద్ధి జరుగుతున్నా శివారు కాలనీల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయనేదానికి నిలువెత్తు సాక్ష్యమే ఈ కాలనీ.


డ్రైనేజీ లేక ఇళ్ల ముందే మురుగు నిల్వ


వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న పార్కు స్థలం

ఒంగోలు కార్పొరేషన్ : ప్రజల సమస్యలను ప్రభుత్వం యంత్రాంగం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడాకి ప్రయత్నం చేసే జర్నలిస్టులకూ సమస్యలు తప్పలేదు. నగర పరిధిలోని కొప్పోలు మార్గంలోని జర్నలిస్ట్ కాలనీలో సమస్యలు పేరుకుపోయాయి. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ఆ కాలనీ అభివృద్ధికి దూరమైంది. కనీస తాగునీటి అవసరాలు తీరకపోగా, సరైన రహదారులూ కరువయ్యాయి. ఆ కాలనీలో అడుగు పెట్టాలంటేనే అయ్య బాబోయ్ అనే పరిస్థితి. ఇదిలా ఉండగా ఇళ్లలోని నీరు బయటకు పోయేందుకు సరైన డ్రైనేజి వ్యవస్థ లేదు. నివాసాల మధ్యే మురుగునీరు నిల్వచేరి దోమలమయంగా మారింది. ఇదిలా ఉండగా పార్కు కోసం కేటాయించిన స్థలంలో వర్షపు నీరు చేరి, చెరువును తలపిస్తోంది. మామూలు రోజుల్లోనే గతుకులమయంగా ఉండే రోడ్లలో వర్షం వస్తే బతుకుదెరువు కోసం బయటకు వస్తే తిరిగి ఇళ్లకు చేరలేని పరిస్థితి. వాహన కాలుష్యానికి దూరంగా, ప్రశాంత వాతావారణం తలపించేది భావించే పలువురు విలేఖరులతోపాటు, వివిధ వృత్తులు చేసుకునేవారు, ఉద్యోగులు సైతం నివసిస్తున్నారు. కోట్ల రూపాయలతో నగర అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు పోతున్న కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా కాలనీ అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఏరోజుకారోజు తాగునీటికి ఎదురు చూపులే

వరలక్ష్మి, స్థానికురాలు



మామూలు రోజుల్లోనే తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నాం. ప్రస్తుతం వేసవి చెరువుల్లో తాగునీరు లేదంటున్నారు. నగరానికి చివర కావడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నాం. వారం రోజులకు ఒక్కసారి వస్తే ఇంటి మొత్తానికి ఎలా సరిపోతాయి. కాలనీ ప్రజలను దృష్టిలో పెట్టుకుని, కుళాయిలు వేయాలి. అప్పటి వరకు మూడు రోజులకొకసారైనా ట్యాంకర్లతో నీరు అందించి ఆదుకోవాలి.

వర్షం వస్తే అడుగు బయట పెట్టలేం

గంటా సుబ్బారావు



కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం వస్తే బురదమయం, రోడ్లపై వర్షపు నీరు నిలుస్తుంది. కాలినడక కూడా కష్టమైపోతుంది. అధికారులు పట్టించుకోవాలి. రహదారులు నిర్మించాలి. కాలనీ అభివృద్ధిపై యంత్రాంగం దృష్టి సారించి ఆదుకోవాలి.

కాలువలు అధ్వానంగా ఉన్నాయి

జీవి కృష్ణ



కాలనీలో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఇళ్లలో మురుగునీరు బయటకు పోవడం లేదు. దోమల వ్యాప్తి చెందుతున్నాయి. కనీస ఫాగింగ్ కూడా లేదు. ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలుస్తుంది. ఖాళీ స్థలాలో నీరు తొలగింపు చర్యలు చేపట్టాలి. మౌలిక వసతులు కల్పించాలి.

నగరంలో ఈ వారం

నేడు సైకత గణపతి నిమజ్జనం

ఒంగోలు కలెక్టరేట్ : అంజయ్యరోడ్డులోని ఉగ్గలగుంటలో ప్రతిష్ఠించిన పర్యావరణ హిత సైకతగణపతి నిమజ్జన కార్యక్రమం గురువారం సాయంత్రం ఐదు గంటలకు యథా స్థానంలో నిమజ్జన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పర్యావరణ సంస్థ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పర్యావరణ సంస్థ చైర్మన్ జి. వీరభద్రాచారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. నిర్వాహకులు మద్దులూరి శ్రీనివాసులు, పిల్లుట్ల సుధాకర్, జె.కె. స్వామి, గోగు శివ, ఎన్.పురంధరదాసు, కె. ఈశ్వరయ్య, గంటా శ్రీనివాసరావు, పి. పిచ్చయ్య, కేతా చలపతిరావు, ఎం. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు పి.వి.ఆర్ ప్రసాద్ సంతాపసభ

ఒంగోలు కల్చరల్ : హిందూ ధర్మ సంరక్షణ ట్రస్టు వ్యవస్థాపకుడు, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యనిర్వహణాధికారి పి.వి.ఆర్.కె.ప్రసాద్ సంతాపసభ శుక్రవారం ఒంగోలు స్వాతి కల్యాణ మండపంలో జరుగుతుందని సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే సభలో శ్రీ ప్రణవానంద స్వామి, స్వామి సత్యాత్మానంద, స్వామి పరిపూర్ణ సిద్ధానంద, దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనరు వెండిదండి శ్రీనివాసరెడ్డి, జిల్లాలోని ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

రేపు గిద్దలూరులో ఎన్‌ఎఫ్‌టీఈ జిల్లా మహాసభలు

ఒంగోలు వ్యవసాయం : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికం ఎంప్లాయీస్ టెలికం ప్రకాశం జిల్లా మహాసభ సెప్టెంబరు నెల 1వ తేదీ గిద్దలూరులోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో జరుగుతుందని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వి.రామలింగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టెలికం జనరల్ మేనేజర్ చంద్రసేన, ఏఐటీయూసీ నాయకులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ సర్వీసుల అభివృద్ధి - ఉద్యోగుల పాత్ర అనే అంశంపై సదస్సు జరుగుతుందని రామలింగం పేర్కొన్నారు.

రేపు జరిగే సభను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్ : అగ్రిగోల్డు బాధితుల సభ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు అద్దంకి బస్టాండులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఉప్పుటూరి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు నాయకత్వంలో ఈనెల 16న శ్రీకాకుళం నుంచి బస్సు యాత్ర బయలుదేరిందని, ఈ యాత్ర ఈ నెల 1వ తేదీన ఒంగోలు చేరుకుంటుందని, అద్దంకి బస్టాండులో బహిరంగ సభలో అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్లు పాల్గొనాలని కోరారు.

పెళ్లూరు చెరువు కింద వరి సాగు చేయవద్దు

ఒంగోలు రూరల్ : పెళ్లూరు చెరువు కింద ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంట సాగు చేయవద్దు అని ఏవో పి.వేణుగోపాల్ చెప్పారు. నగర పరిధిలోని పెళ్లూరు గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ చెరువు కింద భూములు గల రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కంజుల రామకృష్ణారెడ్డి, ఎంపీఈవో తెల్లమేకల జగదీష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

థియేటర్ --- సినిమా

సత్యం --- అర్జున్‌రెడ్డి

రత్నమహల్---ఆనందోబ్రహ్మ

గోపి ---జయజానకి నాయక

సాయిసరోజ్ -- లై

తులసీరాం --- ఫిదా

జయరాం ---నక్షత్రం

గోరంట్ల సినిమాస్ స్క్రీన్సలలో----

గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ, అర్జున్‌రెడ్డి

ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలి

ఒంగోలు రూరల్ : గ్రామస్థులు ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని ఏఎంసీ వైస్ చైర్మన్ మక్కెన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెంలో బుధవారం డ్వాక్రా గ్రూపు మహిళలు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్సీకాలనీ రోడ్డులో సుమారు 320 మొక్కలు నాటినట్లు సీసీ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపు గ్రామ అధ్యక్షురాలు పార్వతి, విలేజి ఆరనైజర్ కృష్ణవేణి, డ్వాక్రాగ్రూపు మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి



చెక్కు పంపిణీ చేస్తున్న జనార్దన్

శాసనసభ్యులు దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్ : విద్యార్థులు కేవలం విద్య నేర్చుకోవటమే కాకుండా విజ్ఞానాన్ని, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఒంగోలు ఎంఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం ఉదయం జరిగిన కాకతీయ మహిళా ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఫౌండేషన్ రెండేళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయన రాత పుస్తకాలు, పేద విద్యార్థులకు చెక్కుల పంపిణీ చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాదని, వారు సమాజంలో ఎన్నో మంచి మార్పులకు, సేవా కార్యక్రమాలకు మార్గదర్శకులని చెప్పారు. కాకతీయ మహిళా ఫౌండేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా మహిళలు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ అధ్యక్షురాలు రావిపాటి మాధవి మాట్లాడుతూ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి వీరెళ్ల రమాదేవి, కోశాధికారి నల్లూరి జ్యోతి పాల్గొన్నారు.